సోమవారం
15-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 84
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

శాంతి ఎంతో దూరం లేదు: ఎర్డోగన్

ఇస్తాంబుల్: ఉక్రెయిన్-రష్యా మధ్య త్వరలో శాంతి నెలకొంటుందని టర్కీ అధ్యక్షుడు తయ్యాప్ ఎర్డోగన్ ఆకాంక్షించారు. ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ఉక్రెయిన్-రష్యా శాంతి ప్రణాళికలపై చర్చించామని, అభిప్రాయాలు పంచుకున్నామని, శాంతి ఎంతో దూరం లేదని ఎర్డోగన్ అన్నారు. తుర్కమెనిస్థాన్‌లో పుతిన్-ఎర్డోగన్ భేటీ అయ్యారు. సమావేశం చిత్రాలను ఎర్డోగన్ కార్యాలయం విడుదల చేసింది.

దేశానికి త్వరలో కొత్త ప్రధాని: చవాన్

ముంబై: దేశానికి త్వరలో కొత్త ప్రధాని రావచ్చని మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యానించారు. 'త్వరలో రాజకీయ ప్రకంపనలు వస్తాయి. కేంద్రంలో నాయకత్వం మారుతుంది' అని అన్నారు. ఒక మరాఠీ వ్యక్తి దేశానికి ప్రధానమంత్రి కాబోతున్నట్లు తెలిపారు. అమెరికాలో ఈనెల 19న విడుదల కానున్న జెఫ్రీ ఎప్ స్టీన్ ఫైళ్లు పర్యవసానంగా కొత్త ప్రధాని వచ్చే అవకాశం ఉందని, ఆ వ్యక్తి మహారాష్ట్రకు చెందిన వారు కావచ్చని అన్నారు. నెలలోపు మరాఠీ ఈ పరిణామం

- మిగతా 2 లో

సాల్ట్‌లేక్ స్టేడియంలో గవర్నర్ తనిఖీలు

కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ కార్యక్రమంలో గందరగోళం ఏర్పడిన నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆదివారం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో స్వయంగా తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్‌పంత్, సీనియర్ పోలీసులు అధికారులు కూడా ఉన్నారు. గవర్నర్ తన సమీక్షలో భాగంగా స్టేడియంలోని వివిధ భాగాలను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. "ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీని నేను కలిశాను. వాళ్లు చాలా

- మిగతా 2 లో

బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన బీహార్‌లో కేబినెట్ మంత్రిగా పనిచేస్తున్నారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు అధికారికంగా ఆయన పేరు ఖరారు చేసింది. బీహార్‌కు చెందిన సీనియర్ నాయకుడైన నితిన్ నబీన్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆయనకు అనుభవం ఉంది. క్రమశిక్షణ, నిర్వాహణా నైపుణ్యం, యువ నాయకత్వం వంటి లక్షణాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ఆయనను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఓట్ల దొంగల్ని గద్దె దించుదాం

కమలనాథులు నాటకాలరాయుళ్లు

దిల్లీ మెగా ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేతల మండిపాటు

- మోదీ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిన 'రామ్‌లీలా'
- బీజేపీ- ఆర్ఎస్ఎస్‌పైనే మా పోరు: ఖర్గే
- అధికారంలోకి వస్తే సీఈసీ బిల్లు మార్పు: రాహుల్
- బ్యాలెట్ ఓటింగ్‌తో గెలవగలరా: ప్రియాంక

న్యూఢిల్లీ: 'ఓట్ల దొంగ... గద్దె దిగిపో' నినాదంతో ఓట్ చోరీపై దేశవ్యాప్త ఉద్యమాన్ని కాంగ్రెస్ మరింత ఉధృతంగా చేపట్టింది. ద్రోహులను, నాటకరాయుళ్లను అధికారానికి దూరం చేయాలంటూ దిల్లీ రామ్‌లాలీ మైదానం వేదికగా శనివారం పిలుపునిచ్చింది. అధికారాన్ని అడ్డుపెట్టకొని ఓట్లు దోచుకుంటున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని దేశ ప్రజలకు సూచించింది.కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ఓట్ చోరీపై భారీ ర్యాలీని కాంగ్రెస్ నిర్వహించింది. దేశ

- మిగతా 2 లో

రాహుల్ పోరులో భాగస్వాములవ్వండి

రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ: నేడు ఓటు హక్కు హరణకు ప్రయత్నాలు జరుగుతుంటే తదుపరి ఆధార్ కార్డు, రేషన్ కార్డును తొలగిస్తారని కాంగ్రెస్ నేత, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. దిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన మెగా ర్యాలీలో ఆయన మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, పేదలకు ఓటు హక్కు కల్పించడంపై రాజ్యాంగ సభ చర్చించినప్పుడు ఆర్ఎస్ఎస్ అడ్డుచెప్పిందని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని కలిసివున్న మోదీ ప్రభుత్వానికి 400 స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మరుస్తారని, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ హెచ్చరించినందునే 240 స్థానాలను మించకుండా ప్రజలు చేశారని అన్నారు. తద్వారా రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని కాపాడుకున్నారన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కు హరణకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. నాడు పేదలు, దళితులు, ఆదివాసులు, మైనారిటీల కోసం గాంధీ, అంబేద్కర్ నిలబడ్డారు... ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే పోరాడుతున్నారని, వారికి అండగా నిలుద్దామని ప్రజలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ పోరాటంలో కలిసి సాగేందుకు

- మిగతా 2 లో

రెండో విడతలోనూ

హస్తం హవా

- కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల ముందంజ
- 85.76 శాతం పోలింగ్ నమోదు
- 415 సర్పంచ్... 8,304 వార్డులు ఏకగ్రీవం

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో రెండో విడత జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగుతోంది. ఆదివారం రాత్రి పది గంటలకు ప్రకటించిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 1,362 సర్పంచ్ స్థానాల్లోను, బీఆర్ఎస్ 652, బీజేపీ మద్దతుదారులు 171, ఇతరులు 385 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 85.86 శాతం పోలింగ్ నమోదైంది. 3,911 సర్పంచ్, 29,917 వార్డు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆయా పంచాయతీల్లో ఓట్ల లెక్కింపు చేపట్టారు. మూడు గంటల నుంచి ఎన్నికల ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడ్డాయి. రెండో విడతలో 4,332

సర్పంచ్ స్థానాలకు 415, వార్డుల్లో 38,322కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. జిల్లా వారీగా చూస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 92 శాతం పోలింగ్ నమోదు

- మిగతా 2 లో

మెస్సీ పర్యటన 'దేశానికి స్వర్ణ క్షణం'

- ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సచిన్ భావోద్వేగ వ్యాఖ్యలు
- మెస్సీతో పాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ రాక

ముంబై: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ముంబై పర్యటనను భారత క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ 'ముంబైకి, దేశానికి ఒక స్వర్ణ క్షణం'గా అభివర్ణించారు. ఆదివారం ముంబైలో జరిగిన కార్యక్రమంలో సచిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. మెస్సీ, అతని సహచరులు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ తో కలిసి ముంబైకి వచ్చారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ... ఈ మైదానంలో నేను ఎన్నో అద్భుత క్షణాలను అనుభవించాను. ముంబై కలల నగరం. అనేక కలలు ఈ వేదికపై సాకారం అయ్యాయి. అభిమానుల మద్దతు లేకపోతే, 2011లో ఈ మైదానంలో మేము ఆ స్వర్ణ క్షణాన్ని చూడలేకపోయేవాళ్లం అని అన్నారు. ఇక ఈ రోజు ఈ ముగ్గురు గొప్ప ఆటగాళ్లు ఇక్కడ ఉండటం ముంబైకి, ముంబై ప్రజలకు, భారతదేశానికి నిజంగా ఒక స్వర్ణ ఘట్టం. మీరు వారిని స్వాగతించిన తీరు అసాధారణం అని సచిన్ అన్నారు. అయితే మెస్సీ ఆట గురించి మాట్లాడేందుకు ఇది సరైన వేదిక కాదని, ఎందుకంటే అతడు తన కెరీర్‌లో అన్ని సాధించాడని సచిన్ అన్నారు. లియో విషయానికి వస్తే ఏం చెప్పాలి? అతడు అన్నీ గెలిచాడు. అతడి అంకితభావం, పట్టుదల, నిబద్ధత మాకు ఎంతో ప్రేరణనిస్తాయని వ్యాఖ్యానించారు. మెస్సీ వినయాన్ని ప్రశంసించిన సచిన్, యువతను ప్రోత్సహిస్తున్నందుకు అతనికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో భారత ఫుట్‌బాల్ కూడా కోరుకున్న స్థాయికి చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచిన్, తన సంతకం చేసిన నంబర్ 10 జెర్సీని మెస్సీకి బహూకరించారు. దీనికి ప్రతిగా అర్జెంటీనా వరల్డ్‌కప్ విజేత కెప్టెన్ మెస్సీ సచిన్‌కు ఒక ఫుట్‌బాల్ అందజేశాడు. మెస్సీ 'గోట్ ఇండియా టూర్ 2025'లో భాగంగా ముంబైకి వచ్చారు. భారీ భద్రత నడుమ ఆయన మధ్యాహ్నం ముంబై చేరుకున్నారు. ఇది ఆయన నాలుగు నగరాల పర్యటనలో రెండో రోజు. సోమవారం ఆయన న్యూఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవనున్నారు. దీనితో భారత్ పర్యటన ముగియనుంది. శనివారం తెల్లవారుజామున మెస్సీ భారత్‌కు చేరుకున్నప్పటికీ.. కోల్‌కతా పర్యటనలో గందరగోళం, భద్రతా లోపాలు చోటుచేసుకున్నాయి. అయితే హైదరాబాద్ పర్యటన మాత్రం ప్రశాంతంగా సాగి, సానుకూలంగా ముగిసింది.

ఐటీ ఉద్యోగుల పని గంటలు, ఉద్యోగ భద్రతపై సమగ్ర చట్టం

కూనంనేని డిమాండ్



విశాలాంధ్ర- హైదరాబాద్: ఐటీ ఉద్యోగుల పని గంటలు... ఉద్యోగ భద్రతకు సంబంధించి సమగ్ర చట్టం తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఐటీ ఉద్యోగుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేరుకు వైట్ కలర్ ఉద్యోగులైనప్పటికీ విపరీతమైన పనిగంటలతో పాటు, మానసిక ఒత్తిడికి, చిన్న వయసులోనే వ్యాధులకు గురౌతున్నారని పేర్కొన్నారు. వారి ఉద్యోగాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. యాజమాన్యాలు ఎప్పుడుపడితే అప్పుడు ఉద్యోగాలు తీసివేయడం, రాజీనామా చేస్తే డబ్బులు చెల్లించాలనే అగ్రిమెంట్లు రాయించుకోవడంపై జస్టిస్ నాగేష్ భీమపాక ధర్మాసనం వ్యాఖ్యలు ఆహ్వానించదగ్గవన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, పని గంటలకు సంబంధించి సమగ్ర చట్టం తీసుకురావాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

సిడ్నీ బీచ్ రక్తసిక్తం

- దుండగుల కాల్పుల్లో 12 మంది మృతి
- అమెరికా బ్రౌన్ వర్సిటీలోనూ ఇద్దరి కాల్చివేత

సిడ్నీ/వాషింగ్టన్: ఆస్ట్రేలియా, అమెరికాలో కాల్పులు కలకలం రేపాయి. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలోని బాండి బీచ్‌లో యూదుల ఉత్సవం లక్ష్యంగా ఆదివారం కాల్పులు జరిగాయి. 12 మంది చనిపోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. కాల్పులు జరిపిన ఇద్దరు దుండ గులు పట్టుబడ్డారు. ఈ ఘటనను ఆస్ట్రేలియాతో పాటు బ్రిటన్, ఇజ్రాయిల్, న్యూజిలాండ్, యూరప్ అధినేతలు ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అయితే ఇది ఉగ్రదాడి అన్న అనుమానం కూడా వ్యక్తమైంది. అటు అమెరికా, రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో పరీక్ష జరుగుతున్న సయమంలో ఓ సాయుధుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. సిడ్నీ బీచ్‌లో అక్కడి కాలమానం ప్రకారం సాయంత్రం 6.30 గంటలప్పుడు కాల్పులు చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. పర్యాటకులతో సందడిగా ఉన్న సమయంలో బీచ్‌లోకి వచ్చిన ఇద్దరు సాయుధులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. దీంతో అక్కడ ఉన్న వారంతా భయంతో పరుగులు తీశారు. అరుపులు, కేకలతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. నల్ల ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు సర్ఫ్ క్లబ్ పక్కనే ఉన్న పాదచరుల వంతెపై నుంచి షాట్‌గన్స్‌తో కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. హనుక్కా వేడకలు లక్ష్యంగా దాడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇది యూదుల ఉత్సవం. విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని దుండగులను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని హెలికాప్టర్లు, 30 అంబులెన్సుల సహాయంతో ఆసుపత్రులకు తరలించినట్లు సమాచారం. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పోలీసు కమిషనర్‌తో, న్యూ సౌత్‌వేల్స్ ప్రధానితో మాట్లాడారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. కాగా, దుండుగుల్లో ఒకరిని ఓ యువకుడు ధైర్యంగా అడ్డుకున్నాడు. వెనుక నుంచి వెళ్లి అతనిని పట్టుకొని, తుపాకీ లాక్కున్నాడు. అతనిని అక్కడ నుంచి వెళ్లగొట్టేందుకు యత్నించాడు. దీంతో మరో దుండగుడు కూడా కాస్త వెనక్కి తగ్గాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

అమెరికాలో... బ్రౌన్ యూనివర్సిటీ ఘటనలో ఇద్దరు మరణించారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. పరీక్ష

- మిగతా 2 లో

చిన్న పరిశ్రమలు చిగురించేలా...

- మొదటి దశలో 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు
- ఆర్థికవృద్ధిలో కీలక పాత్ర
- 60:40 నిష్పత్తిలో నిధుల కేటాయింపు
- యువతకు ఉపాధి లక్ష్యంగా అడుగులు

విశాలాంధ్ర - సచివాలయం: చిన్న పరిశ్రమలు చిగురించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాట్లు చేస్తోంది. పెద్ద తరహా పరిశ్రమలతో పోలిస్తే పదిరెట్లు ఉపాధి అవకాశాలు ఎంఎస్ఎంఈల్లో లభిస్తాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కీలకపాత్ర పోషిస్తాయని... ఈ రంగం అభివృద్ధికి ఇతర రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను అవలంభించాలని స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం-2047 లక్ష్యంపై ఏర్పాటైన టాస్కోర్స్ కమిటీ సూచించింది. భారీ, మెగా పరిశ్రమలతో పోలిస్తే 10 రెట్లు ఎక్కువ ఉపాధి అవకాశాలు ఇందులో వస్తాయని, అందుకు అనుగుణంగా అనువైన వాతావరణం పెంపొందించాలని పేర్కొంది. 'ఎంఎస్ఎంఈల కోసం ప్రతి పారిశ్రామిక పార్కులో కామన్ ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుకు తక్కువ ధరకు ఐదు నుంచి 10 ఎకరాలు కేటాయించాలి. ఛార్టెడ్ అకౌంటెంట్, సివిల్ ఇంజినీర్, ఆర్థిక, ఐటీ నిపుణులతో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా మెంటార్‌షిప్ అందించి సిక్ యూనిట్ల నిర్వహణ సమస్యలను పరిష్కరించాలి' అని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం, ఉత్పత్తి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అందుకు అనువైన వాతావరణం కల్పించేలా కూటమి ప్రభుత్వం పారిశ్రామిక పార్కుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిసారించింది. అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పొణ్యం, డోన్, ఆత్మకూర్, దర్శి, పుట్టపర్తిలో

- మిగతా 2 లో

దిల్లీ ఉక్కిరి బిక్కిరి

- మరింత పెరిగిన వాయు కాలుష్యం
- హర్యానాలో పొగమంచు బీభత్సం

5లో

బంగ్లాదేశ్ అలర్ట్

యువ నేతపై కాల్పులు భద్రత పెంపు

ఢాకా: బంగ్లాదేశ్‌లో యువ నేత కాల్పులు కలకలం రేపాయి. ఇంక్విలాబ్ మంచా నేత షరీఫ్ ఒస్మాన్ హదీ మృత్యువుతో పోరాడుతున్నారు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉంది. వైద్యులు ఆయనకు వెంటిలేటర్ ఏర్పాటు చేశారు. దీంతో అప్రమత్తమైన యనస్ ప్రభుత్వం వెంటనే దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసింది. అక్రమ కార్యకలాపాలను అణచివేసేలా పహారా పెంచింది. ఫిబ్రవరి 12న జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థి, ఇంక్విలాబ్ మంచా నేత షరీఫ్ ఒస్మాన్ హదీపై శుక్రవారం హత్యా ప్రయత్నం జరిగింది. సెంట్రల్ ఢాకాలోని బిజాయ్‌నగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిన క్రమంలో ఆయనపై కాల్పులు జరిగాయి. ఈ ఘటనపై హోం వ్యవహారాల శాఖ సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) జహంగీర్ ఆలం చౌదరి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెరుగుతున్న అక్రమ ఆయుధాల ముప్పును ఎదుర్కొనేందుకు, ప్రజా భద్రతకు హామీ ఇచ్చేందుకు తమ ప్రభుత్వం త్వరలో ఆపరేషన్ డెవిల్ హంట్ రెండవ దశను ప్రారంభించబోతోందని వెల్లడించారు.

మాజీ అధినేత్రి షేక్ హసీనా మద్దతుదారులు, అనుచరులు లక్ష్యంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో డెవిల్ హంట్ మొదలైంది. కాగా, షరీఫ్ ఒస్మాన్ హదీపై కాల్పులు జరిపిన వారి ఆచూకీ తెలియజేస్తే 50 లక్షల టాకా (40,985.81 డాలర్లు) నగదు పురస్కారమిస్తామని చౌదరి ప్రకటించారు. అనుమతుడిని చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. అతనిని ఫైసల్ కరీం మసూద్‌గా గుర్తించారు. బైక్‌పై వచ్చి షరీఫ్‌పై కాల్పులు జరిపిన ముగ్గురితో ఇతను ఉన్నట్లు తెలిపారు.

తీవ్రంగా గాయపడిన షరీఫ్‌ను తొలుత ఢాకా మెడికల్ కాలేజ్ హాస్పిటల్ (డీఎంసీహెచ్)కు ఆపై ఎవర్ కేర్ ఆసుపత్రికి తరలించారు. షరీఫ్‌ను లైఫ్ సపోర్ట్‌పై ఉంచినట్లు డీఎంసీహెచ్ డైరెక్టర్ బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ చెప్పారు. ఎవర్‌కేర్ వైద్యులు కూడా ఆయన ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ప్రాణాపాయం తప్పలేదన్నారు. ఏ సర్జరీ చేసేందుకు మెడికల్ బోర్డు ఒప్పుకోలేదని చెప్పారు. నిందితులను వెతికి పట్టుకునేందుకు ఆపద్ధర్మ ప్రభుత్వాధినేత యూనస్ కూడా ఆదేశాలిచ్చింది. షరీఫ్ కుటుంబాన్ని కలిశారు. అన్ని విధాలా సహాయం చేస్తామని హామీనిచ్చారు. షరీఫ్ కోలుకోవాలని యావత్ దేశం ప్రార్థిస్తోందని యూనస్ తెలిపారు.

దక్షిణాఫ్రికాలో కూలిన అహోబిలం ఆలయం

భారత సంతతి అధికారి సహా నలుగురి దుర్మరణం

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా, క్వాజులు నాటల్ ప్రావిన్స్‌లో రెండేళ్లుగా నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల న్యూ అహోబిలం ఆలయం కులిపోయింది. నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగినప్పుడు కార్మికులు, ఆలయ అధికారులు విధుల్లో ఉన్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భారీ కట్టడం కావడంతో శిథిలాల తొలగింపు సవాల్‌గా మారిందన్నారు. ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండే ఈ ఘటనలో చనిపోయినట్లు వెల్లడించారు. రెండేళ్లుగా ఆలయ అభివృద్ధికి పాండే కృషి చేస్తున్నారని ఆలయ అన్నదాన విభాగం డైరెక్టర్ శాన్‌వీర్ మహారాజ్ చెప్పారు. కాగా, ఆలయం ఎలా కూలిందో తేలాల్సివుందన్నారు. భారతీయులు అత్యధికంగా ఉండే రెడ్‌క్లిఫ్ పట్టణంలో భారత సంతతికి చెందిన కుటుంబం న్యూ అహోబిలం నరసింహస్వామి ఆలయం నిర్మాణం చేపట్టింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు దక్షిణాఫ్రికా రియాక్షన్ యూనిట్ అధికార ప్రతినిధి ప్రేమ్ బలరామ్ తెలిపారు. శిథిలాల కింద ఎంత మంది చిక్కుకున్నారో కచ్చితంగా చెప్పలేమని అన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి నిర్వాహకులు అనుమతి తీసుకోలేదని, ఇది అక్రమ కట్టడమని ఈతెక్విని మున్సిపాల్టీ (డర్బన్) పేర్కొంది. ఓ కొండపై రెండేళ్ల కిందట ఆలయ నిర్మాణం మొదలైంది. ఘటన స్థలాన్ని మంత్రి తులసిజ్వే బతేలేజీ పరిశీలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లినప్పటికీ సహాయక చర్యలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా ప్రత్యేక జాగిలాలను కూడా రంగంలో దించామని ఆయనన్నారు.

సాల్ట్‌లేక్ స్టేడియంలో గవర్నర్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

లోతుగా అన్ని విషయాలను పరిశీలిస్తున్నారు. ఇది మనందరికీ కనువిప్పు కావాలి. ఇది ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా కోల్‌కతా ఫుట్‌బాల్ అభిమానులకు అంతులేని అవమానాన్ని తెచ్చిపెట్టింది. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని తీసుకురావాలి. ఎందుకంటే, కేవలం డబ్బు కోసం ఒక ప్రైవేటు సంస్థకు క్రీడా కార్యక్రమాలను అనుమతించి, ప్రజలను బాధపెట్టకూడదు. ఇందులో పరిపాలనకు సంబంధించిన పెద్ద సమస్యలు ముడిపడి ఉన్నాయి. అలాగే ప్రజల ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు కూడా దీనికి ముడిపడి ఉన్నాయి. బాధితులతో చర్చించిన తర్వాత నేను ఓ నివేదికను సంబంధిత అధికారులకు సమర్పిస్తాను. దానిలోని విషయాలను ఇప్పుడే నేను చెప్పలేను. కానీ ఆ నివేదిక దాదాపు సిద్ధంగా ఉంది" అని ఆనంద బోస్ పేర్కొన్నారు. శనివారం సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ కార్యక్రమం నిర్వహించారు. అయితే మెస్సీ చాలా కొద్ది సేపే ఉండడం, ఆయన చుట్టూ అధికారులు, పోలీసులు ఉండడంతో అభిమానులు ఆయనను చూడలేకపోయారు. దీంతో పెద్ద గందరగోళం ఏర్పడిన సంగతి విదితమే. సుదూర ప్రాంతాల నుంచి మెస్సీని చూడడానికి వచ్చిన అభిమానులు ఆగ్రహానికి గురై, స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ చైర్లు, వస్తువులు విసిరడంతో మరింత గందరగోళం జరిగింది. ఈ నేపథ్యంలో గవర్నర్ సీవీ ఆనంద బోస్ స్టేడియం దగ్గరకు వెళ్లారు. కానీ లోపలకు వెళ్లలేకపోయారు. కాగా, దీనిపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఓ ఉన్నత స్థాయి విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీకి కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అసిమ్ కుమార్ రే నేతృత్వం వహిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పంత్, హోం కార్యదర్శి నందిని చక్రవర్తి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ కూడా ఆదివారం విచారణ నిమిత్తం స్టేడియాన్ని సందర్శించింది.

బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీలో కీలక పదవుల్లో ఒకటి. పార్టీ జాతీయ అధ్యక్షుడికి సహకరించడం, దేశవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షించడం, ఎన్నికల వ్యూహాలను అమలు చేయడం వంటి బాధ్యతలు ఉంటాయి. బీహార్ నుంచి జాతీయ స్థాయిలో ఇంత పెద్ద పదవి రావడం అరుదు. రాబోయే ఎన్నికల దృష్ట్యా యువ నాయకత్వాన్ని ముందుకు తేవాలనే ఉద్దేశంతోనే ఈ నియామకం జరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నితిన్ నబీన్‌కు బీహార్‌లో ఉన్న బలమైన మద్దతు, ఆయన నిర్వాహణా అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని పార్టీ భావిస్తోంది.

దేశానికి త్వరలో కొత్త ప్రధాని: చవాన్

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకోవచ్చని ఆయన ఇటీవలే ఓ పోస్ట్ చేశారు. తాజాగా పింప్రి చించ్వాడ్‌లో సామాజిక కార్యకర్త మానవ్ కాంబ్లే రాసిన జనగణమన పుస్తకావిష్కరణ సందర్భంగానూ వెల్లడించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల భారత్‌లో రాజకీయ గందరగోళానికి దారి తీస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఘటనలు భారత రాజకీయాలపై బలమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చవాన్ అన్నారు. 'అమెరికన్ కాంగ్రెస్ నవంబరు 19న ఒక చట్టాన్ని ఆమోదించింది. డిసెంబర్ 19న స్టింగ్ ఆపరేషన్‌లో పట్టుబడిన ప్రముఖుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. అమెరికాలోని ఓ ఇంట్లో ఇజ్రాయిల్ గూఢచారి రహస్య కెమెరాల ద్వారా సేకరించిన ఒక రికార్డింగ్‌లో చాలా మంది నాయకుల ఫోటోలు, వీడియోలు ఉన్నాయి. ఈ పేర్లలో కొన్ని ఇప్పటికే బయటకు వచ్చాయి. ఎవరి పేర్లు ఉంటాయనే దాని గురించి వివరణాత్మక సమాచారం లేదు కానీ, ఈ పరిణామాల పర్యావసానాలు అమెరికాకే పరిమితం కాదు, భారత్ సహా అనేక దేశాలలో కనిపించవచ్చు' అని చవాన్ వెల్లడించారు. కాగా, జెఫ్రీ ఎప్ స్టీన్ ఒక ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త. మైనర్లతో లైంగిక కార్యకలాపాల కేసులో శిక్ష పడిన ఆయన 2019లో జైలులో మరణించాడు. ఆయన ఫైళ్లను బహిర్గతం చేయనున్నారు. అదే రోజున భారత్‌లో రాజకీయ ప్రకంపనలు రావొచ్చని చవాన్ చెప్పడం చర్చనీయాశంగా మారింది.

కళ్లు మూసుకున్న ఈసీ: ప్రియాంక

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికలు న్యాయంగా, పారదర్శకంగా జరగడం లేదని, ప్రతి దశ అనుమానాన్ని కలిగిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియంక గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని దుయ్యబట్టారు. రాజ్యాంగ బద్ధ విజన్‌కు తూట్లు పొడుస్తున్నారని, ఓటు హక్కును హరిస్తున్నారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో మన నిరసన గళం ప్రధాని నివాసం వరకు మార్మోగాలంటూ ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' ర్యాలీలో ప్రియాంక పిలుపునిచ్చారు. 'మీ ఓటు ఎంతో ప్రధాన్యత ఉన్నదో గుర్తించండి. దేశంలోని ప్రతి ఒక్కరు భరతమాత బిడ్డలని తొలి ప్రధాని నెహ్రూ అన్నారు. ఆ ఒక్క ఆలోచన మన రాజ్యాంగానికి రూపాన్ని ఇచ్చింది. తద్వారా మనకు ఓటు హక్కు లభించింది. కానీ ఇప్పుడు తన స్వప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధ వ్యవస్థలను ప్రభుత్వం ఒత్తిడికి గురిచేస్తోంది. దేశంలోని అన్ని వ్యవస్థలను తలొగ్గేలా చేస్తోంది. ఎన్నికల ప్రక్రియ సమగ్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల అక్రమాలను ఈసీ విస్మరిస్తోంది. పోలింగ్ సమయంలో ఓట్ల చోరీ జరుగుతున్నా... రూ.10వేలు చెల్లిస్తున్నా తమకు పట్టదన్నట్లుగా కళ్లుమూసుకుంటోంది' అని ప్రియాంక వ్యాఖ్యానించారు. ఓటములతో ముఖ్యంగా బీహార్ పరాభవం కారణంగా మనోధైర్యం కోల్పోవద్దని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, బీజేపీ కేవలం ఓట్ల దొంగతనం ద్వారానే గెలిచిందని యావత్ దేశానికి తెలుసునని ఆమె నొక్కిచెప్పారు. తాజా పార్లమెంటు సమావేశాల్లో అతికష్టం మీద ఒకటి, రెండు సెషన్లు జరిగాయన్నారు. ఈవీఎంల ద్వారా ఓట్ల చోరీ జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ఖర్గే సభలో ప్రస్తావిస్తే... వారు (బీజేపీని ఉద్దేశించి) భయపడిపోయారని, చర్చకు ఒప్పుకోలేదని అన్నారు. ఎన్నికలను న్యాయంగా, బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించి బీజేపీ గెలవగలదా?' అని ప్రియాంక్ సవాల్ విసిరారు.

కొరవడిన తటస్థ వ్యవస్థ: కేసీ వేణుగోపాల్

దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, న్యాయంగా జరగేలా చూసేందుకు 'న్యూట్రల్ అంపైర్' లేక ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు ఏర్పడిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇందుకోసమే ప్రచారం, ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ఓట్ల చోరీపై పార్లమెంటులో చర్చించినట్లు చెప్పారు. 'మేము నిరాధార ఆరోపణలు చేయడం లేదు. ఆధారాలు చూపిస్తున్నాం. సంస్కరణలను సూచిస్తున్నాం' అని ఓట్ల చోరీపై వేణుగోపాల్ అన్నారు. ఈవీఎంలలో లోపాలపై చాలా ఫిర్యాదులు ఉన్నాయన్నారు. నకిలీ ఓట్ల గురించి రాహుల్ గాంధీ బయట పెట్టారని, బీజేపీకి లబ్ధి చేకూర్చేలా అక్రమాలు జరుగుతుండటం గురించి విలేకరుల సమావేశాల్లో బహిర్గతం చేశారని, కాంగ్రెస్ ఫిర్యాదులను ఎన్నికల సంఘం నిర్లక్ష్యం చేసిందని, పార్టీపై చర్యలు తీసుకుందని దుయ్యబట్టారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఐదు కోట్లకుపైగా సంతకాలు సేకరించామని, వాటిని రాష్ట్రపతికి సమర్పిస్తామని, ఆమె అపాయింట్‌మెంట్ కోరామని ఆయనన్నారు.

రాహుల్ పోరులో భాగస్వాములవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ సిద్ధమని, దేశ ప్రజలంతా కలిసి రావాలని కోరారు.

ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం: డీకే శివకుమార్

ఓట్ చోరీ వ్యతిరేక పోరు ముఖ్య ఉద్దేశం ప్రజల ఓటు హక్కును పరిరక్షించడమేనని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నొక్కిచెప్పారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తోందని, ఇందులో రాజకీయం లేదని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఎప్పుడు ఎన్నికల్లో గెలుపోటముల గురించి ఆలోచించరని, స్వాతంత్ర్య పోరాటమప్పుడు తమ పెద్దలు చేసిన త్యాగాలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పరిరక్షణ కోసమే ఆలోచిస్తారని డీకే శివకుమార్ అన్నారు. మన్మోహన్ సింగ్ కోసం ప్రధాని పదవిని సోనియా గాంధీ వదులుకున్నారని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలిచ్చారని, నెహ్రూ, గాంధీ జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. నాడు స్వాతంత్ర పోరాటానికి గాంధీ నాయకత్వం వహిస్తే... నేటి క్లిష్టపరిస్థితుల్లో కాంగ్రెస్ బాధ్యతలను ఖర్గే చేపట్టారని డీకే శివకుమార్ అన్నారు. మెగా ర్యాలీలో పాల్గొనకుండా చేసేందుకు ఢిల్లీ వచ్చే కాంగ్రెస్ శ్రేణుల వాహనాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్నదన్నారు. 3,500 నుంచి 4,000 మంది వరకు ర్యాలీలో పాల్గొన్నారన్నారు.

విమానాలు, రైళ్లలో దాదాపు రెండు వేల మందికిపైగా వచ్చారని, వీరంతా సొంత ఏర్పాట్లు చేసుకున్నారని, తాము 1,500 మంది కోసం ఏర్పాట్లు చేశామని డీకే శివకుమార్ చెప్పారు. సంతకాల సేకరణలో భాగంగా కర్నాటకలో 1,42 సంతకాలు సేకరించినట్లు డీకే శివకుమార్ వెల్లడించారు.

సిడ్నీ బీచ్ రక్తసిక్తం

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుండగా ఈ దాడికి ఓ సాయుధుడు పాల్పడ్డాడు. కాల్పులు జరిపి పరారయ్యాడు. అతని కోసం గాలిస్తున్నట్లు మేయర్ వెల్లడించారు. విద్యార్థలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నల్ల దుస్తుల్లో వచ్చిన వ్యక్తి కాల్పులకు తెగబడినట్లు అధికారులు తెలిపారు. ఏడంతస్తుల బారస్ అండ్ హోలీ భవనంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, ఫిజిక్స్ విభాగం ఉన్నాయి.

కాల్పులు జరిగినప్పుడు అక్కడ ఇంజినీరింగ్ డిజైన్ పరీక్ష జరుగుతున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటన విద్యార్థులను తీవ్రంగా భయపెట్టిందన్నారు. ఈ ఘటనపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుండగుడిని సాధ్యమైనంత త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు. ఎఫ్‌బీఐ అధికారులు ఘటనా స్థలంలోనే ఉన్నారని, తగు చర్యలు తీసుకుంటారని ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. మేయర్ బ్రెట్ స్మైలీ స్పందిస్తూ క్యాంపస్ సమీపంలోని వారంతా ఇళ్లకే పరిమితం కావాలని, తలుపులు బిగించి ఉంచాలంటూ హెచ్చరించారు.

రెండో విడతలోనూ హస్తం హవా

(మొదటిపేజీ తరువాయి)

కాగా, అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76 శాతం నమోదైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. కౌంటింగ్ సజావుగా జరుగుతోంది. ఈ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్నప్పటికీ, పార్టీల మద్దతుతో పోటీ చేసిన వారిలో ఇతరుల సంఖ్య కూడా గణనీయంగానే ఉందని తెలుస్తోంది. కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులతో ఉప సర్పంచ్ ఎన్నికను వెంటనే నిర్వహించాల్సి ఉంటుంది, దీని తర్వాతే ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగిసినట్టు అవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... దుగ్గొండి మండలం నాచినపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారుల మధ్య స్వల్ప వాగ్వాదం తలెత్తింది. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. హనుమకొండ జిల్లా ఐనవోలులో టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియో గించుకున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్వగ్రామం చెర్లపాలెంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి మహేందర్ విజయం సాధించారు. పరకాల ఎంపీడీవోపై హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ కోసం ఉపయోగించే పెట్టెలకు గుర్తింపు స్టిక్కర్లు అంటించడంలో ఆలస్యం చేయడంపై ఆమెను నిలదీశారు. పరకాల మండలం నాగారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని చల్లబర్చారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తన స్వగ్రామం ఝరాసంఘంలో తోటి గ్రామస్థులతో కలిసి లైన్‌లో నిలబడి ఓటు వేశారు. మెదక్ జిల్లా రామాయం పేట మండలం కోనాపూర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన స్వగ్రామం కొరివిపల్లి ఓటు వేశారు. చేగుంట మండలం రుక్మాపూర్‌లో ప్రశాంత్‌రెడ్డి అనే వ్యక్తి సింగపూర్ నుంచి వచ్చి ఓటేశారు. సిద్దిపేట జిల్లా పోతారంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బొప్పాపూర్‌లో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు దంపతులు ఓటు వేశారు. భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రెండో విడత పల్లెపోరు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి: కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్: భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఏడు మండలాల్లో జరిగింది. ఎమ్మెల్యే నివాస ముంటున్న సొంత మండలమైన చుంచుపల్లిలోని 7వ వార్డు పీకే విద్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్లు వేసే విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని తమకు రాజ్యాంగ హక్కును ఉపయోగించుకోవాలని కోరారు.

చిన్న పరిశ్రమలు చిగురించేలా...

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎస్ఎంఈ పార్కులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో పార్కుకు కనీసం రూ.మూడు కోట్ల నుంచి రూ. ఎనిమిది కోట్లను కేటాయించింది. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరించనున్నాయి. రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రతి ఇంటిలో ఓ పారిశ్రామికవేత్తను తయారు చేసేలా నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. వన్ ఫ్యామిలీ... వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే లక్ష్యాన్ని 2030 నాటికి చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తోంది. రాబోయే ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 22 లక్షల ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తోంది. వీటి ద్వారా సుమారు ఐదు లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి... వాటిలో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వేగంగా నెరవేరుస్తోంది. అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం, డోన్, ఆత్మకూర్, దర్శి, పుట్టపర్తిలో ఎంఎస్ఎంఈ పార్కులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. 909 ఎకరాల్లో 11 ప్రాజెక్టులకు రూ.199 కోట్లు ఖర్చు కానుంది. ఆత్మకూరు మండలం నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు 55 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. 40 నియోజకవర్గాల్లో మొదటి దశలో ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. 2028 నాటికి అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి ఉపాధి మార్గాలను విస్తృతం చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. ఎంఎస్ఎంఈలు రాష్ట్ర అభివృద్ధికి కీలక స్తంభాలు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఎంఎస్ఎంఈలకే ఉంది. అందుకే వీటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇంతటి ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో మరో 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 17 జిల్లాల్లో 29 ఎంఎస్ఎంఈ పార్కులు (2,329 ఎకరాల్లో) ఉన్నాయి. రూ.810 కోట్ల పెట్టుబడులతో 50 పార్కులు 800 ఎకరాల విస్తీర్ణంలో రూ.810 కోట్ల భారీ పెట్టుబడులతో అభివృద్ధి చేయనున్నారు. వీటి ద్వారా సుమారు 12,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నా యని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుబాటులో ఉన్న భూముల లభ్యత మేరకు నానో పార్కులను ఏర్పాటు చేయాలా లేక ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేయాలా అనే దానిపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండే చోట అదనంగా పార్కులను అభివృద్ధి చేసే యోచనలో ఏపీఐఐసీ ఉంది. ఆయా పార్కులలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి సరసమైన ధరలకే భూ కేటాయింపులు చేయడంతోపాటు అన్ని విధాలుగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఉండటం వల్ల ఆ ప్రాంతానికి పరిశ్రమలు రావడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

ఓట్ల దొంగల్ని గద్దె దించుదాం

(మొదటిపేజీ తరువాయి)

నలుమూలల నుంచి వెయ్యి మందికిపైగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, సీనియర్ నాయకులు కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, సుఖ్విందర్ సింగ్ సిక్కు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరుల ముఖ్య నాయకులు ప్రసంగించారు. ఎస్ఐఆర్ పేరిట ఓట్ల దోపిడీకి మోదీ ప్రభుత్వం తెరతీసిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల సంఘం ఖూనీ చేస్తున్నదని ఆరోపించారు. ద్రోహులను, నాటకరాయుళ్లను గద్దె దించాలని మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తమ పోరాటం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై అని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘాన్ని కాపాడేలా చట్టాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ చట్టాన్ని మారుస్తాం, ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. ఓట్ల దొంగతనానికి ఈసీ అనుమతి ఎలా ఇచ్చిందన్నదానిపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆయన సహచరులు సమాధానం చెప్పాలని ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. బ్యాలెట్ పేపర్‌పై పోటీ చేయాలంటూ బీజేపీకి సవాల్ విసిరారు. మన గళం ప్రధాని నివాసం వరకు చేరాలని పిలుపునిచ్చారు.

దేశానికి, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి కాంగ్రెస్ రక్ష: ఖర్గే

'బీజేపీ నాయకులకు నాటకాలు ఆడటం మాత్రమే తెలుసు. పార్లమెంటు సమావేశాల తర్వాత రాహుల్ గాంధీ విదేశాలకు వెళతారా అని వారిలో కొందరు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంటు సమావేశాల్లో ప్రధాని మోదీ ఎప్పుడు పాల్గొనరు కానీ విదేశాలకు మాత్రం వెళతారు. ఓట్లు దోచుకొనే అధికారంలోకి వచ్చారు. ఈ దోహ్రులను గద్దె దించాలి' అని ఖర్గే ఉద్ఘాటించారు. దేశాన్ని కాపాడగలిగిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని బలపర్చేందుకు భారతీయులంతా ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఈ దేశాన్ని అంతమొందిస్తుందని ఖర్గే హెచ్చరించారు. తన వ్యక్తిగత జీవితం కంటే దేశ ప్రయోజనానికే అధిక ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. 'నా కుమారుడికి శస్త్ర చికిత్స జరగాల్సి ఉంటే నేను బెంగళూరు వెళ్లకుండా 140 కోట్ల మంది భారతీయుల కోసం ఇక్కడికి వచ్చాను' అని ఖర్గే అనగా సభికులు చప్పట్లతో అభినందించారు. ఎదురు దెబ్బలు తగిలినా, ఓటములు ఎదురైనాగానీ కాంగ్రెస్ నేటికీ కొనసాగుతోందని, బలంగా ముందుకెళుతోందని అన్నారు. మోదీ ఒకసారి ఓడిపోతే మళ్లీ కనిపించరని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పరిరక్షణ కోసం కాంగ్రెస్‌కు అండగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సత్యం-అహింసా మార్గంలోనే మోదీపై విజయం: రాహుల్

కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మకయ్యాయని, ప్రజాస్వామ్య విలువలను నీరుగారుస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికల సంఘానికి అన్ని విధాలా రక్షణ కల్పించడం కోసం కొత్త చట్టాన్ని ప్రధాని మోదీ తీసుకొచ్చారన్నారు.



భవిష్యత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఈ చట్టాన్ని మారుస్తుందని, అవసరమైతే ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటుందని రాహుల్ అన్నారు. నిజానికి, అబద్ధానికి మధ్య పోరాటం జరుగుతోందని ప్రస్తుత పరిస్థితులనుద్దేశించి అన్నారు. బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లో ఎన్నికల సంఘం పనిచేస్తున్నదని విమర్శించారు. ఈ పోరాటంలో ఎప్పటికైనా గెలుపు నిజానిదేనని వక్కాణించారు. సత్యం-అహింసా మార్గంలోనే నరేంద్ర మోదీ, అమిత్ షా (కేంద్ర హోంమంత్రి)ని ఓడిస్తామని రాహుల్ ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం భారతదేశానిదేగానీ మోదీకి కాదని ఈసీ గుర్తించాలని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తుందని అన్నారు. 'ఈ ప్రపంచం నిజం కంటే కూడా అధికారానికే ప్రాధాన్యత ఇస్తుందని, అధికారం ఉంటేనే గౌరవమని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ మాటలను బట్టి అర్థమవుతుంది. అది ఆయన ఆలోచన. ఇది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. అయితే మా సిద్ధాంతం, భారతదేశ సిద్ధాంతం. హిందూ సిద్ధాంతం, ప్రపంచంలోని ప్రతి మతం సిద్ధాంతం కూడా సత్యానికే అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. మోహన్ భగవత్ ప్రకారం సత్యం అర్థరహితం... అధికారమే ముఖ్యం. సత్యమేవ జయతే గురించి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మరిచాయి. కానీ మేము దీనిని బలంగా నమ్ముతాం. ఇదే సిద్ధాంతం ద్వారా మోదీని, అమిత్‌షాను, బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం' అని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. 'బీజేపీ ఓట్లు దోచుకుంటుంది.

ఎన్నికలప్పుడు రూ.10వేలు ఇస్తుంది. ఎన్నికల సంఘం కూడా బీజేపీతో కలిసి పనిచేస్తున్నది. ఇదే క్రమంలో ఈసీపై ఎలాంటి చర్యలు తీసుకునేందుకు వీల్లేకుండా కొత్త చట్టాన్ని మోదీ తీసుకొచ్చారు. ఆయన ఏం చేసినాగానీ చివరకు గెలిచేది సత్యమేన' అని కాంగ్రెస్ ఎంపీ వెల్లడించారు. వణుకుతున్న చేతులతో ఎన్నికల సంఘం తరపున అమిత్‌షా పార్లమెంటులో సమాధానం చెప్పారన్నారు. తాను నిర్వహించే విలేకరుల సమావేశానికి వచ్చి చర్చలో పాల్గొనాలి నిజం మాట్లాడేది ఎవరో దేశానికి తెలియజేద్దాం అంటూ రాహుల్ సవాల్ విసిరారు. 'అమిత్‌షా చేతులు ఎందుకు వణుకాయో చెప్పనా! అధికారం ఉన్నప్పుడు మాత్రమే వారు ధైర్యంగాఉంటారు' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎద్దేవాచేశారు.

కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-నేరేడు చర్ల : బోడలదిన్నె గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సీపీపార్టీ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంగాల ఉషారాణి సతీష్ రెడ్డి ని,, వార్డు మెంబర్లుగా సిపిఐ మరియు కాంగ్రెస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు.ఆదివారం నాడు గ్రామంలోని పలు వార్డులో సిపిఐ కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ రెండు పార్టీల నాయకత్వం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగాల సతీష్ రెడ్డి తను సర్పంచిగా లేకపోయినప్పటికీ ఇప్పటికీ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడని చర్చికి మూడు గుంటల స్థలం ఇచ్చి ఉన్నాడని గ్రామంలో ఇప్పటికే 37 సిమెంటు బెంచీలు వివిధ వార్డులలో వేశాడని గ్రామపంచాయతీ కార్యాలయానికి ఒక కుంట స్థలం ఇచ్చి ఉన్నాడని అంగన్వాడి స్కూలుకు మూడు కుంటల స్థలం దానం చేశాడని ఇక ముందు కూడా గ్రామంలో అభివృద్ధి పరుగులు తీయాలంటే, రాబోయే ఐదు సంవత్సరాలలో ఈ గ్రామంలో పెళ్లి కాబోయే ప్రతి యువతీకి బంగారం....గ్రామంలో గ్రంథాలయం ప్రతి ఇంటికి చెత్తబుట్ట ప్రతి వీధికి సిసి రోడ్డు గ్రామంలో కనకదుర్గమ్మ దేవాలయం నిర్మాణం గంగమ్మ అమ్మవారి గుడి నిర్మాణం బొడ్రాయి నిర్మాణం రామాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు ముత్యాలమ్మ గుడి, ఈదమ్మ గుడి నిర్మాణం వ్యవసాయ భూములకు మట్టి రోడ్డు నిర్మాణం అంగన్వాడి స్కూలు నిర్మాణం లాంటి అన్ని రకాల ప్రజా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంగాల ఉషారాణి ని గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి పట్టణ సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల సతీష్ రెడ్డి బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ఉపసర్పంచి అభ్యర్థి యల్లబోయిన రమణ, వార్డు మెంబర్ యల్లబోయిన వెంకన్న బొల్లం సైదులు, వంగాల రంజిత్ రెడ్డి, రాజసింహారెడ్డి యల్లబోయిన శివ, రాంప్రసాద్ పాల్గొన్నారు

వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళి పరిశీలన

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: జిల్లాలో జరుగుతున్న రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి పోలింగ్ జరుగుతున్న విధానాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. నిశితంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడు తూ వెంకటాపూర్ మండలంలో 116 , ములుగు మండలంలో 92, మల్లంపల్లి మండలంలో 53 , పోలింగ్ కేంద్రాలను క్రిటికల్ మరియు సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించి, వాటిని జిల్లా కలెక్టర్ కార్యాలయం తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు మండలాకు సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం : బీఆర్ఎస్

విశాలాంధ్ర-మరిపెడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ అన్నారు.ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని నీలికుర్తి, రేఖ్యా తండా, చిల్లంచర్ల, రాంపురం, బావోజిగూడెం, గిరిపురం,వెంకట్ నాయక్ తండ,తాళ్ళ ఊకల్,తానంచర్ల,అబ్బాయిపాలెం,లచ్చా తండా,ఎడ్జెర్ల, భూక్య తండా,ఉల్లేపెల్లి, లునావత్ తండా,వీరారం,అజ్మీరా తండా, లక్ష్మి తండా,సోమ్లా తండా, తదితరుల గ్రామాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలివి కాని హామీలు,ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు.స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని,మరిపెడ మండలంలో 48 గ్రామ పంచాయతీలలో ఒక్క గ్రామ పంచాయతీకి బీసీ రిజర్వేషన్ కల్పించలేదన్నారు. రైతులకు యూరియా అందించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.మాయ మాటలతో మభ్యపెడున్న కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు, ఓడిసిఎంఎస్ మాజీ సర్పంచ్ కుడితి మహేందర్ రెడ్డి,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రామడుగు అచ్యుత్ రావు,మాజీ ఎంపిపి గుగులోత్ వెంకన్న,మాజీ జెడ్పీటీసీ బాల్ని మాణిక్యం,మాజీ వైస్ ఎంపిపి గాదె అశోక్ రెడ్డి,జిల్లా నాయకులు గుగులోత్ రాంబాబు,మాజీ సర్పంచ్ లు గుడిపుడి శ్రీనివాస రావు, చిర్రబోయిన ప్రభాకర్,పద్మ హరి నాయక్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీరా రెడ్డి నాయక్,పిట్టల ధనుంజయ్ పాల్గొన్నారు.

ముదిగొండ గ్రామపంచాయతీ సీపీఎం విజయం

ముదిగొండ మండలంలో కాంగ్రెస్ హవా

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం/ ముదిగొండ : ప్రతిష్టాత్మకంగా ఆదివారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముదిగొండ మండలం పరిధిలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలుచుకున్నప్పటికీ ముదిగొండ మేజర్ గ్రామపంచాయతీ సిపిఎం గెలుచుకుంది. అదేవిధంగా మూడు గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ విజయం సాధించింది కాగా మొత్తం 25 గ్రామపంచాయతీలో మిగిలిన పంచాయతీలన్నీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది, మండలంలో మేజర్ గ్రామపంచాయతీలు రెండు ఒకటి వల్లభి, రెండు ముదిగొండ. వల్లభి గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా కాంగ్రెస్ దక్కించుకోగా ముదిగొండ గ్రామపంచాయతీ సిపిఎంకు దక్కింది. కట్టకూరు ఉపేందర్, ముదిగొండ. (సిపిఎం), చెరుకుపల్లి జగన్నాథం, మేడేపల్లి (కాంగ్రెస్, రెబల్స్), కందుల బాలచందర్, వెంకటాపురం(కాంగ్రెస్), పెరుమళ్ళపల్లి శ్రీను, గోకినేపల్లి (కాంగ్రెస్),తోట వెంకటేశ్వర్లు, కట్టకూరు, (కాంగ్రెస్), ఉప్పునూరి నాగమణి, మాధాపురం(కాంగ్రెస్),ఎరకల భారతమ్మ, యడవల్లి (కాంగ్రెస్),గుండాల స్వామి, యడవల్లిలక్ష్మీపురం(సిపిఎం), పసుపులేటి నాసరయ్య,సువర్ణాపురం (కాంగ్రెస్), ఎండీ సలీమా, న్యూలక్ష్మీపురం (బీఆర్ఎస్), పోకల లక్ష్మి, ఖానాపురం (కాంగ్రెస్), పాము స్వర్ణలత, పండ్రేగుపల్లి (బీఆర్ఎస్), సామినేని రాంబాబు, చిరుమర్రి (సిపిఎం), వడ్డె మాధవరావు, పమ్మి (కాంగ్రెస్), కోలేటి వెంకటేశ్వర్లు, మల్లన్నపాలెం(సిపిఎం),పోకపోతుల భద్రమ్మ, అమ్మపేట(సిపిఎం), వనంవారికృష్ణాపురం పర్ణ కోలా సరళ(కాంగ్రెస్), లంజపల్లి మమత, ముత్తారం (కాంగ్రెస్), బాజా కవిత, వల్లాపురం(సిపిఎం), పందిరి అంజయ్య, కమలాపురం (కాంగ్రెస్), మల్లెల రామారావు, గంధసిరి (కాంగ్రెస్), తేజావత్ సంధ్యనాయక్, బాణాపురం(కాంగ్రెస్), కోలేటి పావని, మల్లారం. (కాంగ్రెస్), లంకెల కొట్టిరెడ్డి, పెద్దమండవ. (కాంగ్రెస్), బిచ్చాల బిక్షం, వల్లభి (కాంగ్రెస్, ఏకగ్రీవం).

ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ఖమ్మం జిల్లాలోని 6 మండలాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి రెండవ విడత 160 గ్రామ పంచాయతీలకు, 1379 వార్డులకు నిర్వహించిన పోలింగ్ లో 91.21 శాతం మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 27.78 శాతం, 11 గంటలకు 64.32 శాతం, 1 గంట వరకు 85.95 శాతం పోలింగ్ నమోదైందని, ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని, వారితో కలిపి మొత్తం ఖమ్మం జిల్లాలో 91.21 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. రెండవ విడత పోలింగ్ నిర్వహించిన కామేపల్లి మం డలంలో 87.03 శాతం, ఖమ్మం రూరల్ మం డలంలో 93.76 శాతం, కూసుమంచి మం డలంలో 90.92 శాతం, ముదిగొండ మండలంలో 91.52 శాతం, నేలకొండపల్లి మండలంలో 91.69 శాతం, తిరుమలాయపాలెం మండలంలో 91.57 శాతం పోలింగ్ నమోదైందని, మొత్తం 2 లక్షల 48 వేల 239 మంది ఓటర్లకు గాను 2 లక్షల 26 వేల 417 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని, మొత్తంగా రెండవ విడతలో 91.21 శాతం పోలింగ్ నమోదు అయినట్లు కలెక్టర్ అన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కలెక్టరేట్ నుంచి నిరంతరం మానిటరింగ్ చేయడం జరిగిందని, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కౌంటింగ్ ముగిసిన తర్వాత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ద్వారా 6 మండలాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, సిపిఓ ఏ. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, రెవెన్యూ సిబ్బంది, టెక్నికల్ టీం సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

2వ విడత ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు రెండవ విడత ప్రశాంతంగా ముగిసాయి. 88.46% శాతం పోలింగ్ నమోదైయింది. మెదక్, రామాయంపేట, నిజాంపేట్, నార్సింగి, చిన్న శంకరంపేట్, చేగుంట, తుప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఆదివారం పోలింగ్ నిర్వహించారు. ఎనిమిది మండలాల్లో మొత్తం మొత్తం సర్పంచ్ స్థానాలు 149 ఉండగా 7 సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 142 సర్పంచ్ పదవుల కోసం 544 అభ్యర్థులు పోటీపడ్డారు. వార్డు స్థానాలు మొత్తం 1290 ఉండగా 254 ఏకగ్రీవమయ్యాయి. మనోహరాబాద్ మండలం లోని రెండు వార్డులకు నామినేషన్లు రాలేదు. మిగతా 1034 వార్డు స్థానాలకు 2592 మంది అభ్యర్థులు పోటీలో పడ్డారు. మొత్తం 1034 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 1,76,167 ఉన్నారు. ఇందులో పురుషులు-84,695, మహిళలు -91,470, ఇతరులు- 2 ఉన్నారు. ఇందులో 1 లక్ష 53 వేల 313 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు.

మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు, ఓటర్ల సౌకర్యాలపై సమాచారం సేకరించి, పలు సూచనలు ఇచ్చారు. వెంట తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులున్నారు. ఎస్పీ శ్రీనివాస్ రావు, ఏఎస్పీ మహేందర్లు అనేక పోలింగ్ కేంద్రాలు సందర్శించారు. భారీ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ఓటేసిన ఎమ్మెల్యే రోహిత్ దంపతులు...

మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు శివాని దంపతులు స్వగ్రామం చిన్న శంకరంపేట్ మండలం కొర్విపల్లిలో తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం. పద్మ దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం రామాయంపేట్ మండలం కోనాపూర్ లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు.

డ్రాలో వరించిన విజయం...

మెదక్ మండలం చీపురుదుబ్బ తండా సర్పంచ్‌గా కేతావత్ సునీత డ్రాలో విజయం సాధించారు. మొత్తం 377 ఓట్లు ఉండగా 367 ఓట్లు పోలయ్యాయి. కేతవత్ సునీత (కాంగ్రెస్), బీమిలి (బీఆర్ఎస్) ఇద్దరికి 182 చొప్పున సమానంగా ఓట్లు వచ్చాయి. రెండు ఓట్లు చెల్లనివి, ఒకటి నోటకు పడింది. ఇద్దరికీ సమానంగా రావడంతో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశారు. కాంగ్రెస్ బలపరిచిన మహిళా అభ్యర్థి కేతవత్ సునీతకు విజయం వరించింది.

తనయుడిపై తండ్రి విజయం

మెదక్ జిల్లా రామాయంపేట మండలం జాన్సీ లింగాపూర్ సర్పంచ్ గా మానెగల్ల రాంకిష్టయ్య తనయుడు వెంకట్ పై విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో దిగిన రాంకిష్టయ్య 99 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థిపై గెలుపొందారు. తనకు ఓటేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల పోలింగ్ : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన రెండవ దశ గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ఆదివారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగింది. జిల్లాలోని సరిహద్దు నక్సల్స్ ప్రభావితం ప్రాంతాల్లో సైతం ప్రశాంతంగా జరగడంతో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. పోలింగ్ విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అభినందించారు. ఆయన అధికారిక గణాంకాలను వివరించారు. జిల్లాలోని 7 మండలాల్లో మొత్తం 1,96,395 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,62,323 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోలింగ్ భారీగా 82.65 శాతంగా నమోదైనట్లు తెలిపారు. ఇందులో పురుష ఓటర్లు 80,037 మంది, మహిళా ఓటర్లు 82,284 మంది, ఇతరులు 2 మంది ఉన్నారన్నారు. మండలాల వారీగా పోలింగ్ శాతం అన్నపురెడ్డిపల్లి మండలంలో 85.13 శాతం, అశ్వరావుపేట మండలంలో 87.85 శాతం, చంద్రుగొండ మండలంలో 85.93 శాతం, చుంచుపల్లి మండలంలో 66.19 శాతం, దమ్మపేట మండలంలో 85.73 శాతం, ములకలపల్లి మండలంలో 86.59 శాతం, పాల్వంచ మండలంలో 86.58 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది, పోలీస్ శాఖ, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయడంతో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రతా నిబంధనల ప్రకారం కౌంటింగ్ కేంద్రాలకు తరలించామన్నారు. ప్రస్తుతం కౌంటింగ్ ప్రక్రియ అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య, పూర్తి పారదర్శకతతో కొనసాగుతోందని కలెక్టర్ చెప్పారు.

విద్యుత్ సవరణ చట్టం ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర, మంథని: ఆర్టిజన్స్ అందరిని పర్మినెంట్ చేసి, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేసి విద్యుత్ ఉద్యోగుల హక్కులను హరించే 2025 విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ రావు అన్నారు.ఆదివారం రామగిరి మండలం లోని సాయిరాం గార్డెన్‌లో సిఐటియు పెద్దపల్లి సర్కిల్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వాగు నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఆర్టిజన్స్ అందరిని పర్మినెంట్ చేయాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేసి విద్యుత్ ఉద్యోగుల హక్కులను హరించే 2025 విద్యుత్ సవరణ చట్టాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి మాట్లాడుతూ పెద్దపల్లి సర్కిల్లో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనులు కూడా ఆపరేటర్స్ తో చేయించాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఈ విధమైన పద్ధతి రాష్ట్రంలో ఎక్కడా లేదని జిల్లా అధికార యంత్రాంగం ఇలాంటి తప్పుడు పద్ధతులు మానుకోవాలని లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నా మని ఇందులో కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్సను అడ్డుకోవడం శ్రమ శక్తి నీతి 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాబోయే రోజుల్లో స్వతంత్ర ఐక్య కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని నిరంతరం కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ బిక్షపతి యూనియన్ పెద్దపల్లి సర్కిల్ ప్రధాన కార్యదర్శి నరసయ్య నాయకులు శ్రీనివాస్ రెడ్డి మట్టరాజు తిరుపతి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర - అశ్వరావుపేట : రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ దమ్మపేట, అశ్వరావుపేట మండలాల్లోని అచ్చుతాపురం గ్రామ పోలింగ్ కేంద్రా లను విస్తృతంగా పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో ప్రత్యర్థి అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీతోపాటు ఉద్రిక్త పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ పర్యటన అనివార్యమైనట్లు తెలిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి కల్పిం చిన వసతులను సమగ్రంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశమైన బ్యాలెట్ పేపర్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లు సక్ర మంగా ముద్రించబడి ఉన్నాయా లేవా.. అభ్యర్థుల పేర్లు, చిహ్నాలు స్పష్టంగా ఉన్నాయా, బ్యాలెట్ పేపర్ల సంఖ్య సరిపోతుందా లేదా అనే అంశాలను ఆయన జాగ్రత్తగా తనిఖీ చేశారు. బ్యాలెట్ పేపర్ల భద్రత, సరైన పంపిణీ, వినియోగానంతరం వాటిని సీల్ చేసి భద్రపరచే విధానాలపై పోలింగ్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే పోలింగ్ ప్రారంభం నుండి ముగింపు వరకు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను అత్యంత భద్రతతో కౌంటింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లందరికీ ఓటు హక్కు వినియోగించే అవకాశం కల్పించేలా క్యూల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఈ మండలాల్లో పోలీస్ బందోబస్తు కట్టుదిట్టంగా కొనసాగింది.

రెండవ విడత ఎన్నికల్లో కాంగ్రెస్ హవా

పాలేరు నియోజకవర్గంలో, ఖమ్మం రూరల్‌లో ఎర్రజెండా రెపరెప

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ప్రతిష్టాత్మకంగా జరిగిన గ్రామపంచాయతీ రెండవ దశ ఎన్నికల్లో ప్రధానంగా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు హోరాహోరీగా జరిగినట్లు తెలుస్తోంది. మధిర నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ముదిగొండ మండలం పరిధిలో దాదాపు 20 పంచాయితీల వరకు కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగా నాలుగు గ్రామపంచాయతీలో సిపిఎం, సిపిఐ గెలుచుకున్నాయి. కొన్ని గ్రామపంచాయతీలో విఆర్ఎస్ పార్టీ కూడా గెలిచినట్లు సమాచారం. కాగా ఖమ్మం రూరల్ మండలంలో మొత్తం 21 గ్రామపంచాయతీలకు గాను ఎనిమిది గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించగా నాలుగు గ్రామపంచాయతీలో సిపిఎం, నాలుగు గ్రామపంచాయతీలో సిపిఐ, ఐదు గ్రామపంచాయతీల్లో టిఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ మండలంలో టిఆర్ఎస్ ఒకరకంగా గట్టి పోటీనిచ్చినట్లు చెప్పవచ్చు. ఇదిలా ఉంటే కామేపల్లి మండలంలో మొత్తం 24 గ్రామపంచాయతీలకు గాను కాంగ్రెస్ 16 గ్రామపంచాయతీలో విజయం సాధించగా బి ఆర్ఎస్ ఆరు పంచాయతీలు గెల్చుకుంది.

తిరుమల పాలెం మండలంలో కూడా వీఆర్ఎస్ కొన్ని పంచాయితీలు గట్టి పోటీలు ఇచ్చింది. కూసుమంచి నేలకొండపల్లి మండలాల్లో కూడా కాంగ్రెస్ తన హవా కొనసాగించింది మేజర్ గ్రామపంచాయతీ నేలకొండపల్లి , బి ఆర్ ఎస్ చేజిక్కించుకుంది. నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెం గ్రామపంచాయతీలో టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలిచారు. తిరుమలాయపాలెం మండలం ముజాయిగూడెం పంచాయతీ సర్పంచ్ గా టిఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు ఆయన మంత్రి పొంగులేటి తనపై అక్రమ కేసులు పెడుతున్నారు అంటూ ఆరోపణలు చేసిన వ్యక్తి గెలవడం పై చర్చ జరుగుతుంది. మూత మీద పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ మెజారిటీ గ్రామపంచాయతీలో విజయం సాధించినప్పటికీ విపక్షాలు కూడా కొన్ని మండలాల్లో గట్టి పోటీని ఇచ్చాయని చెప్పవచ్చు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : ఆదివారం సారంగాపూర్ మండలం ధని గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల సరళిని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు తప్పనిసరిగా పంపాలని సూచించారు. ఓటర్లతో మాట్లాడి కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. లెక్కింపు హాలులో ఏర్పాట్లు పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. మొదటి దశ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్న కలెక్టర్, ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో డి పి ఓ శ్రీనివాస, ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, తహసిల్దార్ సంధ్య రాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న రావుల దంపతులు

విశాలాంధ్ర-వనపర్తి : స్థానిక సంస్థల(సర్పంచ్)ఎన్నికల్లో బాగంగా తన స్వగ్రామం కానాయపల్లిలో మాజీ ఎంపి రావులవరలక్ష్మీ చంద్రశేఖర్ రెడ్డి తమ ఓటు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తి నింపడానికి ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. గ్రామాలలో సిద్ధాంతపరంగా ఓట్లు అభ్యర్ధించి ఎటువంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని అన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావుకు ఘనస్వాగతం

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదివారం నాగార్జునసాగర్‌లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యంలో నల్గొండ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.నల్గొండకు వచ్చిన ప్రధాన కార్యదర్శికి జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు ఐఏఎస్ అధికారి కొర్రా లక్ష్మి, రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మరియు ఎండీ ఐఏఎస్ అధికారి భవేష్ మిశ్రా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం గతంలో నల్గొండ జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానవీయత చాటిన పోలీసులు

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : సూర్యాపేట జిల్లాలో ఆదివారం నిర్వహిస్తున్న రెండవ విడత గ్రామపంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మునగాల మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు చూపిన మానవీయత ప్రజల మనసులు గెలుచుకుంది.పోలింగ్‌కు వచ్చిన ఓ వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన సి.సి.ఎస్ కానిస్టేబుల్ సతీష్, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ యాకయ్య వెంటనే స్పందించారు. ఆమెను వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లి, ఓటు హక్కు వినియోగించుకునేలా పూర్తి సహకారం అందించారు.భద్రతా విధులతో పాటు ఓటర్లకు సహాయం చేయడంలో పోలీసులు చూపిన చొరవ ప్రజాస్వామ్య విలువలకు అద్దం పట్టింది. వృద్ధులు, దివ్యాంగుల పట్ల చూపిన ఈ మానవీయ వైఖరి ఎన్నికల ప్రక్రియకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ ఘటనను గమనించిన స్థానికులు, ఇతర ఓటర్లు పోలీసు సిబ్బందిని అభినందించారు. ఇలాంటి చర్యల వల్ల పోలీసులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని వారు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, మునగాల మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: పెద్దపల్లి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని ప్రజలందరూ సహకరించాలని కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచులను గెలిపించాలని రానున్న రోజులో ఎంతో అభివృద్ధి జరుగుతుందని అధికారంలో ఉన్న పార్టీ సభ్యులను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని అందుకు ప్రజల ఆలోచన చేయాలని కోరారు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణరావు అన్నారు. అదివారం రాఘవపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో పనులు మిగిలి ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నో పనుల ఇస్తానని రాఘవపురం గ్రామ ప్రజలందరూ ఆలోచన చేసుకోవాలని అన్నారు.సర్పంచ్ అభ్యర్థి సౌందర్య వెంకటేష్ మాట్లాడుతు గ్రామములో ఎంతో అభివృద్ధి జరిగిందని. మరిన్ని రోడ్లు చేసేందుకు ఉన్నాయని నన్ను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆదెపు సౌందర్య వెంకటేష్ అన్నారు.ఎన్నికల ప్రచారం లో భాగంగా రాఘవపూర్ గ్రామస్తులు సభ కు భారీగా తరలి వచ్చారు. ఈ సభలో కాంగ్రెస్ యువకులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాహితి

ధైర్యం వీడకు

హిందీ మూలం: డాక్టర్ మహేంద్ర భట్‌నాగర్
తెలుగు అనువాదం: పారనంది నిర్మల
సెల్: 9985103804

ధైర్యం కోల్పోకు!
ముళ్ల మధ్య నీ మానస గులాబి వికసిస్తుంది ఒకనాడు!
ధైర్యం కోల్పోకు!
గాలి దుమారములు ఎదురొస్తే ఆడుకో వాటితో
నీ వైపు ఎంత పెద్ద బండరాయి విసిరినా సహించు
నీకు తెలుసుగదా?
ఇది వర్షపు ఋతువని
ఆకాశంలో వ్యాకులత నిండి ఉందని
మేఘాలు స్వతంత్రంగా చుట్టుముట్టి ఉన్నాయి.
నీ ఎదుట వాటి ఉనికి శబ్దంతో ఉంది
ఇది అంతా వాస్తవమే!
నీ ఎదుట రకరకాల టపాకాయలు పేలుతూ ఉంటాయి
ఐనా నిరంతరమూ, నీ మార్గాన్ని విడవకుండా
ముందుకు సాగిస్తూంటే
ఒకనాడు నీ గమ్యమే నీ ఎదుట వచ్చి స్వాగతం
పలుకుతుంది.
ధైర్యం కోల్పోకు!
ముళ్ల మధ్య గులాబి వికసిస్తుంది ఒకనాడు
ధైర్యం కోల్పోకు!

స్వాతంత్ర్య సమరవీరుడు ఉయ్యాలవాడ - ఒక పరిచయం

డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి
సెల్: 7569693239

ఇంగిలీషు బకాసురులు ఈస్టిండియా కంపెనీ అని పెట్టి, మెల్లగా మన భూ భాగాలను కబళించారు. విస్తరించుకుంటూ వెళ్లారు. దాన్నెదిరించిన వారిని ఉరి తీశారు. మచ్చుకు మన ఉయ్యాలవాడ నరసింహారెడ్డినే తీసుకోవచ్చు. నరసింహారెడ్డి దగ్గర 9000 సైన్యం ఉండేదట. ఇందులో ఎక్కువ భాగం బోయీలు, చెంచువాళ్లు, వడ్డెరవాళ్లు, యానాదులు, కొందరు బ్రాహ్మణులు కూడా ఉండేవారట.

కడప పోలీసులకు రెడ్డిని పట్టుకోవటం సాధ్యం గాక, బళ్లారి నుంచి ఇంగిలీషు వారికింద పనిచేసే సేనను రప్పించారు రెడ్డిని పట్టుకునేందుకు. తర్వాత నరసింహారెడ్డి సైన్యానికీ ఇంగిలీషోళ్ల కింద పనిచేసే సేనకూ మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో నరసింహారెడ్డి శౌర్య పరాక్రమాలు తెలిపే జానపద గేయాలున్నాయి. ఆయన ధాటికి ఆగలేక, ఇంగిలీషు సేన పలాయనం చిత్తగించింది.

నరసిహారెడ్డి తన సేనను సుంకేసుల, ముక్కమళ్ల, ముదిగోడు, కోనాల, సంజామల, కొండ కరటాల అనే పల్లెల నుంచి సమకూర్చుకున్నారు.

రెడ్డిని గురించిన జానపద గేయాలున్నాయి. నరసింహారెడ్డిని రెడ్డి కాదు బంగారపు కడ్డీ అని ప్రశంసిస్తారు జానపదులు.

1846 జులై 10వ తేదీన నరసింహారెడ్డి బృందం కోయిలకుంట్ల ట్రెజరీ ఆఫీసు పైబడి ధ్వంసం చేశారు. అడ్డగించిన ప్రభుత్వ సిబ్బందిని చిందరవందర చేసి, చాలామందిని గాయపరిచి ఒక దఫేదారునూ, అయిదు మంది పోలీసోళ్లను చంపేశారు. ఈ పోరాటంలో నరసింహారెడ్డి స్వయంగా పాల్గొన్నాడు. దఫేదారును కాల్చి చంపాడు. ఈ ఘర్షణలో నరసింహారెడ్డి మనుషులూ కొంతమంది చనిపోయారు.

ఈ ఘటన తెలుసుకొని కలెక్టర్ (ఇంగిలీషోడు) తారెత్తిపోయాడు. బళ్లారిలో ఉన్న దత్త మండలాల సైనికాధికారికి పంపాడు. వెంటనే వీలైనంత ఎక్కువ మంది సైనికుల్ని పంపమని.

1846 జులై 23 వ తేదీన కంభం నుంచి వస్తున్న లెఫ్టినెంట్ వాట్సన్ నాయకత్వంలోని మిలిటరీ నరసింహారెడ్డితో తలపడింది. మిలిటరీలో వందమంది సైనికులున్నారు. నరసింహారెడ్డి సైన్యంలో 5 వేల మంది వీరులున్నారు. రెండు సేనల మధ్య హోరాహోరీ పోరాటం జరిగింది ఐదు గంటలసేపు. చీకటి పడబోతుండగా వాట్సన్ తన సైన్యం తీసుకొని శెట్టివీడు గ్రామానికి పారిపోయాడు. తన సైన్యాన్ని ముండ్లపాడుకు తరలించాడు నరసింహారెడ్డి.

మర్నాడు కర్నూలు నుంచి కెప్టెన్ నాట్, కెప్టెన్ రస్సెల్ సైన్యాలు ముండ్లపాడు వద్ద నరసింహారెడ్డి సైన్యాన్ని ఎదుర్కొన్నాయి. హోరాహోరీ సమరం జరిగింది. నరసింహారెడ్డి తన సైన్యంతో కలిసి కొండల్లో, కోనల్లో పడి తప్పించుకు పోయాడు. గుత్త కనుమ గుండా వెళ్లి కొత్తకోట చేరుకున్నాడు. కానీ చాకచక్యంగా ఇంగిలీషోళ్లు ఆయన ఆచూకీ కనుగొన్నారు.

కలెక్టర్ కాక్రేన్ మిలిటరీ సాయంతో ఎర్రమల-నల్లమల కొండల మధ్య ఉన్న పేరు సోమల కొండలోని జగన్నాథ ఆలయంలో నరసింహారెడ్డి ఉన్నాడని పసిగట్టి అక్కడికి చేరుకొని, బోయ సైన్యాన్ని చంపి నరసింహారెడ్డిని పట్టి బంధించాడు. 1846 అక్టోబర్ ఆరవ తేదీన జరిగింది ఇది.

నరసింహారెడ్డికి ఉరిశిక్ష విధించారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీన సోమవారం ఉదయం 7గంటలకు కోవెలకుంట్లలో రెండువేల మంది చూస్తుండగా రెడ్డిని ఉరి తీశారు. అంతేకాదు, విప్లవకారుల్ని భయపెట్టేందుకు నరసింహారెడ్డి శిరస్సును 1877 దాకా అంటే, 30 సంవత్సరాల పాటు కోవెలకుంట్ల కోటలోని ఉరికొయ్యకు వేలాడదీసి ఉంచారు ఇంగిలీషోళ్లు బీభత్సంగా.

ఇదీ క్లుప్తంగా నరసింహారెడ్డి వీరగాథ. పాఠ్యాంశాల్లో చేర్చదగిన గాథ.

విశ్వవీధిలో... వేగుచుక్కలా...

మొక్కనో, గింజనో
పనికట్టుకుని నేలలో గుచ్చితే
ఎప్పటికో
పైకి మొలిచి వచ్చేదికాదు...
కవిత్వమంటే...

గాలి నీరు వేడి అందుకుని
ఎదిగేది కాదు..
మందులు మాకు వేసి పెంచితే
బతికి బట్టకట్టేది కాదు
కంచెలు కట్టి కాపాడితే
నిలబడేది కాదు...
కవిత్వం అంటే...!

నీలోని ఆవేదనలవేడికి నీ ఆక్రోశాల ధాటికి
కళ్లు తెరచుకుని...
నీ మనసు తడిని పీల్చుకుని...
నీ జీవిత సారం అంటించుకుని...
నీ లోకం రీతిని తనలో నాటుకుని...
నీ ఆలోచనా పొరలను చీల్చుకుని
దానంత అదిగా
పైకి తన్నుకొచ్చేదే అచ్చమైన కవిత్వం...!
అదే దమ్మున్న కవిత్వం...!
ఎవరి ఆలనా పాలనా లేకున్నా
ఏ సానుభూతికి, సాయానికీ
నోచుకోకున్నా
చేయూతనిచ్చే చేతులు కాన రాకున్నా
అంతెత్తున ఎదిగి...
తలెత్తి మరీ నిలబడుతుందది !

అలా అని పిచ్చి మొక్కనుకుని
అనాలోచనగా పీకేయకు...!
చిత్రంగా చూస్తూ దాన్నలా వదిలేయకు...
కడుపు చించుకు పుట్టిన బిడ్డలా...
హృదిని చీల్చు కొచ్చిన దాన్ని
ఓపికగా...ఒద్దికగా సంస్కరించు
అది చెప్పేపాఠాన్ని మౌనంగాగ్రహించు...
నేటికీ, రేపటికీ అదెంతో ఉపకరించు...!
నీకూ, నీ జాతికి అదే కళ్లు తెరిపించు...!

మరిన్ని మొక్కలను స్వాగతించు...
శాంతిని క్రాంతిని మంచినీ నిత్యంబోధించే
కవితావనంలా నీ చుట్టూ పెంచు...
కావలి కాస్తూ కరుణ చూపుతూ
జీవితాన్ని నువ్వు పునీతంగా ముగించు...
విశ్వవీధిలో వేగుచుక్కలా అలరారుతూ
శాశ్వతంగా జీవించు...!!

వసుధ, 9490832787

తీక్షణ వీక్షణంలోంచి...

ఈ క్షణం
తీక్షణంగా నిరీక్షణ చేస్తున్నాను
అక్షరాల దొంతరల్ని పేర్చుకుంటున్నాను.

నిరీక్షణ వీక్షణంలోంచి లేచి
ఏవో క్షణాల్ని ఏరుకుంటున్నాను.

ఏకాంతం రాలుతుందో
అక్షరం ఏలుతుందో
మదిలో తుపానులు తరుముతుంటాయి.
మనిషి మనుగడని తరుముతుంటాయి.
అస్తిత్వం ప్రశ్నలు కుదుపుతూ ఉంటాయి.

కాలంతో పోటీ పడటం
సవాళ్లకు పరిష్కారాలు అన్వేషించడం తోనే
క్షణాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

నాది కాని ప్రపంచంలో
నెగ్గుకు రావాల్సిన సందర్భాలు ఉంటాయి.

ఏం క్షణం నాది కాకపోయినా
తీక్షణంగా పరీక్షణ చేస్తే
ఏదో కొత్త రూపంలో
వెలుగు రేఖలు కన్పిస్తుంటాయి.

గవిడి శ్రీనివాస్, 7019278368

సంగిశెట్టీ శ్రీనివాస్‌కు

ఎదిరెపల్లి మశమ్మ స్మారక జాతీయ పురస్కారం

ప్రతి సంవత్సరం అందచేస్తున్న ఎదిరెపల్లి మశమ్మ స్మారక జాతీయ పురస్కారానికి ప్రముఖ రచయిత చరిత్ర పరిశోధకులు డా. సంగిశెట్టీ శ్రీనివాస్‌గారు ఎంపికయ్యారని, పురస్కార కమిటీ చైర్మన్ ఎదిరెపల్లి కాశన్న తెలిపారు. డిసెంబర్ 21.12.2025 ఆదివారం ఉదయం 10 గంటలకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం సింగిల్ విండో హాల్‌లో జరిగే ఈ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ గోరటి వెంకన్న, ప్రసిద్ధకవి విమర్శకులు డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఈ పురస్కారం కింద 20,000 నగదు, జ్ఞాపికను అందచేస్తామని తెలిపారు. కవులు, కళాకారులు రచయితలు, విద్యార్థులు అందరూ పాల్గొనాలని తెలిపారు.

ఎదిరెపల్లి కాశన్న, 9640006304

సందేశాత్మక చాగ్లా ఆత్మకథ 'శిశిరంలో గులాబీలు'

గ్రంథ సమీక్ష

పెనుగొండ లక్ష్మీనారాయణ
సెల్: 9440248778

భారతదేశానికి వివిధ బాధ్యతల (హోదాల) లో సేవలందించిన మహనీయమూర్తి ఎం.సి.చాగ్లా. పూర్తిపేరు మహమ్మద్ కరీం చాగ్లా. 30 సెప్టెంబరు 1900 న బొంబాయిలో పుట్టి 9 ఫిబ్రవరి 1981 న బొంబాయిలోనే తుది శ్వాస విడిచారు. తన జీవిత చరిత్రను 'రోజెస్ ఇన్ డిసెంబర్' పేరిట రాసుకున్నారు. ఈ పుస్తకాన్ని భారతీయ విద్యాభవన్ 1973 లో ప్రచురించింది.

తొలి అధ్యాయంలో ఆత్మకథ- దేనికోసం? అని ప్రశ్నించుకుంటూ 'భావితరాలను ప్రభావితం చేయడానికా?' అంటారు. నిజంగా ఈ పుస్తకం చదివిన ఏ తరం వారినైనా ప్రభావితం చేస్తుంది. నిష్పాక్షిత, నిజాయితీ, నిర్భీతితో కూడిన ఈ పుస్తకం రెండు, మూడు తరాల భారతదేశ చరిత్రను అందిస్తుంది.

ఈ పుస్తకాన్ని గురించి మాట్లాడే ముందు అనువాదం ఎలా ఉంది అనే అంశం గురించి కొద్దిపాటి చర్చ చేయాల్సి ఉంది.

అనువాదం గురించి చాగ్లా చెప్పిన మాటలు చాలా ముఖ్యమైనవి. "అనువాద పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలను భారీగా నిర్వహించటం ద్వారా భాషా సమస్య పరిష్కారం అవుతుందన్న మాట విన్నాను. అనువాదకుడికి రెండు భాషలపైన పట్టు ఉండాలి" ; "లోపభూయిష్టమైన అనువాదాల వల్ల ప్రజలకు, విద్యార్థులకు హాని కలుగుతుంది"; చాగ్లా మాటలు సరైనవే. అనువాద కష్టాలు అనువాదకుడికి ఉంటాయి. వీటిని గురించే రారా 'అనువాద సమస్యలు' పుస్తకాన్నే రాశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అనువాద అకాడమీని ఏర్పాటుచేసి ఆదాన ప్రదాన విషయాలలో గణనీయమైన కృషి చేస్తుంది. తెలుగునాట కూడా అనువాద అకాడమీని ఏర్పాటు చేయాలని అరసం తీర్మానాలు చేసింది. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం.

ఈ గ్రంథ అనువాదకుడు కందిమళ్ల శివప్రసాద్ చేసిన అనువాదం గురించి చెప్పుకుంటే శీర్షిక దగ్గర నుంచి చివరిపుట వరకూ ఉత్తమోత్తంగా అందించారు. 'రోజెస్ ఇన్ డిసెంబర్' కు 'శిశిరంలో గులాబీలు' అని పేరు పెట్టటంలోనే ఒక విశిష్టతను సాధించారు. ఈ పుస్తకం చదువుతుంటే ఒక ఆత్మకథను కాకుండా నవలను చదువుతున్న అనుభవాన్ని పాఠకునికి కలిగించారు శివప్రసాద్.

శివప్రసాద్ అనువాదకుడిగా ఇంతకు మునుపే ప్రసిద్ధ భారతీయ పాత్రికేయులు కోటంరాజు రామారావు జీవిత చరిత్ర 'కలం నా ఆయుధం: ఒక పాత్రికేయుడి జ్ఞాపకాలు' ద్వారా విశ్వకవి రవీంద్రనాథ్‌టాగోర్ 'శ్యామ' అనువాదం ద్వారా తెలుగు పాఠకలోకానికి పరిచయస్తులు. శివప్రసాద్ అనువాదకుడిగా ఈ పుస్తకాల వలనలే ఇప్పటి పుస్తకంలోనూ విజయుడయ్యారు. అయితే చాగ్లా జీవన రేఖలను ప్రత్యేకంగా ఇచ్చి ఉంటే బాగుండేది. తనను తాను పరిచయం చేసుకోకుండా వినయ పూర్వకంగా తప్పుకున్నారు. అనువాదకుడి పరిచయం కూడా చాలా అవసరమని గుర్తు చేస్తున్నా. శివప్రసాద్ పోస్టల్ శాఖలో విశ్రాంత ఉద్యోగి. గుంటూరు నివాసి.

ఇక పుస్తకంలోకి వెళితే న్యాయమూర్తిగా చాగ్లా తీర్పులు 'ఒక గొప్ప సాంస్కృతిక వికాసాన్ని ఆవిష్కరిస్తున్నట్లు అనిపిస్తాయి' అని న్యాయశాస్త్ర కోవిదులు ఎస్.ఎ.ఫాల్కీవాలా ప్రశంసించారు. ఇప్పుడు ఈ దేశానికి కావలసింది ప్రగతిశీల దృష్టితో కూడిన సాంస్కృతిక పునర్వికాసం అని గుర్తుంచుకోవాల్సిన సందర్భం.

చాగ్లా పాత్రికేయుడిగా, న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తిగా, విద్యాశాఖ మంత్రిగా, విదేశాంగ శాఖ మంత్రిగా, అనేక కమిటీలకు అధ్యక్షుడిగా, చైర్మన్‌గా వ్యవహరించారు. అమెరికా, ఇంగ్లండ్, క్యూబా, మెక్సికో వంటి దేశాలలో భారత రాయబారిగా, రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసి పేరు



తెచ్చుకున్న గొప్ప జాతీయవాది. ఈ దేశం గర్వించదగిన వ్యక్తి చాగ్లా.

ప్రపంచ ప్రముఖులెందరినో కలిసిన అనుభవం చాగ్లాది. టి.ఎస్.ఇలియట్, బెరిస్ మోర్టిన్, ఆల్డస్ హక్స్లీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సాహితీవేత్తలను కలిసిన కళాజీవి. చాగ్లా ప్రపంచప్రసిద్ధి చెందిన నీగ్రో గాయకుడు పాల్‌రాబ్సన్‌ను విపరీతంగా అభిమానించారు. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి పట్ల గౌరవాన్ని ప్రకటించారు. అలాగే దేశ విదేశాలలో ఎందరో ప్రముఖులతో కలిసి పనిచేసిన ప్రముఖుడు.

జవహర్‌లాల్‌నెహ్రూ, మొరార్జి, ఇందిరాగాంధీ వంటి ప్రధాన మంత్రులతో కలిసి పనిచేశారు. అనేక సందర్భాలలో వారితో విభేదించారు, విమర్శించారు. అత్యయిక పరిస్థితిని విధించిన ఇందిరాగాంధీని దుయ్యబట్టారు. నిర్మొహమాటం, నిర్భీతి, నిజాయితీ వీరి విమర్శలో కనిపిస్తుంది.

'ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతు పలికి గాంధీ తప్పు చేశారని విశ్వాసం' అని చాగ్లా తన అభిప్రాయాన్ని నిర్ద్వందంగా ప్రకటించారు.

"ఈ దేశ పౌరులు ఏమి తినాలి, ఏమి తాగాలన్న విషయంలో ప్రభుత్వ జోక్యం ఉండకూడదు' అని స్పష్టం చేసిన చాగ్లా వ్యాఖ్యలు నేడు మనదేశంలో చెలరేగుతున్న ఆటవిక సంఘటనల నేపథ్యంలో గమనించదగినవి.

విద్య గురించి "ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సోషలిజం వంటి భావాలు వారిలో పాదుగొల్పటానికి ఉత్తమ ప్రమాణాలు గల విద్య యొక్క అవసరం ఉంది. సోషలిజం అంటే ఎవరూ భయపడనక్కరలేదు. శతాబ్దాల తరబడి అణగారిన వర్గాలకు సోషలిజం ద్వారా సామాజిక న్యాయం జరుగుతుంది" అని విద్యాశాఖ మంత్రిగా సామ్యవాద వ్యవస్థ పట్ల అభిమానం ప్రకటించారు.

ప్రాథమిక విద్య మాతృభాషలోనే బోధించాలన్న ఆశయం చాగ్లాది. "ఈ దేశంలో త్రిభాషా సూత్రం పనిచేయదని నా విశ్వాసం' అని కూడా స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం త్రిభాషా విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తోంది. ఇది హిందీ భాషను దక్షిణ భారత రాష్ట్రాలపై బలవంతంగా రుద్దే ప్రయత్నమే. తమిళనాడు ప్రభుత్వం దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఆంధ్ర ప్రభుత్వం పెదవి విప్పలేదు.

"రేడియో ప్రసంగాల కంటే మిన్నగా నాటకమనే ప్రక్రియ ప్రజలపై ఎక్కువగా ప్రభావం చూపగలదని నా నమ్మకం. బొంబాయిలో ఆరుబయట నిర్మించిన రంగస్థలం మాదిరిగా గ్రామాలలో కూడా అలాంటి వేదికలను ఏర్పాటు చేయాలన్న ఆకాంక్ష" చాగ్లాది. చాగ్లా ఈ ఆశ నెరవేరాలనేది సాంస్కృతిక రంగాల కోరిక. ఎప్పటికి సాధ్యమవుతుందో!" "కళలు, సంస్కృతికి సంబంధించిన పాఠ్యాంశాలు లేని చదువులు నిరర్థకమైనవి" అని ఒక విద్యావేత్త స్పష్టం చేశారు.

జిన్నా చాగ్లాకు బాగా పరిచయం. దేశ విభజనకు కారకుడైన జిన్నాను తీవ్రంగా విమర్శించారు. "దేశ విభజనను ఒక విషాదకరమైన ఘట్టంగా భావిస్తాను. ఒక చారిత్రకమైన ఆవశ్యకత లేకుండా ఈ మార్పు జరిగింది. దీనివల్ల సాధించిందేమీ లేదు." "పాపం లోంచి పాకిస్థాన్ పుట్టింది. హింసావాదంతో మరణాన్ని చేరుకుంటుంది" అని కూడా అన్నారు. పాక్ ఏర్పాటైనప్పటి నుంచి జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు నిజమని రుజువు చేస్తున్నాయి.

చాగ్లా పుట్టుకతో ముస్లిం. ఏనాడూ సంప్రదాయాలు, ఆచారాలు పట్టించుకోలేదు. సెక్యులర్‌గా జీవించారు. ముస్లింగా తనకు కలిసొచ్చే అవకాశాలను వదులుకున్నారు. అటువంటి అవకాశాలు కల్పిస్తామన్న నెహ్రూను వ్యతిరేకించారు.

"పుస్తక పఠనం, కళారాధన-చరిత్ర, సాహిత్యం నాకు అభిమాన విషయాలు" ఇంకా సంగీతం, చిత్రకళ, శిల్పకళ చాగ్లాకు ఎంతో ఇష్టం.

"నా దృష్టిలో సంపాదన ముఖ్యంకాదు, కళాత్మకంగా డబ్బు ఖర్చు చేయడం అవసరమని భావిస్తాను" అని తన జీవన దృక్పథాన్ని ప్రకటించారు.

"జీవితంలో ఏమి సాధించాడు అనే దానికంటే ఎంత ఉన్నతంగా బతికాడు అన్నదానికి నేను విలువనిస్తాను" అన్న చాగ్లా ఉన్నతంగా జీవించిన ఉత్తమ మానవుడు. భారతదేశం తరతరాలకు గౌరవించదగిన ప్రియపుత్రుడు. వారికి కందిమళ్ల శివప్రసాద్ మన తెలుగు వారందరి పక్షాన అందించిన మహా నివాళి ఈ పుస్తకం.

దిల్లీ ఉక్కిరి బిక్కిరి

మరింత పెరిగిన వాయు కాలుష్యం

హర్యానాలో పొగమంచు బీభత్సం

న్యూదిల్లీ/చండీగఢ్: దేశ రాజధాని దిల్లీలో వాయుకాలుష్యం పెరిగింది. రోహిణి ప్రాంతంలో ఏక్యూఐ (వాయు నాణ్య సూచీ) అత్యధికంగా 499 పాయింట్స్‌కు చేరింది. కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికే జీఆర్‌ఏపీ-4 నిబంధనలను అమలు చేస్తోంది. దట్టమైన పొగ మంచు నగరాన్ని కప్పేయడంతో దిల్లీ వాసులు అవస్థలు పడుతున్నారు రాజధానిలోని అన్నీ మానిటరింగ్ స్టేషన్‌లల్లో వాయునాణ్యత సూచీ రెడ్ కేటగిరీకి చేరింది. రోహిణి ప్రాంతంలో సూచీ అత్యధికంగా 499 పాయింట్స్‌కు చేరింది. ఇక జహాంగిర్‌పురి, వివేక్ విహార్ ప్రాంతంలో కూడా ఏక్యూఐ 495కి చేరింది. అనేక ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేయడంతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. అనేక మంది వాహనాల హెడ్‌లైట్స్ వేసుకుని నెమ్మదిగా డ్రైవ్ చేస్తూ ప్రయాణిస్తున్నారు. కాలుష్య నియంత్రణ బోర్డు ప్రకారం వాయునాణ్యత సూచీ 401-500 మధ్య ఉంటే కాలుష్య తీవ్రతను రెడ్ కేటగిరీగా పరిగణిస్తారు. ఆరోగ్యవంతులకు కూడా హానిచేసే స్థాయిలో కాలుష్యం పెరిగినట్టు రెడ్ క్యాటగిరీ సూచిస్తుంది. ఈ సమయాల్లో ఆరు బయటకు వెళ్లడం శ్రేయస్కరం కాదని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో ఏక్యూఐ స్కేలు 500 పాయింట్స్ వరకే ఉంటుంది. ఇంతకుమించిన కాలుష్యాన్ని కూడా అధికారులు రెడ్ కేటగిరీలోనే చేరుస్తారు. 500కి మించిన ఏక్యూఐతో ఎలాగూ ప్రమాదమే, ప్రత్యేకంగా ఈ సంఖ్యను చూపించి ప్రజలను భయాందోళనకు గురిచేయడంతో ప్రయోజనం సూన్యమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ప్రొఫెసర్ డా. గుఫ్రాన్ బెయిగ్ తెలిపారు. మరోవైపు వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు దిల్లీ ప్రభుత్వం శనివారం జీఆర్‌ఏపీ-4 ఆంక్షలను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, అత్యవసరం కాని ట్రక్కులు దిల్లీలోకి రాకుండా నిషేధం విధించారు. ఎల్‌ఎన్‌జీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రం యథావిధిగా ఢిల్లీలోకి వెళ్లొచ్చు. రాజధానిలో రిజిస్టర్ అయిన బీఎస్-4, అంతకుముందున్న డీజిల్ వాణిజ్య వాహనాల రాకపోకలపై కూడా నిషేధం ఉంది. నిర్మాణ సంబంధిత పనులకు కూడా ఫుల్ స్టాప్ పెట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. వివిధ కార్యాలయాల్లోని సుమారు 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హెూమ్ ఇవ్వాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది.

హర్యానాలో ఒకదానికొకటి ఢీకొన్న 40 వాహనాలు

హర్యానాలో దట్టమైన పొగమంచు కారణంగా ఆదివారం పలుచోట్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రోడ్లపై కనీసం దారి కూడా కనిపించకపోవడంతో బస్సులు, ట్రక్కులతో సహా దాదాపు 40 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు డ్రైవర్లు, ప్రయాణికులు గాయపడ్డారు. ముఖ్యంగా రోహతక్, హిసార్, రేవాడీ జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. రోహతక్‌లోని మెహమ్ ప్రాంతంలో ఒక హైవే కూడలి వద్ద సుమారు 35 నుంచి 40 వాహనాలు గొలుసుకట్టుగా ఢీకొన్నాయి. మొదట ఒక ట్రక్కు, కారు ఢీకొనగా, వెనుక వస్తున్న వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి ఢీకొంటూ వెళ్లాయి. ఈ ఘటనలో అనేక వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ఒక ట్రక్కు పూర్తిగా దెబ్బతినగా, అందులో చిక్కుకున్న వారిని స్థానికులు రక్షించే ప్రయత్నం చేశారు. ఇదే తరహాలో రేవాడీలోని జాతీయ రహదారి 352పై దారి కనిపించకపోవడంతో మూడు, నాలుగు బస్సులు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలోనూ పలువురు గాయపడ్డారు. గత కొద్ది రోజులుగా హర్యానాలో తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 4 నుంచి 6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఈ నేపథ్యంలో దట్టమైన పొగమంచు ఏర్పడుతుందని, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని భారత వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఫాగ్ లైట్లు వాడాలని, వాహనాల మధ్య దూరం పాటించాలని సూచించింది.

కాలువలో పడిన కారు.. ఉపాధ్యాయ దంపతుల మృతి

దట్టమైన పొగమంచు కారణంగా కాలువలో కారు పడింది. అందులో ప్రయాణించిన ఉపాధ్యాయులైన దంపతులు మరణించారు. టీచర్ అయిన మహిళ ఎన్నికల విధుల కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పంజాబ్‌లోని మోగా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మాన్సా జిల్లాకు చెందిన జస్ కరణ్ సింగ్ ఇంగ్లీష్ టీచర్. ఆయనతో పాటు భార్య కమల్‌జీత్ కౌర్ కూడా మోగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. కాగా, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం సంగత్‌పురా గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులకు భార్య కమల్‌జీత్ కౌర్‌ను జస్ కరణ్ సింగ్ కారులో తీసుకెళు తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా వారి కారు అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న కాలువలోకి అది దూసుకెళ్లింది. కాలువలో బోల్తా పడిన కారులో చిక్కుకున్న టీచర్ దంపతులు ఈ ప్రమాదంలో మరణించారు.

అనారోగ్య సమస్యలతోనే ఆకస్మిక మరణాలు

కోవిడ్ వ్యాక్సిన్ వల్ల గుండెపోటు రాదు

దిల్లీ ఎయిమ్స్ పరిశోధనలో వెల్లడి

న్యూదిల్లీ: కోవిడ్-19 వ్యాక్సిన్‌కు, యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు ఎలాంటి శాస్త్రీయ సంబంధం లేదని దిల్లీ ఎయిమ్స్ పరిశోధన స్పష్టం చేసింది. వ్యాక్సిన్లు సురక్షితమైనవేనని, వాటి సమర్థతను ఈ అధ్యయనం మరోసారి ధృవీకరించిందని పరిశోధకులు ఆదివారం తెలిపారు. భారత వైద్య పరిశోధన మండలి (ఏఐఐఎంఎస్)కి చెందిన 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్'లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. ఏడాది పాటు సాగిన ఈ పరిశోధనలో భాగంగా, 18 నుంచి 45 ఏళ్ల వయసు మధ్య ఆకస్మికంగా మరణించిన వారి కేసులను ఎయిమ్స్ వైద్యులు క్షుణ్ణంగా విశ్లేషించారు. ఇందుకోసం పోస్టుమార్టం, ఇమేజింగ్, హిస్టోపాథలాజికల్ పరీక్షలతో పాటు మృతుల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విశ్లేషణలో కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వారికి, తీసుకోని వారికి మధ్య ఆకస్మిక మరణాల విషయంలో గణాంకపరంగా ఎటువంటి తేడా లేదని తేలింది. యువతలో సంభవించిన మరణాలకు ప్రధాన కారణంగా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్యాలు కూడా కొన్ని కేసులలో మరణానికి దారితీశాయని తేలింది. ఈ ఫలితాలు ప్రపంచవ్యాప్తంగా జరిగిన శాస్త్రీయ పరిశోధనల ఫలితాలతో సరిపోలుతున్నాయని ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ అరవ తెలిపారు. "వ్యాక్సిన్ల వల్లే యువత చనిపోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలు, నిరాధారమైన నివేదికలను ఈ అధ్యయనం ఖండిస్తోంది. ప్రజలు ఇలాంటి అపోహలను నమ్మకుండా, శాస్త్రీయ ఆధారాలను మాత్రమే విశ్వసించాలి" అని ఆయన సూచించారు. యువతలో ఆకస్మిక మరణాలకు గుర్తించని అనారోగ్య సమస్యలే కారణమని, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి మార్పుల ద్వారా ఇలాంటి ముప్పులను తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

యూపీ బీజేపీ అధ్యక్షుడిగా పంకజ్ చౌదరి

లక్నో: ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను లక్నోలోని పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి స్థానంలో పంకజ్ చౌదరి కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బీజేపీ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడిగా పంకజ్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికకావడం సంతోషంగా ఉందని పీయూష్ గోయెల్ తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేష్ పాఠక్, ఇతర నేతల సమక్షంలో పంకజ్ చౌదరి ఎన్నికను గోయెల్ ప్రకటించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పంకజ్ చౌదరి శనివారంనాడు నామినేషన్ వేశారు. ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే అధికారికంగా ఆదివారంనాడు ఆయన ఎన్నికను ప్రకటించారు. గోరఖ్‌పూర్‌కు చెందిన పంకజ్ చౌదరి ప్రముఖ కుర్మి సామాజిక వర్గం నేతగా మంచి పేరుంది. ఏడుసార్లు ఎంపీగా ఆయన గెలిచారు. 2022 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కుర్మి సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు సమాజ్‌వాదీ పార్టీకి మద్దతు ఇచ్చారు. కాగా, యూపీ రాష్ట్ర చీఫ్‌గా బీజేపీ నుంచి గతంలో పనిచేసిన ఎంపీ వినయ్ కతియార్, మాజీ మంత్రి ఓం ప్రకాశ్ సింగ్, స్వతంత్ర దేవ్ సింగ్‌లు కుర్మి సామాజిక వర్గానికి చెందినవారే కావడం విశేషం. 2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కుర్మి నేత పంకజ్ చౌదరిని పార్టీ చీఫ్‌గా బీజేపీ ఎన్నికోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆర్జిస్తున్న మాజీ భార్యకు భరణం దేనికి?

దిగువ కోర్టు తీర్పును కొట్టేసిన అలహాబాద్ హైకోర్టు

భోపాల్: సొంతంగా ఆర్జిస్తున్న విషయాన్ని దాచిపెట్టి, అసత్యాలతో మాజీ భర్త నుంచి భరణం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఒక మహిళపై అలహాబాద్ హైకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఆమెకు భరణం చెల్లించాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఆమె పోషణకు అవసరమైన సొమ్మును ఆమే ఆర్జిస్తున్నారని, అలాంటప్పుడు భరణం దేనికని న్యాయస్థానం ప్రశ్నించింది. పిటిషనర్ మాజీ భర్త అంకిత్ సాహ్ దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌కు అనుకూలంగా హైకోర్టు తీర్పు చెప్పింది. తాను పోస్టు గ్రాడ్యుయేట్‌నని, వెబ్ డిజైనింగ్‌లో ప్రావీణ్యం ఉందని పిటిషనర్ అంతకుముందు దిగువ కోర్టులో పేర్కొన్నారు. తాను ఒక కంపెనీలో సీనియర్ సేల్స్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నానని, నెలకు రూ.34 వేలు ఆర్జిస్తున్నానని కూడా ఆమె తెలిపారు. తాను నెలకు రూ.36వేలు సంపాదిస్తున్నట్లు ఆ తర్వాత క్రాస్ ఎగ్జామినేషన్‌లో చెప్పారు. ఎలాంటి బాదరాబందీలేని ఒక మహిళకు ఆ మొత్తం చాలా స్వల్పమని చెప్పలేమని కోర్టు వ్యాఖ్యానించింది. మరోవైపు పిటిషనర్ మాజీ భర్తకు వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవడం సహా అనేక బాధ్యతలు ఉన్నాయనే విషయాన్ని హైకోర్టు ధర్మాసనం ఎత్తిచూపింది. పిటిషనర్ తొలుత తన అఫిడవిట్‌లో పూర్తి వాస్తవాలను వెల్లడించలేదని అంతకుముందు ఆమె మాజీ భర్త తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ ముందుగా తాను నిరక్షరాస్యురాలినని, నిరుద్యోగినని చెప్పుకొన్నారని, అయితే ఆమె మాజీ భర్త దాఖలు చేసిన పత్రాన్ని ఆమెకు చూపి... ప్రశ్నించినప్పుడు ఆమె తన ఆదాయాన్ని వెల్లడించారని తెలిపారు. దీన్నిబట్టి ఆమె దిగువ కోర్టును నిజాయతీగా ఆశ్రయించలేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. దాంతో సత్యంపట్ల ఎలాంటి గౌరవంలేని, వాస్తవాలను విస్మరించే కక్షిదారుల కేసులను న్యాయస్థానాలు బుట్టదాఖలు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

శతద్రు దత్తాకు బెయిల్ నిరాకరణ

కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాటల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ ఇండియా టూర్' నిర్వాహకుడు శతద్రు దత్తా కు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. దీంతో పోలీసులు ఆయనను 14 రోజుల కస్టడీకి తీసుకున్నారు. శనివారం తొలిరోజు పర్యటనలో భాగంగా సాల్ట్‌లేక్ స్టేడియానికి మెస్సి వచ్చారు. అయితే చెప్పిన సమయం కంటే అతి తక్కువ సమయం గడపటం, చూసేందుకు అవకాశం లేకపోవడంతో మెస్సి అభిమానులు రెచ్చిపోయారు. సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలు స్టేడియంలోకి విసిరేయడంతో ఉద్రిక్తతలు తలెత్తాయి. పోలీసులు రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ఆదివారం స్టేడియాన్ని పరిశీలించింది. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తోంది. ఘటనకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందించనుంది. కాగా, మెస్సి తొలిరోజు పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో పర్యటించారు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డితో ఫుట్‌బాల్ ఆడారు. పలువురు పిల్లలు కూడా పాల్గొన్నారు. రెండో రోజైన ఆదివారం ముంబైలోని వాంఖెడే స్టేడియంలో అభిమానులను మెస్సి కలుసుకున్నారు.

విమానంలో మహిళకు అస్వస్థత...

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడిన మాజీ ఎమ్మెల్యే

న్యూదిల్లీ: విమానంలో అస్వస్థతకు గురైన అమెరికన్ మహిళ ప్రాణాలను కాపాడిన మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ డాక్టర్ అంజలి నింబాల్కర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా అంజలిని సోషల్ మీడియా వేదికగా అభినందించారు. ఆమెది నిస్వార్థ సేవ అని కొనియాడారు. శనివారం గోవా నుంచి దిల్లీకి బయలుదేరిన విమానంలో ఈ ఘటన జరిగింది. కాలిఫోర్నియాకు చెందిన జెన్నీ అనే ప్రయాణికురాలు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన డాక్టర్ అంజలి వెంటనే స్పందించి ఆమెకు సీపీఆర్ చేశారు. దీంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. దాదాపు గంటన్నర పాటు డాక్టర్ అంజలి ప్రయాణికురాలి పక్కనే ఉంటూ ఆమె ఆరోగ్య పరిస్థితిని కనిపెట్టుకుని ఉన్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా మారేలా చికిత్స అందించారు. ఇక విమానం దిల్లీలో దిగిన వెంటనే సిబ్బంది అమెరికా మహిళను ఆసుపత్రికి తరలించారు. నింబాల్కర్ సేవా తత్పరత తనను కదిలించిందని కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఎక్స్ వేదికగా ప్రశంసించారు. రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ వైద్య వృత్తికి విరామం ఇచ్చినప్పటికీ ఈ ఉదంతంతో నింబాల్కర్ నిబద్ధత స్పష్టమైందని అన్నారు. మరోవైపు, ఆన్‌లైన్‌లో కూడా ఈ ఉదంతంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. డాక్టర్ అంజలి 2018-23 మధ్యకాలంలో ఖానాపూర్ ఎమ్మెల్యేగా సేవలందించారు.

ప్రయాణికుడిపై కండక్టర్ దాడి

జైపూర్: టికెట్ రేటు పోగా మిగిలిన డబ్బు ఇవ్వాలని అడిగినందుకు ఓ ప్రయాణికుడిపై కండక్టర్ దాడి చేసిన ఘటన రాజస్థాన్‌లో వెలుగుచూసింది. సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భరత్‌పూర్ నుంచి ఆగ్రాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఈ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రయాణికుడు భరత్‌పూర్ నుంచి ఆగ్రాకు వెళ్తున్నాడు. అయితే అతడు వెళ్లాల్సిన గమ్యస్థానానికి కండక్టర్‌కు రూ.500 ఇచ్చాడు. అయితే టికెట్ ధర రూ.64. మిగిలిన డబ్బు ఇవ్వాలని ప్రయాణికుడు కండక్టర్‌ను కోరాడు. అయితే... ఈ విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కండక్టర్ విచక్షణారహితంగా ప్రయాణికుడిపై దాడి చేశాడు. బస్సులో ఉన్న ఇతర ప్రయాణికులు గొడవను ఆపడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. డ్రైవర్ కూడా దాడిని ప్రోత్సహించినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. మిగిలిన డబ్బులు అడిగితే కొట్టడం ఏంటని కండక్టర్ పైనా, రాజస్థాన్ ఆర్టీసీపై నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు .

వైద్యవిద్య సీట్లలో తీవ్ర అసమానతలు

- తెలంగాణ, కర్నాటక, తమిళనాడుల్లో పది లక్షలమందికి 150
- పుదుచ్చేరిలో 2వేలు... బీహార్‌లో 21లోపే
- పార్లమెంటుకు స్థాయీ సంఘం నివేదిక

న్యూదిల్లీ : దేశంలో ఎంబీబీఎస్ సీట్ల విషయంలో రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలున్నట్లు పార్లమెంటరీ స్థాయీసంఘం పేర్కొంది. కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా, మరికొన్ని రాష్ట్రాల్లో జాతీయ సగటుకంటే తక్కువగా సీట్లు ఉన్నట్లు విచారం వ్యక్తంచేసింది. దేశంలో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 75 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. తెలంగాణ, కర్నాటక, తమిళనాడుల్లో 150... పుదుచ్చేరిలో రెండువేలు చొప్పున సీట్లున్నాయి. బీహార్‌లో 10 లక్షల జనాభాకు అత్యల్పంగా 21 సీట్లే ఉన్నాయి. ఈ అంతరాన్ని తగ్గించడానికి జాతీయ వైద్య కమిషన్ చొరవ చూపాలని, పదిలక్షల మంది జనాభాకు 100 కంటే తక్కువ సీట్లుండే రాష్ట్రాల్లో కొత్త కాలేజీల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని స్థాయీసంఘం సూచించింది. తాజా నివేదికలో ఇతర సిఫార్సులు... కొత్త వైద్యకళాశాలకు ఏటా 50/100/150 ఎంబీబీఎస్ సీట్లకు మాత్రమే అనుమతిస్తున్నారు. కాలేజీ కొత్తదా, పాతదా అనేదాంతో సంబంధం లేకుండా మౌలికవసతులు, బోధనా సిబ్బందిని పరిగణనలోకి తీసుకుని దశలవారీగా గరిష్ఠంగా 250 సీట్ల వరకు పెంచుకొనేందుకు అవకాశమివ్వాలి. వైద్య సౌకర్యాలు పెద్దగాలేని జిల్లాల్లో కొత్త కాలేజీలు ప్రారంభించడానికి ప్రాధాన్యమివ్వాలని పార్లమెంటరీ స్థాయీసంఘం తెలిపింది.

విదేశాలకు వెళ్లాల్సిన అవసరం రాకుండా...

దేశంలో సీట్లు రాక చాలామంది విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారు. చదువయ్యాక ఇక్కడ లైసెన్సింగ్ పరీక్ష ఉత్తీర్ణులై శాశ్వత రిజిస్ట్రేషన్ పొందడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వీరి రిజిస్ట్రేషన్, వృత్యంతర శిక్షణ విధానాలు క్రమబద్ధం చేయాలి. విదేశాలకు వెళ్లాల్సిన అవసరం రాకుండా దేశంలో మరో 40వేల ఎంబీబీఎస్ సీట్లు పెంచాలి. వైద్యవిద్యపై దేశంలో రూ.60 లక్షల నుంచి రూ.కోటి ఖర్చుచేయాల్సి వస్తోంది. పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు వైద్యకళాశాలల్లో 50 శాతం సీట్ల ఫీజులను ప్రభుత్వం నిర్ధారించాలి. వైద్య కళాశాలలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో నిర్వహించే అవకాశాలపై ఆలోచించాలి. బోధనా సిబ్బంది కొరతను పరిష్కరించాలి. ఒప్పంద నియామకాలను పక్కనపెట్టి మంచి వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించే విధానాన్ని అనుసరించాలి. బోధన వైపు వచ్చే వైద్యులకు చేయూతనివ్వాలి.

'ఓట్ల దొంగతనం' తోనే బీజేపీ సర్కార్

భూపేశ్ బాఘెల్

న్యూదిల్లీ : బీజేపీ ప్రభుత్వం ఓట్లను దొంగిలించడం ద్వారా ఏర్పడిందని చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు భూపేశ్ బాఘెల్ ఆదివారం అన్నారు. 'ఓట్ చోర్, గద్దీ చోడ్' ర్యాలీ ఈ సందేశాన్ని దేశ వ్యాప్తంగా వ్యాపింపజేస్తోందని తెలిపారు. 'మేము దేశ వ్యాప్తంగా 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే సందేశాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాము. ఎందుకంటే ఈ ప్రభుత్వం ఓట్ల దొంగతనం ద్వారా ఏర్పడింది' అని బాఘెల్ ఏఎన్ఐ వార్తా సంస్థతో అన్నారు. 'ఓట్ల దొంగతనం' కు వ్యతిరేకంగా కాంగ్రెస్ మెగా ర్యాలీపై కాంగ్రెస్ నాయకుడు రాజేశ్ ఠాకూర్ మాట్లాడుతూ 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే నినాదంతో మేము రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ముందుకు సాగుతున్నాము. ప్రతి ఒక్కరికీ ఒక ఓటు హక్కు ఇవ్వబడింది. ప్రతిదీ ఆ ఓటు ద్వారానే నిర్ణయించబడుతుంది. దానిని లాక్కోవడానికి ప్రయత్నం జరుగుతోంది. మేము దానిని లాక్కోనివ్వము. ఈరోజు, లక్షల సంఖ్యలో మేము వారిని సింహాసనం నుంచి దించేస్తాము' అని తెలిపారు.

కేరళ స్థానిక ఎన్నికల్లో యూడీఎఫ్ ఆధిక్యం

తిరువనంతపురం : కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యం సాధించింది. 45 ఏళ్లుగా వామపక్షాల చేతిలో ఉన్న తిరువనంతపురం నగరపాలక సంస్థలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే విజయం సాధించింది. అలాగే గడచిన 25 సంవత్సరాలుగా వామపక్షాలు పరిపాలిస్తున్న కొల్లం నగరపాలక సంస్థ యూడీఎఫ్ వశమైంది. ఈ ఎన్నికలో మొత్తం 87 పురపాలక సంఘాలకు గాను యూడీఎఫ్ 54 చేజిక్కించుకుంది. ఎల్‌డీఎఫ్ 28 మున్సిపాలిటీల్లో, ఎన్డీయే రెండు పురపాలక సంఘాల్లో విజయం సాధించాయి. రాష్ట్రంలోని ఆరు నగర పాలక సంస్థల్లో నాలుగు యూడీఎఫ్ పరంకాగా ఎన్డీయే, ఎల్‌డీఎఫ్‌లు చెరొకటి గెలుచుకున్నాయి. 504 గ్రామ పంచాయతీల్లో యూడీఎఫ్, 341 పంచాయతీల్లో ఎల్‌డీఎఫ్, 64 చోట్ల టీఐఈ, 26 పంచాయతీల్లో ఎన్డీయే పైచేయి సాధించాయి. 14 జిల్లా పంచాయతీల్లో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లకు ఏడేసి స్థానాలు లభించాయి. అలాగే బ్లాకు స్థాయిలో యూడీఎఫ్‌కు 79 స్థానాలు, ఎల్‌డీఎఫ్‌కు 63 లభించాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తిరువనంతపురం నగరపాలక సంస్థలో భారీ ఆధిక్యత సాధించడం విశేషం. మొత్తం 101 డివిజన్లలో ఎన్డీయే 50, ఎల్‌డీఎఫ్ 29, యూడీఎఫ్ 19 డివిజన్లలో గెలుపొందాయి. తిరువనంతపురంలో ఎన్డీయే విజయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచిన బీజేపీ నేతలకు కాంగ్రెస్ నేత శశిథరూర్ శుభాకాంక్షలు తెలిపారు. యూడీఎఫ్‌కు ఆధిక్యాన్ని అందించినందుకు కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ...కేరళ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

మమతా బెనర్జీని అరెస్ట్ చేయాలి

మెస్సీ ఈవెంట్‌పై అసోం సీఎం ఫైర్

గుహవతి: ఫుట్‌బాల్ ఐకాన్ లియోనెల్ మెస్సీ కోల్‌కతా పర్యటన తీవ్ర గందగోళానికి దారి తీసిన సంగతి విదితమే. ఈ ఘటనపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ... పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. మెస్సీ 'గోట్ టూర్ 2025' గురించి ప్రస్తావిస్తూ.. " ఈ గందరగోళానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత. ముఖ్యమంత్రి, హెూంమంత్రి మమతా బెనర్జీని, కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను అరెస్ట్ చేసి ఉండాలి" అని అన్నారు. ఈవెంట్ నిర్వాహకుడిని అరెస్ట్‌ను తాను సమర్థించడం లేదా వ్యతిరేకించడం లేదని ఆయన అన్నారు. మొదటి బాధ్యత హెూం మంత్రి, పోలీస్ కమిషనర్‌లదని చెప్పారు. బెంగాల్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో వైఫల్యాలు కనిపిస్తున్నాయని అన్నారు. సింగర్ జుబీన్ గార్గ్ మరణం తర్వాత గౌహతిలో జరిగిన భారీ ప్రజా సమావేశాలు, ముంబైలో మహిళ ప్రపంచకప్ నిర్వహరణ ఎంతో బాగా జరిగాయని, కానీ బెంగాల్‌లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని అన్నారు. పశ్చిమ బెంగాల్ ఊహించలేని రాష్ట్రమని, అక్కడి వీఐపీ సంస్కృతి తీవ్ర స్థాయిలో ఉందని మండిపడ్డారు. "మెస్సీ మొత్తం ప్రపంచానికి ఆదర్శం. మమతా బెనర్జీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. బెంగాల్‌లో ప్రతిరోజూ అమాయక ప్రజలు దారుణాలకు గురవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం" అని హిమంత అన్నారు.

అత్యాచార నిందితుడి క్షమాభిక్ష పిటిషన్ తిరస్కృతి

న్యూదిల్లీ: ఒక అత్యాచార నిందితుడి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. 2021లో మహారాష్ట్రలో రెండేళ్లబాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన అనంతరం హత్య చేసిన రవి అశోక్ ఘుమారేకి సుప్రీంకోర్టు మరణ శిక్ష విధించింది. నిందితుడు సహజ, సామాజిక మరియు చట్టపరమైన అన్నినిబంధనలను అతిక్రమించాడని, అతనికి మరణశిక్షే సరైనదని 2019, అక్టోబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది.

అతని క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించారని అధికారులు వెల్లడించారు. ఇది రాష్ట్రపతి తిరస్కరించిన మూడవ క్షమాభిక్ష పిటిషన్ అని పేర్కొన్నారు.

తమిళనాట పొత్తుల కోసం బీజేపీ వెంపర్లాట

ఎన్నికల ముందు 'పొంగల్' వేడుకల్లో మోదీ?

చెన్నై: ప్రధాని నరేంద్రమోదీ ఈసారి తమిళనాడులో "పొంగల్" పండగ వేడుకలు జరుపుకునే అవకాశం ఉందని ఆ రాష్ట్ర బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. జనవరి 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఆయన పర్యటించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో రైతులతో కలిసి పొంగల్ జరుపుకోనున్నారు. 2026తో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మోదీ పర్యటన కీలకంగా మారే అవకాశం ఉంది. ఇది గ్రామీణ ఓటర్లను ఆకట్టుకోవడంతో పాటు సాంస్కృతిక ఏకీకరణను పెంపొందించే ప్రయత్నంగా చూస్తున్నారు. పంటల పండగగా పిలిచే "పొంగల్" వేడుకల్ని తమిళనాడులో ప్రధాని మోదీ జరుపుకోవడం ఇదే తొలిసారి అవుతుంది. గ్రామీణ తమిళనాడుతో బీజేపీ సంబంధాలను బలపరచడం, తమిళ సంస్కృతి, గుర్తింపుపై తన ప్రాధాన్యతను నొక్కి చెప్పడాన్ని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల ప్రకారం తమిళనాడు-కాశీ మధ్య నాగరికత, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి కాశీ తమిళ సంగమం 4.0 ముగింపు వేడుకలకు ప్రధాని రామేశ్వరం వెళ్లే అవకాశం ఉంది. వీటిలో పాటు బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ నేతృత్వంలో పుదుక్కోటలో జరగనున్న రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమం 'తమిళగం తలై నిమిర తమిళనిన్ పయనం' ముగింపు కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొనే అవకాశం ఉంది. ఎన్నికలకు ముందే ప్రధాని పర్యటనతో తమిళనాడులో ఎన్డీయే ఒక రూపాన్ని సంతరించుకునే అవకాశం ఉందని, వివిధ ప్రాంతీయ పార్టీలు యెన్డీయేలో చేరవచ్చని తెలుస్తోంది. రాబోయే తమిళనాడు ఎన్నికల కోసం వ్యూహాలు, సమన్వయం, కార్యచరణ ఖరారు చేయడానికి మోడీ యెన్డీయే నాయకులతో సమావేశం కూడా నిర్వహించే అవకాశం ఉంది. ప్రస్తుతం, తమిళనాడులో యెన్డీయేను మరింత బలపరచడానికి పట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే), దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం (డీఎండీకే), అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఎంఎంకే) , బహిష్కృత ఏఐఏడీఎంకే నాయకుడు ఓ. పన్నీర్‌సెల్వంతో సహా వివిధ పార్టీలతో చర్చలు జరుపుతోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-దుండిగల్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని బికేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు,కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ జిహెచ్ఎంసి పరిధి బౌరంపేట్ లో నిర్వహించిన 13వ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ బి కేర్ ఫౌండేషన్ ఉచిత వైద్య సేవలకు ప్రజల నుండి విశేషమైన స్పందన లభించడం చాలా సంతోషంగా ఉందని,పేద మధ్యతరగతి ప్రజలు ఉంటున్న బస్తీలలో బి కే ఆర్ ఫౌండేషన్ ఉచిత వైద్య సేవలు మరింత వేగవంతం చేస్తామని తెలియజేశారు.కంటి ఆపరేషన్ మోకాలు నొప్పి ఆపరేషన్ సర్జరీలు చేయించుకున్న వారితో మాట్లాడి ఆయన చేతుల మీదుగా మందులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి నవీన్ రెడ్డి,ఏఆర్ సాదు యాదవ్,ఆకుల ప్రేమ్ కుమార్, మాజీ సర్పంచ్ కావలి గణేష్,సాల్మన్ రాజ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 426 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 290 ద్విచక్ర వాహనదారులు, 18 ఆటోలు, 90 కార్లు, 09 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (08.12.2025%-%13.12.2025)లో మొత్తం 385 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 16 మందికి జరిమానా, జైలు శిక్ష, 21 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 348 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. విష్ణుపురి ఎక్సటెన్షన్ కాలనీ వాసులు మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వారు ఎదురుకుంటున్న సమస్యలను విన్నవించుకున్నారు. దోమల, క్రిమికీటకాల నివారణ కోసం బాక్స్ డ్రైన్ నిర్మించాలని కోరారు. అలాగే రోడ్స్ వేయాలని, త్రీ ఫేజ్ కరెంటు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, అంతేకాక పలు సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ కర్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్‌గౌడ్, కాలనీ అధ్యక్షులుశ్రీనివాస్ యాదవ్, సెక్రటరీ నాగరాజు, రామారావు, పప్పుశర్మ, లింగ మూర్తి, బి.టి.నాయక్, రాంచందర్, రవీందర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల సరిహద్దులపై చర్చ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఆనంద్ బాగ్ క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి డివిజన్‌ల విభజనకు సంబంధించి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి నియోజకవర్గం 9 డివిజన్ల నుండి 16 అయినా సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు తదితరులు పాల్గొని డివిజన్‌లో ఉన్న సరిహద్దుల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.ప్రేం కుమార్, జితేంద్రనాథ్, నియోజకవర్గం లక్ష్మీ కాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, గుండా నిరంజన్, సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, ఎస్ఆర్ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, వినోద్ యాదవ్, సయ్యద్ యూసుఫ్, జీవన్ రెడ్డి, సంతోష్ రాందాస్ ముదిరాజ్, సయ్యద్ మబ్బు, రాంచందర్, మోతె సాయి, కుట్టి శ్రీనివాస్, ఇందిరా ప్రియదర్శిని, ప్రభా, ఆశా, శారద, పీట్టల నాగరాజు, ఫరీద్, బాల్ రాజ్ యాదవ్, బ్రహ్మయ్య, శంకర్ రావు, ఇస్త్రారీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పునకు సంకేతం

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం, గ్రామీణ ఓటర్లు ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి ప్రతిబింబంగా నిలిచింది. ఈ ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఫలితాలపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని మహేష్‌గౌడ్ తెలిపారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు విస్తరించిన ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేయడం ఈ విజయానికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసిందని టీపీసీసీ చీఫ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమం-అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి పాలన ప్రజలకు నమ్మకాన్ని కలిగించిందని ఆయన అన్నారు. గ్రామస్థాయి సమస్యలను గుర్తించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిందని మహేష్‌గౌడ్ విశ్లేషించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని మరింత పెంచాయన్నారు. ప్రజలను నేరుగా కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పద్ధతి పార్టీ బలాన్ని పటిష్ఠం చేస్తోందని పేర్కొన్నారు. 'సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి' అనే నినాదానికి ప్రజలు పట్టం కట్టారని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం దీనికి స్పష్టమైన ప్రతీక అని మహేష్ గౌడ్ అన్నారు. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం గ్రామ పాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచిస్తోందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిఫలించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు అభివృద్ధి-సంక్షేమాన్ని కేంద్రంగా నిర్ణయాలు తీసుకుంటున్న తీరు, తెలంగాణలో నూతన రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతోందని టీపీసీసీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని, గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మహేష్‌గౌడ్ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల తొలి, రెండో విడత ఫలితాలు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ స్థాయిలో ఏర్పడిన అనుకూల వాతావరణానికి అద్దం పడుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన ధృవీకరించారు.

సమాచార శాఖతోనే అందెశ్రీ ప్రపంచానికి పరిచయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజాకవి అందెశ్రీని ప్రపంచానికి పరిచయం చేసింది సమాచార శాఖనే అని రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి, సామాచార, పౌర సంబంధాల శాఖ పూర్వ స్పెషల్ కమీషనర్ ఫణి కుమార్ వెల్లడించారు. సమాచార, పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల వార్షిక ఆత్మీయ సమ్మేళనం నేడు ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపుహాల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి, సమాచార శాఖ పూర్వ స్పెషల్ కమీషనర్ జీ.ఎన్. ఫణికుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, రిటైర్డ్ డైరెక్టర్లు కిస్మత్ కుమార్, సుభాష్ గౌడ్, సత్యా రావు, శ్రీనివాస్, ప్రమోద్ రావు , విశ్రాంత అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఫణి కుమార్ మాట్లాడుతూ, ప్రముఖ కవిగా ఉన్నప్పటికీ 2001లో అందెశ్రీని ప్రపంచానికి తన పాటలను రాయించడం ద్వారా పరిచయం చేసింది సమాచార శాఖనే అని అన్నారు. 2001లో జరిగిన మహిళా జన్మ భూమి కార్యక్రమానికి తమ శాఖాపరమైన ఆహ్వానంపై ఎన్నో ఉత్తేజకరమైన పాటలు రాసారని, ఆ పాటల్లో తెలంగాణా కువ్యతిరేకంగా గానీ, కించపరుస్తూ రాయనని అందెశ్రీ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార, పౌర సంబందాల శాఖ ఎంతో విశిష్టమైనదని, ఎంతటి క్లిష్టమైన మేఘా ఈవెంట్లను అతితక్కువ వ్యయంతో కష్టపడి, స్వచ్ఛందంగా పనిచేసి విజయవంతం చేసే అధికారులు, సిబ్బంది ఉండడం కేవలం ఈ శాఖలోనే సాధ్యం అని పేర్కొన్నారు. ఏ ఇతర శాఖలో ఉత్పన్నం వచ్చినా అది మనదే అని ఫీల్ అయ్యే శాఖ కేవలం సమాచార శాఖ అని, ముఖ్యమంత్రి తోపాటు ఇతర వీవీఐపిలతో నేరుగా ప్రత్యక్షంగా పనిచేసే శాఖ కేవలం ఇదేనని అన్నారు. ఇంటలిజెన్స్‌తో సమానంగా సమాచార శాఖ పనిచేస్తుందని, ప్రభుత్వానికి కళ్ళు, చెవుల మాదిరిగా ఉండే ఈ శాఖ కు ఎప్పుడూ ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టంచేశారు. అయితే, పీఆర్ఓ విధుల నిర్వర్తించడం ఆషామాషీ శాఖ కాదని. ఎంత చేసినా అద్భుతంగా చేసినారని ఎవరూ మెచ్చుకోరని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. లీగల్ అంశాలపై ప్రసంగం , యోగా, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక క్లాసులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటాం : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గం, లింగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పల మల్లయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందజేశారు. పార్టీ ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా యిచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేవలం సర్పంచ్, పంచాయతీ ఎన్నికలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతగా భయపడుతోందని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో అద్భుతాలు చేశామని, రుణమాఫీ, ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చామని కాంగ్రెస్ చెబుతున్న మాటలు నిజమే అయితే, ఎన్నికలంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన 420 హామీలు అమలు చేసి ఉంటే ప్రజలే బ్రహ్మరథం పట్టేవారని, కానీ వైఫల్యాల భయంతోనే కాంగ్రెస్ నేతలు దాడులకు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. 'పదేళ్లు మేము అధికారంలో ఉన్నాం.. ఏనాడూ మీలాగా ఆలోచించలేదు. మేము కూడా మీలాగే ఆలోచించి ఉంటే ఈరోజు కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ పరిస్థితి ఉండేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా దిక్కుమాలిన రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు కొనసాగితే, తాము కూడా తిరగబడక తప్పదని, అదే జరిగితే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పి, పరిస్థితి చేయి దాటిపోతుందని హెచ్చరించారు. తెలంగాణలో ఇలాంటి హింసాత్మక సంస్కృతి గతంలో లేదని, ఇది మంచి పద్ధతి కాదని విజ్ఞప్తి చేశారు.

మల్లయ్య కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం

మల్లయ్య చనిపోయిన వెంటనే రావాలనుకున్నా, ఉద్రిక్తతలు పెరగకూడదనే ఉద్దేశంతోనే ఆగానని కేటీఆర్ తెలిపారు. మల్లయ్య కుటుంబానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, రాగానే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదేనని కేటీఆర్ మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా, మొక్కవోని ధైర్యంతో పోరాడి పంచాయతీ ఎన్నికల్లో సుమారు 50 శాతం సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలను కైవసం చేసుకున్న గులాబీ సైనికులకు కేటీఆర్ శిరస్సు వంచి పాదాభివందనం చేశారు. ప్రజలంతా కేసీఆర్ పాలన కోసం, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్య, నేతలు భూపాల్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, నరసింహ రెడ్డి, గుజ్జ యుగంధర్ రావు, దయాకర్ రెడ్డి ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి : ఎంపీ ఆర్.కృష్ణయ్య

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు 42శాతంతోనే ఎన్నికలకు వెళ్లాలనీ లేనిపక్షంలో యుద్ధమే జరుగుతుందని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికలు సైతం త్వరలో జరుగనున్నాయని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా నేపథ్యంలో పార్టీ ప్రతికగానే జరుగుతాయనీ చట్టబద్ధమైన బీసీ రిజర్వేషన్లను 42 శాతంకి పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆదివారం14 సంఘాల సమావేశం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో డా.ర్యాగ అరుణ్ కుమార్, నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో 42 శాతంకు పెంచే వరకు వదిలిపెట్టి ఉండదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా 42 శాతం కు పెంచిన తర్వాతనే ఎన్నికలకు వెళతామని కొన్ని వందలసార్లు ప్రకటించి మోసం చేసి ఎన్నికలకు వెళ్లారనీ అన్నారు. 42 శాతం ప్రకటించి మరలా దానిని 22 శాతం తగ్గించి ఆచరణలో 17శాతం తగ్గించి అక్రమాలకు పాల్పడ్డారనీ ఆరోపించారు. ఇది చాల దుర్మార్గం అని ప్రభుత్వ ఎంత తగ్గించి అన్యాయం చేయాలనీ చూస్తుంటే బి.సి.లు తిరగబడి మొత్తం సీట్లులో 51శాతం సర్పంచ్ పదవులు బి.సి.లు స్వాదీనం చేస్తున్నారనీ తెలిపారూ.ఇప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉందనీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, డి-6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయన్నారు. మన రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్ర బంద్ జరపడం గర్వించ దగిందని అన్నారు. ఇది మన రాష్ట్రంలోని బీసీల చైతన్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికి ఢిల్లీకి 62 సార్లు వెళ్లారనీ ఒక్కసారి కూడా బీసీల గురించి ప్రధానమంత్రికి కలవలేదన్నారు. కనీసం అఖిలపక్షాన్ని కూడా ఢిల్లీకి తీసుకు వెళ్లలేదన్నారు.ఈ కార్యక్రమంలో భీం రాజ్, రాందేవ్ మోడీ, రాజ్ కుమార్, నరేష్ గౌడ్, రమేష్ యాదవ్, అంజి గౌడ్, నిఖిల్, అఖిల్, ఆశిష్ గౌడ్, సుప్రజా, మనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆరోగ్యం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్ నగరానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తోందని తెలిపారు. విద్య మరియు వైద్యం ఈ రెండు నాణ్యమైనవి ప్రజలందరికీ అందాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. గత పాలనలో నిర్లక్ష్యం పాలైన ప్రజా సంక్షేమాన్ని తిరిగి పునరుద్ధరించి, ప్రతి పేదవాడికి భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకువచ్చి మహబూబ్ నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు జాజిమొగ్గ నర్సింహులు, షేక్ ఉమర్, నాయకులు దేవేందర్ నాయక్, శేఖర్, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పరిశీలన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్‌లో కొనసాగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీవాసులు ఎదుర్కొం టున్న డ్రైనేజ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతాయని, ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాలనీవాసులు డ్రైనేజ్ పనులు ప్రారంభించినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, తులసి సురేష్, చిన్నం శ్రీనివాస్, శివ గౌడ్, బాలకృష్ణ, సర్వేశ్ యాదవ్, హేమంత్ పటేల్, సంపత్ యాదవ్, పేపర్ శీను తదితర బిఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సిఫిల్ కాలనీ కళ్యాణ్ నగర్ మెయిన్‌రోడ్ సుమారు రూ.60 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, ఓం రాజ్, జయ కృష్ణ, కిరణ్ కుమార్, చంద్రకళ, శేషగిరి, సుదర్శన్, పెద్దిరాజు, చంద్రకాంత్, జగన్మోహన్, హరిప్రసాద్, శర్మ, సత్యమూర్తి, సత్యనారాయణ, సంపత్ రావు, బ్రహ్మయ్య, రామా కృష్ణ, శంకర్ రావు, మొసిన్, రత్న భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్ : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ విడత పోలింగ్‌ను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం రంగారెడ్డి జిల్లాలో రెండవ విడుతలో 7 మండలాలో ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, ముడిమ్యాల, పాత్ గల్, షాబాద్, సర్దార్ నగర్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఓటర్ జాబితా ప్రకారం ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా విధులు నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు సర్పంచి, వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒంటి గంట తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవ్వరిని అనుమతించకూడదనీ, మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను ఆదేశించారు. ముందు వార్డు సభ్యులకు సంబంధించిన ఓట్లు లెక్కించిన తదుపరి సర్పంచ్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని అన్నారు.కలెక్టర్ వెంట చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతం, తదితరులు ఉన్నారు.

లేబర్ గుర్తింపు కార్డుల పంపిణీ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లేబర్ కార్డుల పంపిణీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేపట్టారు. అర్హత కలిగిన కార్మికులకు స్వయంగా లేబర్ గుర్తింపు కార్డులను అందజేశారు. మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు బంగారు మల్లేష్ ఆధ్వర్యంలో లేబర్ నమోదు ప్రక్రియ చేపట్టారు. దరఖాస్తుదారులపై సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం అర్హత కలిగిన లేబర్లను గుర్తించి వారికి లేబర్ కార్డులు పంపిణీ చేశారు. కార్మికుల సంక్షేమానికి లేబర్ కార్డులు ఎంతో ఉపయోగకరమని, వీటివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా కార్మికులకు అందుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం తన వంతు కృషి కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు హేమంత్ పటేల్, గోపాల్, చిందం శ్రీనివాస్, శివ గౌడ్, సుమన్ గౌడ్ తదితర పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే కాలనీ అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ఐకమత్యంతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,లీడర్ కొలన్ నరసింహారెడ్డి,మేకల వెంకటేష్,కొలన్ జనార్దన్ రెడ్డి, కుమార్ యాదవ్, ఆవుల సురేష్ యాదవ్,కాలనీ ప్రజల సమక్షంలో బండారి లేఅవుట్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎడ్లపల్లి వాసు,11 మంది అతని జనరల్ బాడీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నిజాంపేట్ గ్రామ పెద్దలు నూతన అసోసియేషన్ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేసి వారికి తగు సలహాలు సూచనలు అందించారు.అనంతరం కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి,నిజాంపేట్ గ్రామ పెద్దలందరి సహాయ సహకారాలు ఉంటాయని,అందరు కలిసికట్టుగా ఒకరికొకరు తోడుగా ఎటువంటి భేదాలు లేకుండా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజ

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం, జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసుఫ్గూడా డివిజన్, వెంకటగిరిలో శ్రీఅయ్యప్ప స్వామి, మహా మండల పూజా కార్యక్రమంని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, హోమం కార్యక్రమం, మధ్యాహ్నం మండల పూజా, ఆ తర్వాత భక్తులకు అన్న ప్రసాదం చేశారు. సాయంత్రం స్వామివారికి నైవిద్యం, అల్పాహారం తర్వాత అయ్యప్ప స్వామి పల్లకి సేవలో మహిళలు, అయ్యప్పస్వాములు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పల్లకి సేవ లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి తాంబూలంలో దీపం ప్రజ్వలించి స్వామి సేవలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం తో మండల పూజ కార్యక్రమం ముగిసింది. ఈ మండల కార్యక్రమం దేవాలయం కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: బీరప్ప స్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని కురుమ సంఘం నూతన అధ్యక్షులు నార్లకంటి బాలయ్య పేర్కొన్నారు.ఆదివారం కుత్బుల్లాపూర్ గ్రామం కురుమ సంఘం అధ్యక్షుల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కురుమ సంఘం పెద్దలు, కులస్తులు బీరప్ప దేవాలయం నందు సమావేశం నిర్వహించారు.అనంతరం నూతన అధ్యక్షులుగా నార్లకంటి బాలయ్యని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నార్లకంటి బాలయ్య మాట్లాడుతూ వారిపై నమ్మకంతో పదవి కట్టపెట్టడం సంతోషంగా ఉందని, కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు.అదే విధంగా అందరిని కలుపుకొని కురుమ సంఘం,బీరప్ప దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం కులస్తులు,బీరప్ప ఆలయ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

వీజీఆర్ యూత్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కేశవ నగర్ బస్తీలో కేశవనగర్ డెవలప్మెంట్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీజీఆర్ యూత్ అసోసియేషన్ లోగోను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలలో కేశవనగర్ బస్తీలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ పైప్‌లైన్‌లు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను విస్తృతంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తాను కార్పొరేటర్‌గా బాధ్యతలు స్వీకరించే ముందు ఈ ప్రాంతంలో సరైన రహదారులు, మురుగు కాలువలు, మంచినీటి వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. నిరంతర కృషితో నేడు దాదాపు 95 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరలోనే పూర్తిగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. యువత సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని, వీజీఆర్ యూత్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలు, యువత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కేశవనగర్‌ను ఆదర్శ బస్తీగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ ఉపాధ్యక్షులు తిరుపతి సీనియర్ నాయకులు శ్రీరాములు, ఈశ్వర్, బిక్షపతి, హనుమంతు, రాజేందర్, కిషన్ గోలి,రాజు, శ్రీను, యాదయ్య, గోవింద్, శ్రీశైలం,రామకృష్ణ ,కేశవ నగర్ అధ్యక్షులు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నరసింహ, యాదయ్య,ప్రధాన కార్యదర్శులు శివ, నాగరాజు,కుమార్, జాయింట్ సెక్రటరీ గణేష్, వీరేశ్, వెంకటేష్, వంశీధర్,ట్రెజరర్ కర్ణ, హరిబాబు, దేవరాజ్, హనుమంతు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నవీన్, నరసింహ, పవన్, కురుమంతు, నవీన్, శివ, కార్తీక్, తరుణ్, కిట్టు, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూతురికి ఓటు వేసి తండ్రి మృతి

విశాలాంధ్ర - మొయినాబాద్: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలోని 14వ వార్డులో ఓటు వేసి బయటకు వచ్చిన వృద్ధుడు సోలిపేట బుచ్చయ్య (70) కుప్పకూలి పడిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆలూరు అనుబంధ గ్రామమైన వెంకన్నగూడ 14వ వార్డులో అతని కూతురు రాములమ్మ వార్డు సభ్యురాలుగా పోటీలో ఉంది. ఓటేసేందుకు వచ్చి బుచ్చయ్య మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

గ్రామాల వారిగా గెలిచిన సర్పంచులు

విశాలాంధ్ర - మొయినాబాద్: రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొయినాబాద్ మండలంలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని మండల అధికారిని సంధ్య వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.

19 గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు

నక్కలపల్లి సర్పంచ్ యాదయ్య, ఎత్ బార్ పల్లి సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, తోల్కట్ట రజిత, అప్పారెడ్డిగూడ పద్మ అశోక్, కేతిరెడ్డిపల్లి గొడుగు యాదయ్య, కనకమామిడి దివ్య, శ్రీరామ్ నగర్ ఏర్పుల గీత మహిపాల్, అమ్డాపూర్ మధ్యపాగ కృష్ణ, ఖాసింబౌలి రాజేందర్ రెడ్డి, బాకారం ఎల్గని వెంకటేష్ గౌడ్, నాగిరెడ్డి గూడ కీసర పద్మ సంజీవరెడ్డి, చందానగర్ మురళి కృష్ణ, రెడ్డిపల్లి షాపురం రాజు, మోత్కుపల్లి సంపూర్ణ రాములు, చిన్న మంగళారం లక్ష్మి, మేడిపల్లి శ్రీనివాస్, ఎల్కగూడ ప్రవీణ , కుత్బుద్దీన్ గూడ మహమ్మద్ పాషా, వెంకటాపూర్ అర్చన అజయ్ రెడ్డి లు గెలుపొందారు.

నల్లవల్లి గ్రామానికి వెయ్యేళ్ల చరిత్ర

- చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవాలి
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాద్ : మెదక్ జిల్లా, జన్నారం మండలం, నాగవల్లికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. గ్రామానికి చెందిన రాయారావు వి.రామారావు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం గ్రామ పరిసరాల్లో జరిపిన అన్వేషణలో బీరన్న గుడి వద్ద రాష్ట్ర కూటుల కాలపు (సా.శ. 10వ శతాబ్ది) నాటి నాలుగడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పు గల రాతిపై నిలబడి, నాలుగు చేతుల్లో డమరుకం, శూలం, ఖడ్గం, కపాల పాత్ర, తలపై విరి జడలను, వంటిపై కపాలమాలను ధరించిన భైరవ శిల్పం చారిత్రక ప్రాధాన్యత గలదని ఆయన అన్నారు. గ్రామం గ్రామంలోని 18వ శతాబ్దిలో రాయారావు దేశ్ ముకులు నిర్మించిన కోట (గడి), సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం, దాని ముందు కోనేరు (దిగుడుబావి) శిథిలావస్థలో ఉన్నాయని, చారిత్రక ప్రాధాన్యత గల ఈ వారసత్వ కట్టడాలను కాపాడుకోవాలి నల్లవల్లి గ్రామస్తులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

వైద్యులకు నైపుణ్య అవగాహన అవసరం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రాణాపాయ స్థితిలో శ్వాస పెంచి ప్రాణాలను కాపాడే అవగాహన, నైపుణ్యం,పరిరాల వినియోగం మీద వైద్యులకు శిక్షణ ఎంతో అవసరమని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.చేవెళ్ల లోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్, వైద్య కళాశాలలో, ఇండియన్ నేషనల్ క్రిటికల్ కేర్ సొసైటీ(ఐఎస్ సీసీఎం) ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకు "శ్వాస్" అవగాహన, శిక్షణ కార్యక్రమాలు అయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రకృతి విపత్తులు, విధ్వంసం, రోడ్డు ప్రమాదాలు లాంటి పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలను కాపాడే సమయంలో, పరిస్థితిలో శ్వాస పెంచుతూ ఎయిర్ వే నిర్వాహణ, తీసుకోవలసిన జాగ్రత్తల మీద ప్రతి వైద్యుడికి అవగాహన ఎంతో అవసరమని చెప్పారు. ముఖ్యంగా వెంటిలేషన్ ఏర్పాటు ప్రక్రియ మీద సమయస్ఫూర్తిని ప్రదర్శించి పరికరాలను సరైన విధంగా ఉపయోగించే నైపుణ్యం ప్రతి వైద్యులు నిరంతరం శిక్షకులుగా అవగాహన పెంచుకోవాలన్నారు. అనస్తీసియా, ఈఎన్టీ, చెస్ట్ ఫిజీషియన్, బ్యాగ్ మాస్క్ వెంటిలేషన్, పిల్లల వైద్యులు, ఇండో టేకియల్ ఇన్నిట్యూబేషన్, ట్రీకియాస్టమ్ ఇలా అన్ని రకాల పరికరాలను వాడే అంశాలు తెలిసి ఉండాలి అన్నారు. ప్రాణాలను కాపాడటం డాక్టర్ ప్రథమ కర్తవ్యం గా ఉండాలని ఇది మానవాళికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం, మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దీనికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని అన్నారు.ఇండియన్ నేషనల్ క్రిటికల్ కేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గణేశ్యాంలు మాట్లాడుతూ... శ్వాస కార్యక్రమం ద్వారా వైద్యులకు ప్రాణాలను కాపాడే అత్యవసర పరిస్థితులకు అవసరమైన బోధన, శిక్షణ , సిమిలేషన్ బేస్డ్ ఆధారిత అనుకరణ విషయాలు తెలిసి వస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చందన రెడ్డి(స్టార్ ఆస్పత్రి), శివకుమార్ రెడ్డి(ఏఐజీ ఆస్పత్రి), బాలసుబ్రమణ్యం, డాక్టర్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ జోయా రాణి, సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి , సీతారాం రెడ్డి, మాణిక్య రెడ్డి, అనీల్,వివిధ కళాశాలల వైద్యులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ పదవీ విరమణ ఉద్యోగుల సమ్మేళనం

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ)లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ, అనేక సంవత్సరాల విరామం అనంతరం పరస్పర స్నేహ సంబంధాలు పంచుకునే అవకాశాన్ని హెచ్ఎండిఏ కల్పించిది. సికింద్రాబాద్ పోలీస్ లైన్స్‌లోని పైగా ప్యాలెస్‌లోని పాత కార్యాలయంలో ఘనంగా సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సహా ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అవసరమైన లాజిస్టిక్ సహకారాన్ని హెచ్ఎండిఏ అందించింది. హెచ్ఎండిఏలో సుమారు 423 మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఉండగా, వారిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కమిటీ, అద్భుతమైన సహకారం అందించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసింది. మునుపటి హెచ్ఎండిఏను హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడ)గా పిలిచేవారు. ఇది 2 అక్టోబర్ 1975న స్థాపించబడింది. మూడు దశాబ్దాలకు పైగా సికింద్రాబాద్ పోలీస్ లైన్స్‌లోని పైగా ప్యాలెస్‌లో ప్రధాన కార్యాలయంగా పని చేసింది. అనంతరం తార్నాక కాంప్లెక్స్, హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉన్న స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లకు కార్యాలయాన్ని మార్చింది. ఈ విధంగా హైదరాబాద్ పట్టణ ప్రాంతానికి సంబంధించిన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్థాపనకు 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. హెచ్ఎండిఏ ఏర్పాటుతో దాని పరిధి మరింత విస్తరించింది. ప్రస్తుతం పైగా ప్యాలెస్ ఖాళీగా ఉండటంతో, ఈ సమ్మేళన కార్యక్రమం తాము పని చేసిన ప్రదేశం జరగడంతో అనేక మంది పదవీ విరమణ చేసిన ఉద్యోగులు భావోద్వేగాని లోనవడంతో పాటు పలువురితో పాత జ్ఞాపకాలతో ఆనందాన్ని పంచుకున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఆడహాక్ కమిటీ కన్వీనర్ పిల్లి రామచందర్, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం మల్కాజిగిరి నేరేడుమెట్ ఎస్.ఎస్ గార్డెన్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడవ మహాసభ జరిగింది. ఈ సభకు టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనే ధ్యేయంగా ఏర్పడిన టీడబ్ల్యూజేఎఫ్ ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదనీ స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం తేవాలని కోరారు. జర్నలిస్టుల పట్ల వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో కూడిన నిబద్ధతతో పనిచేసే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అన్నారు. సంఘంగా గుర్తింపు పొంది సమస్యల పట్ల పోరాటం చేస్తూ, జర్నలిస్టుల పక్షాన పోరాడే సంఘంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలను ఖండించారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి సలీమ మాట్లాడారు. గత కార్యక్రమాల నివేదికను గుమ్మడి హరిప్రసాద్ ప్రవేశపెట్టారు. జిల్లా కో కన్వీనర్ పి.మల్లేష్ జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బానోతు రవి, పి మోహన్ రెడ్డి, కొండ స్వామి, జి.రోజా రాణి తదితరులు చర్చలలో పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యవర్గం...

టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా పి.మల్లేష్, ఉపాధ్యక్షులుగా జి.రోజా రాణి, ఎం.రాం బాబు, నరేంద్ర, కార్యదర్శిగా బానోతు రవి, సహాయ కార్యదర్శులుగా ఐ.సత్యనారాయణ, సింగం రాజు, జె.సుధాకర్, కోశాధికారిగా మధు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా దుర్గాప్రసాద్, గుంటి సహదేవ్, పాండు, హుస్సేన్, రజనీకాంత్, మహేందర్, పి.నరసింహ, అరుణ్ కుమార్, ఏ. విష్ణు, సిహెచ్ నరసింహ, బాలకృష్ణ, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ రెడ్డి, పి.కిరణ్, బి.చైతన్య రెడ్డి ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా వినోద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గుమ్మడి హరిప్రసాద్, బాలు, ఎస్.రాజేంద్ర ఎన్నికయ్యారు.

వేతన బకాయి చెల్లించాలి : మంచాల

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : ఎస్బిఐ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కు బకాయి వేతనాలు చెల్లించాలని ఆల్ ఇండియా ఎస్బిఐ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంచాల రాజయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1987లో మేనేజ్‌మెంట్, యూనియన్ కలిసి ఒప్పందం ప్రకారం ఎస్బిఐ బ్యాంకు ఉద్యోగంలో చేర్చుకున్నారు. తరువాత 31మార్చిలో 1997లో ఎలాంటి ఇంటిమేషన్ లేకుండా ఉద్యోగస్తులను తొలగించారాని, కానీ చట్టం ప్రకారం రెండు నెలల ముందుగా నోటీసుల ఇవ్వాలన్నారు. చెప్పకుండా తొలగించడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన వయసు వచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరుకు ఎలాంటి స్పందన లేదనీ, కోర్టుకు వెళ్లిన కూడా తీర్పులు తమ వైపే ఉన్నాయన్నారు. ఎస్బిఐ మేనేజ్మెంట్ తక్షణమే చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని ఎస్బిఐ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంచాల రాజయ్య కోరారు. కార్యక్రమంలో ఎం.లివి, సాయి, కవి, కరుణాకర్, నారాయణ, దస్తయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా ముగిశాయి. జిల్లాలోని చేవెళ్ల, మొయినాబాద్, శంకర్ పల్లి, షాబాద్, కడ్తాల్ మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పోలింగ్ శాతం గణనీయంగా నమోదైంది. జనగామ జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా నమోదైంది. మొత్తం చేవెళ్ల నియోజకవర్గంలో 83.37 శాతం పోలింగ్ నమోదు అయింది.జిల్లా వ్యాప్తంగా సగటు పోలింగ్ శాతం 85 శాతంగా నమోదైంది. ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి .నారాయణ రెడ్డి పర్యవేక్షించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఓట్ చోరీపై కాంగ్రెస్ ధర్నా రాస్తారోకో

విశాలాంధ్ర, పటాన్ చెరువు : బీజేపీ ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్య పరిచేందుకు కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తుందని జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి స్పష్టం చేశారు ఆదివారం ఆందోళనలో భాగంగా పటాన్ చెరువు పట్టణంలో మోడీ దిష్టిబొమ్మ దహనం నిరసన ధర్నా సంగారెడ్డి జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షులు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. జాతీయ స్థాయిలో పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి మద్దతుగా పటాన్ చేరు పట్టణ జాతీయ రహదారి పైన బీజేపీ ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. గత సంవత్సరం పార్లమెంట్ ఎన్నికల్లో మహారాష్ట్ర, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, భాగస్వామ్య పార్టీలు ఓడిపోతయని అనేక సర్వేలు చెప్పినప్పటికీ ఎన్నికల కమిషన్ పై వత్తిడి తెచ్చి ఈవీఎం లను పూర్తిగా అక్రమ పద్ధతిలో మార్పులు చేస్తూ ఓట్ చోరికి మోదీ బీజేపీ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. బీహార్ ఎన్నికల్లో పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య రెండు లక్షల ఓట్ల తేడా ఉందన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు డిపాజిట్ రాకున్నా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందడం ఓట్ చోరీ లో భాగమే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతున్నదని, ప్రజల మద్దతు కూడాగట్టి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. దేశంలోని ఆయా రాష్ట్రాలలో ఓట్ చోరీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను హరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ కార్యకర్తలు గట్టిగా బుద్ధి చెప్పేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతీన్, రాష్ట భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు గంగాధర్ రవి గౌడ్, నాయకులు సురేష్, సుధాకర్, యువరాజ్, రవి ముదిరాజ్, సతీష్ అక్షిత్ మహిళా నాయకురాలు జ్యోతి సుగుణ లక్ష్మీ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సీఆర్ ఫౌండేషన్) ఆధ్వర్యములో నడుస్తున్న సీఆర్ పాలిక్లినిక్, రోటరీ ప్రాలిఫిక్స్ డయాగ్నస్టిక్ సెంటర్ ఈరోజు బస్తీ దవాఖాన ప్రేమనగర్ న్యూ హఫీజ్ పెట్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరములో సీ ఆర్ పాలిక్లినిక్ జనరల్ మరియు స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డా. కె. రజని , డా. అరుణ , డా. కేజియా, దంత వైద్యులు డా. అజయ్, డా. ప్రశాంతి, ఫిజియోథెరపీ వైద్యులు డా. అనిల్ చంద్, ఎంఎఎ హాస్పిటల్ నుంచి చెవి ముక్కు గొంతు వైద్యులు డా. ముదిత్, కిమ్స్ హస్పిటల్ నుంచి పిల్లల వైద్యులు డా. యుక్త వర్మ, త్రిష, శుభ్ర, సీనియర్ హోమియోపతి డా. సి హెచ్. ప్రభావతి, జేఎస్పీఎస్ గవర్మెంట్ హోమోయోతి కాలేజ్ డాక్టర్లు సంయుక్త , స్నేహిత, సింధూజ, విశాల్ తమ సేవలు అందించారు. సీఆర్ పాలిక్లినిక్ రోటరీ ప్రాలిఫిక్స్ డైగ్నోస్టిక్ సెంటర్ టెక్నికల్ పార్టనర్ కనెక్ట్ డైగ్నోసిస్ వారు ఉచిత రక్త పరీక్షలు , హీలియోస్ లంగ్ సెంటర్ వారు పిఎఫ్టీ పరీక్షలు, ఎల్ వి ప్రసాద్ నేత్రాలయం డా. రమ్య , డా. రాజేశ్వరిత్, డా. శిల్ప నేత్ర చికిత్సలు నిర్వహించారు. ఈ శిబిరం ఏర్పాటులో హైదరాబాద్ మ్యావరిక్స్ రోటరీ క్లబ్ సభ్యులు గోగినేని శేఖర్, డి. లక్ష్మినారాయణ, వాసిరెడ్డి నాగేశ్వర రావు, కె అజయ్ కుమార్ , డి. అనిత ఇతరులు తోడ్పాటు అందించారు. 250 కి పైగా ప్రేమనగర్ వాసులు ఈ ఉచిత వైద్య శిబిర సేవలు సినియోగించుకున్నారు. వైద్య శిబిరం విజయవంతం కావటానికి సహకరించిన సిఆర్ పాలిక్లినిక్, రోటరీ ప్రోలిఫిక్స్ డైగ్నోస్టిక్ సెంటర్, సిఆర్ ఫౌండేషన్ సిబ్బందిని, వాలంటీర్లను సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డా. రజని , కార్యనిర్వహణాధికారి కె విజయ లక్ష్మి ,ఎన్ ఆర్ ఆర్ పరిశోధన కేంద్రం కమిటీ సభ్యులు డి. శ్రీనివాస రావు , సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కె. అజయ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో సీఆర్ పాలిక్లినిక్ పరిసరాలలోని ప్రాంతాలలో ప్రతి నెల ఒక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, అలాగే ప్రతి రెండవ శనివారం సిఆర్ పాలిక్లినిక్, రోటరీ ప్రోలిఫిక్స్ డైగ్నోస్టిక్ సెంటర్ లో ఉచిత కన్సల్టేషన్స్ ఇవ్వబడుతుందని, అందరికీ అందుబాటులో విశ్వసనీయ వైద్య సేవలు అందిచటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు డైరెక్టర్ డా. రజని పేర్కొన్నారు.

కల్చరల్ సెంటర్ భవనం ప్రారంభం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సెంట్రల్ పార్క్ ఫేస్1 కాలనీలో కల్చరల్ సెంటర్ భవనంను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సెంట్రల్ పార్క్ ఫేస్ 1 కాలనీలో కల్చరల్ సెంటర్ భవనం ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో తీర్చిద్దిదడం జరిగినదని, నేటితో కాలనీ వాసులకు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ఈ కల్చరల్ సెంటర్ లో చిన్న చిన్న సమావేశాలు, సభలు, ఫంక్షన్‌లు నిర్వహించుకునేందుకు వీలుగా కల్చరల్ సెంటర్‌ను నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. సెంట్రల్ పార్క్ ఫేస్- 1 కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని ,మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తానని, అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలియచేశారు. శేరిలింగంపల్లి డివిజన్ మరియు నియోజకవర్గఅభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తానని తెలియచేశారు. సమాజంలో పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లు, యాంత్రిక జీవనానికి పరిష్కారం చూపించేవి ఇలాంటి కల్చరల్ సెంటర్స్ అంటూ అభిప్రాయపడ్డారు. ఇంతటి అద్భుతమైన కల్చరల్ సెంటర్ భవనాన్ని నిర్మించుకోవడం చాలా సంతోషం కలిగిస్తోందని, కాలక్షేపం, పుస్తకం పఠనం, వార్త పత్రికలు చదువుకోవడానికి ఉపయోగపడుతుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సెంట్రల్ పార్క్ ఫేస్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ కృష్ణ, జనరల్ సెక్రటరీ వీ ధనుంజయ, వైస్ ప్రెసిడెంట్ హరికృష్ణ, ట్రెజరర్ సంతోష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మురళీధర్ డీఎల్ఎస్ఎన్ ప్రసాద్ రావు, టీ చంద్రశేఖర్, సతీష్ కుమార్, శ్రీధర్ రెడ్డి మరియు మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, మల్లేష్, పవన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హోమియో క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : భారతదేశంలో అధికారికంగా గుర్తింపు పొందిన వైద్య విధానంగా హోమియోపతి రెండు శతాబ్దాలకు పైగా కాలంగా అమలులో ఉంది. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందిస్తూ శరీరంలోని సహజ స్వస్థత శక్తిని ఉత్తేజింపజేయడమే ఈ విధానానికి మౌలిక సూత్రం. లక్షణాలకే పరిమితం కాకుండా రోగిని సంపూర్ణంగా పరిగణలోకి తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక, క్రియాత్మక, జీవనశైలి సంబంధిత వ్యాధుల నియంత్రణలో హోమియోపతికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కొత్తగా ప్రారంభించిన ఈ క్లినిక్‌లో శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధిత రుగ్మతలు, మహిళలు, పిల్లల ఆరోగ్యం, ఒత్తిడి కారణమైన సమస్యలు, అలెర్జీలు, రోగనిరోధక శక్తి పెంపుదల వంటి అనేక ఆరోగ్య సమస్యలకు క్రమబద్ధమైన హోమియోపతి చికిత్సలు అందించనున్నారు. ప్రతి రోగికి విస్తృతమైన కేస్ టేకింగ్ అనంతరం వారి శారీరక, భావోద్వేగ, శరీర స్వభావానికి అనుగుణంగా వ్యక్తిగత చికిత్స అందించనున్నారు. వీరికి హైదరాబాద్ 4, గోవా లో 2 క్లినిక్ అందుబాటులో ఉన్నదం, ఇంకా పురాతన విధనమైన చికిత్స కాకుండా నూతన విధానము అందించడం ప్రత్యేకం. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, గోవా తొలి లోకాయుక్త గౌరవనీయ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి, అలాగే తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం, స్పీడ్ యువజన-క్రీడల విభాగాల సీఈఓ జయేష్ రంజన్, ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లినిక్ యాజమాన్యం మాట్లాడుతూ, సంప్రదాయ హోమియోపతి సూత్రాలను ఆధునిక క్లినికల్ మూల్యాంకనం, నైతిక వైద్య పద్ధతులు, రోగి అవగాహనతో సమన్వయం చేస్తూ ఈ క్లినిక్‌ను రూపొందించామని పేర్కొన్నారు. భద్రమైన, శస్త్రచికిత్సల అవసరం లేని చికిత్సలతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్యం, వ్యాధి నివారణ మరియు జీవన నాణ్యత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రముఖ వైద్య కేంద్రంగా పేరొందిన బంజారా హిల్స్‌లో ఉన్న ఈ క్లినిక్ నగరం అంతటినుంచి మరియు పరిసర జిల్లాల నుంచి వచ్చే రోగులకు సేవలందించనుంది. నాణ్యమైన వైద్య సంప్రదింపులు, చికిత్సలో పారదర్శకత మరియు నిరంతర సంరక్షణ విషయంలో ఏ ఐ ఎస్ క్లినిక్ తన కట్టుబాటును మరోసారి స్పష్టం చేసింది.



స్థానిక సంస్థల్లో 'సర్పంచ్ పతి'!

న్యూఢిల్లీ: స్థానిక సంస్థల్లో 'పరోక్ష పాలన' లేదా 'సర్పంచ్ పతి' పద్ధతికి వ్యతిరేకంగా జాతీయ మానవ హక్కుల సంస్థ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రమైన చర్యలు తీసుకుంది. 32 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు చర్య తీసుకున్న నివేదికలను సమర్పించడంలో విఫలమైన తర్వాత కమిషన్ ఈ రాష్ట్రాల ఉన్నతాధికారులకు షరతులతో కూడిన సమన్లు జారీ చేసింది. పంచాయతీ రాజ్ సంస్థలు (పీఆర్‌జేలు), పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీలు) ముఖ్యంగా మహిళలకు రిజర్వు చేయబడిన నియోజకవర్గాలలో 'పరోక్ష పాలన' కొనసాగుతున్న విస్తృతంగా జరుగుతున్న పద్ధతిని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా పరిగణించింది. హర్యానా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు సుశీల్ వర్మ దాఖలు చేసిన ఫిర్యాదును అనుసరించి, డిసెంబరు 12న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని కమిషన్ బెంచ్ దీనిని పరిశీలించిందని అధికారిక ప్రకటన తెలిపింది.

'సర్పంచ్ పతి' పద్ధతి రాజ్యాంగ విరుద్ధం

ఫిర్యాదును పరిశీలించిన తర్వాత రాజ్యాంగ రక్షణలు, న్యాయపరమైన ప్రకటనలు ఉన్నప్పటికీ, ఎన్నికయిన మహిళా ప్రతినిధులు తరచుగా నామమాత్రపు అధిపతులకు తగ్గించబడతారని, వాస్తవ పరిపాలన, నిర్ణయం తీసుకునే అధికారాలను వారి భర్తలు లేదా పురుష బంధువులు ఉపయోగిస్తారని కమిషన్ గమనించింది. ఆ పద్ధతిని సాధారణంగా 'సర్పంచ్ పతి' లేదా 'ప్రధాన పతి' అని పిలుస్తారు. ఎన్నికయిన మహిళా ప్రతినిధుల బంధువులను అనుసంధాన వ్యక్తులుగా లేదా ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతినిధులుగా అనధికారికంగా నియమించడం, రాజ్యాంగబద్ధంగా ఆదేశించబడిన స్థానిక స్వపరిపాలన సంస్థల పనితీరులో అనవసర జోక్యానికి దారితీస్తుందని కూడా ఈ ఫిర్యాదు ప్రత్యేకంగా ప్రస్తావించింది. సుప్రీం కోర్టు... రిట్ పిటిషన్ (సివిల్) నంబర్ : 615/2023 లో ఈ రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన పద్ధతిని తీవ్రంగా ఖండించిందని కమిషన్ పేర్కొంది. ఇటువంటి పరోక్ష ప్రాతినిధ్యం 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తిని, అలాగే ఆర్టికల్ 243డి కింద మహిళా రిజర్వేషన్ లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(3), 21 కింద హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని తెలిపింది. ఈ చర్యలు భారతీయ న్యాయ సంహిత-2023 ప్రకారం నేరపూరిత దుష్ప్రవర్తనకు దారితీయవచ్చని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల వలె నటించడం, నేరపూరిత విశ్వాస ఉల్లంఘన, ప్రజా విధులను చట్టవిరుద్ధంగా చేపట్టడం వంటి నేరాలు కూడా ఉన్నాయి.

ఆ పద్ధతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ కఠిన చర్యలు

రాష్ట్రాలు/యూటీల అధికారులకు సమన్లు

నిబంధనల ఉల్లంఘన... షరతులతో కూడిన సమన్లు జారీ

9.09.2025 నాటి విచారణల ప్రకారం, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కనూంగో అధ్యక్షతన గల కమిషన్ బెంచ్, మానవ హక్కుల పరిరక్షణ చట్టం-1993లోని సెక్షన్ 12 కింద ఈ విషయాన్ని ఇప్పటికే సుమోటోగా స్వీకరించి, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కార్యాచరణ నివేదికలను (ఏటీఆర్‌లు) సమర్పించాలని ఆదేశించింది. అయితే ఆంధ్ర ప్రదేశ్, బీహార్, ఒడిశా, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల నుంచి అలాగే ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని నగరాల నుంచి మాత్రమే స్పందనలు అందాయని, 32 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించడంలో విఫలమయ్యాయని ఆ ప్రకటన పేర్కొంది. ఈ సమస్య తీవ్రత, నిరంతర నిబంధనల ఉల్లంఘన దృష్ట్యా, కమిషన్ ఇప్పుడు 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పంచాయతీ రాజ్, పట్టణ స్థానిక సంస్థల విభాగాల ప్రధాన కార్యదర్శులకు మానవ హక్కుల పరిరక్షణ చట్టం-1993 లోని సెక్షన్ 13 కింద షరతులతో కూడిన సమన్లు జారీ చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో సంబంధిత అధికారులను డిసెంబరు 30వ తేదీ ఉదయం 11:00 గంటలకు వివరణాత్మక కార్యాచరణ నివేదికలతో పాటు కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించారు. అయితే చట్టబద్ధమైన కారణం లేకుండా ఆదేశాలను పాటించడంలో విఫలమయితే... వారెంట్ల జారీతో సహా సివిల్ ప్రొసీజర్ కోడ్-1908 లోని ఆర్డర్ 16 నిబంధనలు, 10, 12 కింద చర్యలు తీసుకోబడతాయి. మహిళా రిజర్వేషన్ అనేది కేవలం ప్రతీకాత్మక ప్రాతినిధ్యం కోసం కాకుండా, నిజమైన సాధికారత, గౌరవం, నాయకత్వాన్ని నిర్ధారించడానికి ఉద్దేశించబడిందని, ఏ రూపంలోనైనా పరోక్ష పాలన ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలనకు చెందిన మూలాలనే దెబ్బతీస్తుందని కమిషన్ పునరుద్ఘాటించింది. ఎన్నికయిన మహిళా ప్రతినిధుల స్థానంలో భర్తలు లేదా ఇతర బంధువులు పాలన చేసినప్పుడు అది మహిళల గౌరవం, సమానత్వం, స్వయం నిర్ణయాధికార హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కనూంగో ప్రకటన పేర్కొంది. ఈ కారణంగానే కమిషన్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి జవాబుదారీతనం నిర్ధారించడానికి కఠినమైన విధానాన్ని అవలంబించింది. ఈ చర్య ఏదైనా నిర్దిష్ట రాష్ట్రం లేదా ప్రాంతానికి పరిమితం కాదని, దేశ వ్యాప్తంగా మహిళా సాధికారతను బలోపేతం చేయడానికి, ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయత, సమగ్రతను బలోపేతం చేయడానికి అవసరమైన అడుగని తెలిపింది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టీసీలో కలపాలి

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టీసీలో కలపాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా ఏఐటీయూసీ భవనంలో ఏపీఎస్ ఆర్టీసీ (పీటీడీ) ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. తిరుపతి జిల్లాలో ఆర్టీసీ అన్ని విభాగాల కార్మికులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వివరించారు. ప్రధానంగా ఆర్టీసీలో కాంట్రాక్టు వ్యవస్థ వలన రోజు రోజుకు కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్మిక శాఖ నిర్ణయించిన జీతాలు రాష్ట్రం మొత్తం మీద ఏ జిల్లాలో ఏ కార్మికుడు అందుకునే పరిస్థితి లేదని అన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను సమూలంగా రద్దు చేసి ప్రతి కార్మికుడికి యాజమాన్యం ద్వారా జీతాలు అందే విధంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీలో పని చేస్తున్న సుమారు 8 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారని తెలిపారు. ఈ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి... ఆర్టీసీ యాజమాన్యం ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాకు జీతాలు చెల్లించేలా చూడాలని, కార్పొరేషన్ ఉద్యోగులుగా పరిగణించాలని, విధుల్లో ఉండే కార్మికులకు ప్రమాదవశాత్తు గాయాలయితే స్థానిక ఆర్టీసీ డిస్పెన్సరీ ఆసుపత్రిలో వైద్యం అందేవిధంగా యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో లేబర్ చట్టాల ప్రకారం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ వారికి రావల్సిన హక్కులపై రాష్ట్ర వ్యాప్త ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఔట్ సోర్సింగ్ నూతన తిరుపతి జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ యూనియన్ తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులు ఉదయ్ కుమార్, ఏపీఎస్ఆర్టీసీ (పీటీడీ) ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురునాథం, మూర్తి, ఔట్ సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.గంగాంజనేయులు, రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ అర్జున్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుమార్ నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య, జిల్లా సెక్రటరీ శ్రావణ్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ మోహన్ యాదవ్, జిల్లా ట్రెజరీ వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్, జిల్లా ప్రచార కార్యదర్శి బాలకృష్ణ, అనేక డిపోల కార్మికులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై చర్చలు జరపాలి

పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా

చండీగఢ్: వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్లతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా అభిప్రాయ పడ్డారు. వార్తా పత్రికలు, న్యూస్ ఏజెన్సీల ఉద్యోగసంఘాల కాన్ఫెడరేషన్ రెండురోజుల వార్షిక సమావేశాలను స్థానిక మున్సిపల్ భవన్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. సమావేశానికి కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు రాస్ బిహారీ అధ్యక్షత వహించారు. సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిన ది ట్రిబ్యూన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుచిక ఎం ఖన్నా వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ట్రిబ్యూన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ గుప్తా స్వాగతం పలుకుతూ ప్రస్తుతం జర్నలిస్టులు క్లిష్టమైన పరిస్థితులని ఎదుర్కొంటున్న నేపథ్యంలో కాన్ఫెడరేషన్ వార్షిక సమావేశానికి కీలక ప్రాముఖ్యం ఉందన్నారు. కాన్ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ఎం.ఎస్.యాదవ్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల అమలులోకి రావడంతో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రద్దయిందనీ, దాంతో జర్నలిస్టుల వేజ్ బోర్డు ఉనికిలో లేకుండా పోయిందని అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలని అందుకు గవర్నర్ తమ పలుకుబడిని వినియోగించాలని కోరారు. పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడలో మీడియా పాత్ర కీలకమైనదని అన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో పత్రికలు కీలక భూమిక పోషించాయని ఆయన ప్రశంసించారు. వ్యవస్థలో లోపాలను ప్రశ్నించేటట్లు పౌరులను జాగృతం చేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని గవర్నర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం... హక్కుల కోసం పోరాడటంతో పాటు, ప్రజాహితం కోసం కృషి చేయాలని జర్నలిస్టులకు ఆయన సూచించారు. ప్రకృతి విపత్తులు, ఆపరేషన్ సింధూర్ వంటి సందర్భాల్లో పంజాబ్ ట్రిబ్యూన్ ఎంప్లాయీస్ యూనియన్ చేపట్టిన సహాయ కార్యక్రమాలు శ్లాఘనీయమని గవర్నర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో అన్నివర్గాల సమస్యలను వినాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. వివిధవర్గాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యంలో కీలకభూమిక పోషిస్తున్న మీడియా సిబ్బంది సమస్యలపై కూడా దృష్టి సారించాలని కోరారు. లేబర్ కోడ్ ల అమలుపై కాన్ఫెడరేషన్ నేతలు లేవనెత్తిన సమస్యను ప్రస్తావిస్తూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను సంబంధిత బాధ్యుల దృష్టికి తీసుకు వెళ్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో యూనియన్ల అభిప్రాయాలతో పాటు సంబంధిత అన్నివర్గాల అభిప్రాయాలు వినాలని, అన్ని వర్గాలతో చర్చలు జరపాలని, చర్చలద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం తనకు ఉందని కటారియా అన్నారు. ఐజేయూ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ లేబర్ కోడ్లను రూపొందించే క్రమంలో బ్రిటిష్ పాలనా కాలం నాటి చట్టాలను .. మారిన పరిస్థితులకు అనుగుణంగా మారుస్తున్నామని ప్రభుత్వం చెప్పిందని, అయితే అందులో ఎంతమాత్రమూ వాస్తవం లేదని అన్నారు. స్వాతంత్ర్యానంతరం మొదటి ప్రెస్ కమిషన్ సిఫార్సు మేరకే వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని మన పార్లమెంటు చేసిందని , ఆ చట్టం ద్వారానే వర్కింగ్ జర్నలిస్ట్ లకు వివిధ హక్కులు, సదుపాయాలు వచ్చాయని గుర్తు చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపు ఇచ్చారు. సమావేశంలో ఐజేయూ సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము, జాతీయ కార్యదర్శులు డి. సోమసుందర్, వై. నరేందర్ రెడ్డి, డి.ఎస్.ఆర్. సుభాష్ సహా పదిహేను మంది ప్రతినిధుల బృందం హాజరైంది. కాన్ఫెడరేషన్‌లో భాగస్వాములుగా ఉన్న ఎనిమిది జాతీయస్థాయి జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

రేపు కన్హా శాంతివనానికి సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం సందర్శించనున్నారు. ఉదయం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సీఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీ తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను సీఎం తిలకించనున్నారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్ట్‌ఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సీఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకుపైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షులు దాజీ నేతృత్వంలో హార్ట్‌ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ ఈ ఆశ్రమం నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్ని సీఎం సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి రానున్నారు. మధ్యాహ్నం సచివాలయంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొనున్నారు. సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరవుతారు.

ఏపీకి జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఇంధన పరిరక్షణ ఇంధన సామర్ధ్యంలో ఆంధ్ర ప్రదేశ్ సాధించిన జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు - 2025ను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివ శంకర్‌కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును శివశంకర్ అందుకున్నారు. ఈ అవార్డు ఇంధన సామర్ధ్యం, ఇంధన సంరక్షణ రంగాలలో రాష్ట్రానికి మరో గర్వకారణమైన మైలురాయిగా నిలిచింది. ఈ అవార్డు ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు లభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకత్వం, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సహాయసహకారాలు, అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మార్గదర్శకం ప్రధాన పాత్ర వహించాయని ఆయన పేర్కొన్నారు. వారి సమర్ధ నాయకత్వంలో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) అనేక రంగాల్లో ప్రభావవంతమైన ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తూ జాతీయ స్థాయిలో ఆంధ్ర ప్రదేశ్‌కు విశేష గుర్తింపును తీసుకువచ్చిందని తెలిపారు. ఈ అవార్డుతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం స్టేట్ డెసిగ్నేటెడ్ ఏజెన్సీ (ఎస్డీఏ) విభాగం గ్రూప్ 2లో మొదటి బహుమతిని సాధించి, ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య రంగంలో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ ప్రతిభను మరోసారి చాటిచెప్పింది.

ఉడికించిన కూరగాయలు... మొలకెత్తిన తృణధాన్యాలు...

71 ఏళ్ల డాక్టర్... ఫిట్‌నెస్ రహస్యం

న్యూఢిల్లీ: మధురకు చెందిన 71 ఏళ్ల వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్ అగర్వాల్ తన ఫిట్‌నెస్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రస్తుతం ఆగ్రాలో జరుగుతున్న జెరియాట్రిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సమావేశంలో ఆయన తన ఫిట్‌నెస్ రహస్యాన్ని మీడియాతో పంచుకున్నారు. రోజూ తెల్లవారుజామున మూడు గంటలకు నిద్రలేచి ఉదయపు నడక, ఇతర శారీరక వ్యాయామాలు చేయడం, ఆహారంలో తాజా పండ్లు, సలాడ్లు, ఉడికించిన కూరగాయలు, ఆకుకూరలు, మొలకెత్తిన తృణధాన్యాలు తీసుకోవడమే తన ఫిట్‌నెస్ మంత్రమని అన్నారు. ఫిట్‌గా ఉండడంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకుంటానని అగర్వాల్ తెలిపారు. అతడి లాగే తాను కూడా ఆరోగ్యం విషయంలో శ్రద్ధగా ఉంటానన్నారు. ఉదయం 10 గంటలకు ఆసుపత్రికి వెళ్లి... 5.30 గంటల వరకు విధులు నిర్వర్తిస్తానన్నారు. రాత్రి ఎనిమిది గంటలకల్లా నిద్రకు ఉపక్రమిస్తానని తెలిపారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉంటూ వృద్ధాప్యంలోనూ ప్రతిఒక్కరూ ఫిట్‌గా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోందని... 2050 నాటికి భారత్‌లో వృద్ధుల సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. వృద్ధులకు చికిత్స చేయడానికి కొత్తతరం వైద్యులు నూతన క్లినికల్ పద్ధతులను అనుసరించాలన్నారు. చిన్నారులకు వివిధ సమయాల్లో వివిధ టీకాలు ఇచ్చినట్లే... వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే వ్యాధులను ఎదుర్కోవడానికి టీకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని యువ వైద్యులను కోరారు.

విశాఖలో ఉత్సాహంగా నేవీ మారథాన్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సాగర తీరంలో శీతల గాలులతో వణికిపోతున్నా ఆదివారం ఉదయం ఐదు గంటలకే వేలాదిమంది నేవీ మారథాన్‌లో పాల్గొన్నారు. విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో నేవీ మారథాన్ 2025ను ఆదివారం ఉదయం నిర్వహించారు. 42కే, 21కే, 10కే, 5కే విభాగాల్లో జరిగిన ఈ మారథాన్‌లో సుమారు 18 వేల మంది రన్నర్లు పాల్గొన్నారు. ఈ మారథాన్‌కు సుమారు 17 దేశాల నుంచి విదేశీ రన్నర్లు హాజరయ్యారు. 42కే రన్‌ను తూర్పు నౌకాదళాధిపతి సంజయ్ బల్లా, 21కే రన్‌ను సంజయ్ బల్లా సతీమణి ప్రియా బల్లా ప్రారంభించారు. 10కే రన్‌ను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, 5కే రన్‌ను విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ మారథాన్‌లో ఉత్సాహంగా రన్నర్లు పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌తో పాటు సంకల్ప మారథాన్ కూడా నిర్వహిస్తున్నారని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నం ఖ్యాతి మరింత పెంచే నేవీ మారథాన్‌ను నిర్వహిస్తున్న ఈస్టర్న్ నేవీకి ధన్యవాదాలు తెలిపారు. శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఈ ఒక్క 5కేలో 10 వేల మంది పాల్గొనడం హర్షణీయమని, ఈ కార్యక్రమంలో ఫిట్‌నెస్ కల్చర్ పెరుగుతుందని అన్నారు. విశాఖ నేవీ మారథాన్‌తో దేశంలో ఫిట్‌నెస్‌కు క్యాపిటల్‌గా అవుతుందని తెలిపారు. కాగా, బీచ్ రోడ్డులో నేవీ మారథాన్ నేపథ్యంలో తెల్లవారు జాము 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు పోలీసులు ఆంక్షలు విధించారు. విశ్వప్రియ ఫంక్షన్ నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు ఈ మారథాన్ జరిగింది. సుమారు 18 వేల మంది ఔత్సాహికులు 42, 21, 10, 5 కిలోమీటర్ల పరుగులో పాల్గొన్నారు. దీనికి వచ్చే వారు వాహనాలను ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అది నిండితే ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు చెప్పినప్పటికీ కొన్ని చోట్ల ట్రాఫిక్ అంతరాయం తప్పలేదు. మారథాన్‌కు ఆర్కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు రెండు వైపులా రోడ్డును, అలాగే జోడుగుళ్లపాలెం నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు బీచ్ వైపు ఉండే సింగిల్ రోడ్డును కేటాయించారు.

సంక్షేమ చట్టం పునరుద్ధరణ

పెండింగ్ క్లైమ్‌ల పరిష్కారం: రవీంద్రనాథ్, హరినాథ్‌రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులు అప్పులతో అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు నిర్మాణ రంగ కార్మికులకు రక్షణగా ఉండే చట్టాల అమలు కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ బైరాగి పెట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా రావులపల్లి రవీంద్రనాథ్, హరినాథ్ రెడ్డి హాజరయ్యారు. ప్రైవేటు బిల్లు ద్వారా పార్లమెంటులో 1996లో ఆమోదించి... భవన నిర్మాణ కార్మికులకు రక్షణ కల్పించిన భవన నిర్మాణ కార్మిక చట్టం సాధించిన ఘనత ఏఐటీయూసీదే అని నాయకులు పునరుద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల పెండింగ్ క్లైములు ఉన్నాయని, సంక్షేమ చట్టం నిధులు గత ప్రభుత్వాలు ఇతర అవసరాలకు వాడుకున్నాయన్నారు. క్లైములు పరిష్కరించకుండా కార్మికులను రోడ్డు పాలు చేశారని విమర్శించారు. నిర్మాణ రంగంలో పరిధిలోని 39 రంగాలను ఏకతాటిపైకి తెచ్చి...బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసి... కార్మికుల హక్కులను, వారి ఆరోగ్యాన్ని, కుటుంబలకు అండగా నిలిచే సంక్షేమ చట్టాన్ని వామపక్ష ఎంపీలు 60 మంది పోరాడి సాధించారని గుర్తుచేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం తిరిగి పునరుద్ధరించడానికి, పెండింగ్ క్లైములు పరిష్కరించడానికి చేసే పోరాటాలకు ఏఐటీయూసీ, సీపీఐ మద్దతిస్తాయని నాయకులు తెలిపారు. ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ చంద్రశేఖర్ రెడ్డి, నగర అధ్యక్ష-కార్యదర్శులు ఎన్‌డీ రవి, కెవై రాజా హాజరయ్యారు. ఈ మహాసభకు జిల్లా అధ్యక్షుడు కత్తి రవి అధ్యక్షత వహించగా... ప్రధాన కార్యదర్శి శ్రీరాములు ఆహ్వానం పలికారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మణి చంద్రబాబు, శెట్టిపల్లి రవి, కార్తీక్, హరిబాబు, పద్మనాభరెడ్డి, మీరాబాయి, సురేశ్ ప్రసంగించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

మంచి సర్పంచులుగా పేరు తెచ్చుకోండి

మాజీ పిఏసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి

విశాలాంధ్ర -బూర్గంపాడు : గ్రామ అభివృద్ధిలో పోటీపడి మంచి సర్పంచులుగా పేరు తెచ్చుకోవాలని మాజీ పిఏసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 13 పంచాయతీలలో గెలుపొందిన సర్పంచుల సన్మాన కార్యక్రమం ఆ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృషా?రెడ్డి అధ్యక్షతన మండల పరిధిలోని పుష్కర వాహనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలు అందయాన్నారు. టిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ పదేళ్ల కాలంలో చేయలేని సంక్షేమం, అభివృద్ధిని కేవలం 22 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని అందుకే ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా ఉన్న పద్దెనిమిది పంచాయతీలలో ఐదు పంచాయతీలను ఏకగ్రీవము చేసుకున్న ఘనత మన ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గతంలో ఎప్పుడూ కూడా ఏకగ్రీవం కాలేదని గుర్తు చేశారు. మిగిలిన 13 స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ 11 పంచాయతీలు గెలుచుకోవటం విశేషం అన్నారు. నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలు విడిపోయి పోటీ చేయటం వల్ల టిఆర్ఎస్ అభ్యర్థి గెలిచారని తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు విభేదాలు లేకుండా పని చేయాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మన నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు చెప్పారు. తక్కువ నిధులు వచ్చే గ్రామ పంచాయతీలలో సారపాక ఒకటన్నారు. సర్పంచ్ కిషోర్ స్థానిక ఐటిసి సిఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలైన టిడిపి, సిపిఐ, సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఇదే ఐక్యతను ముందుకు తీసుకెళ్తామని తద్వారా ప్రజల అభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఐఎన్టియుసి రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహమూద్ ఖాన్, టిడిపి రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, మాజీ జెడ్పిటిసి బట్ట విజయ గాంధీ, టిఎన్టియుసి అధ్యక్షులు హరిప్రసాద్, ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, టిఎన్టియుసి చైర్మన్ గల్లా నాగభూషయ, నూతన సర్పంచులు కిషోర్ నాయక్, బాదం వెంకటేశ్వర రెడ్డి,మంద నాగరాజు, తాటివాని, కుంజా కొండమ్మ, బానోత్ నరసింహ, వర్స మంగమ్మ, బొర్ర సుభద్ర, బొల్లి నిరోషా, సురేందర్,పద్మ,శర్ప నాగమణి,తాటి లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

రఘునాథ పాలెం పంచాయతీని మోడల్‌గా తీర్చి దిద్దుతా

సర్పంచ్ పోలేబోయిన రాణి

విశాలాంధ్ర - కరకగుడెం : రాజకీయాలక˘తీతంగా నాయకులు, స్థానిక ప్రజల సహకారంతో రఘునాథపాలెం పంచాయతీని జిల్లాలోనే మోడల్ పంచాయతీగా తీర్చి దిద్దుతానని మొదటి సరిగా సర్పంచ్ గా గెలిచిన పోలెబోయిన రాణి అన్నారు. మొదటి విడుత ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా ఆమె పోటీచేసిన ఊహించని విధంగా విజయం సాధించారు. గతంలో పద్మాపురం ఉమ్మడి పంచాయితీలో ఉన్న రఘునాథపాలెం కొత్త పంచా యితీ గా ఏర్పడింది. ఈ కొత్త పంచాయతీ కి ఇది రెండవ ఎన్నకలు కాగా మొదటి ఎన్నకాల్లోను బిఆర్ ఎస్ పార్టీ నుంచే సర్పంచ్ గెలిచారు. రఘునాథ పాలెం విడిపోక ముందు పద్మాపురం పంచాయితీ దశబ్దాలుగా కాంగ్రెస్ కంచు కొత్తగా ఉండేది. కొత్త పంచాయితీ ఏర్పడ్డాక ఈ ఎన్నికలతో రెండు డఫాలు గెలిచినట్లు అయింది. ఈ నేపథ్యంలో కొత్తగా సర్పంచ్ పదవి దక్కించుకున్న రాణి ఆదివారం విశాలాంధ్ర తో మాట్లాడారు. తనను సర్పంచ్ గా గెలిపించిన స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామం పంచాయతీలో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటారని చెప్పారు. కొన్ని రోజులు స్థానిక నాయకుల సహకారంతో గ్రామ సమస్యలపై దృష్టి సారించి ఒక నివేదిక రూపొందిస్తామన్నారు. తదుపరి వార్డు సభ్యులు, స్థానిక ప్రజల సహకారం తో ప్రాధాన్యతను బట్టి, నిధుల స్థాయిని బట్టి ప్రజల కు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ కంచుకోట బద్దలు కొట్టి రెండవ దఫా కూడా బిఆర్ఎస్ పార్టీ కి స్థానికంగా బలం స్థిరంగా ఉందని ప్రజలు మరోసారి తన గెలుపుతో రుజువు చేశారని సర్పంచ్ వెల్లడించారు. ముఖ్యంగా పంచాయతీ లోని వెంకటరాంపురం, నర్సాపూర్ గ్రామాలలో మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామన్నారు. వెంకట రాంపురం గ్రామంలో రోడ్డు సౌకర్యం తోపాటు మధ్య గుంపు గ్రామంలో తాగు నీరు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయితీ నిధులు ఏమాత్రం దుర్వినియోగం చేయకుండా ప్రజల కోసమే విని యోగిస్తామన్నారు. నిధులను బట్టి విడతల వారీగా ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తూ మోడల్ పంచాయతీగా చేస్తామన్నారు. పలు గ్రామాల్లో చేతి పంపుల మారమ్మత్తు, వీధి దీపాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంచి కుటుంబం నుంచి గృహిణిగా ఉన్న సర్పంచ్ రాణి పంచాయతీ సమగ్ర అభివృద్ధికి పాటుపడతారని స్థానికుల్లో ఆశాభావం వ్యక్తం అవుతుంది.

టిఎన్టియుసి నాయకులను సన్మానించిన సర్పంచ్ కిషోర్

విశాలాంధ్ర - బూర్గంపాడు : మొదటి విడుతలో ప్రతిష్టాత్మకంగా జరిగిన సారపాక పంచాయతీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన విజయంలో భాగస్వాములైన తెలుగుదేశం, టిఎన్టియుసి నాయకులను సర్పంచ్ గుగులోతు శివరాం కిషోర్ నాయక్ మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందరరేగా శివరాం మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు టిడిపి, టిఎన్టియుసి నాయకులు అన్ని విధాల సహకరించారని కొనియాడారు. ప్రజలకు కార్మికులకు మంచి చేయడంలో పోటు రంగారావు, కనకమెడల హరిప్రసాద్ ఎప్పుడూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నదారి రమేష్,కాంగ్రెస్ నాయకులు దుగ్గెంపూడి శేషి రెడ్డి, రత్నారెడ్డి, పత్తి కోటిరెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండా విజయ ఢంకా

పాల్వంచ, చుంచుపల్లి మండలాల్లో 17 మంది సర్పంచ్ స్థానాలు కైవసం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇలాఖాలో ఎర్రజెండా విజయఢంగా మోగించింది. రెండవ విడత గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గంలోని చుంచుపల్లి, పాల్వంచ మండలాల్లో ఆదివారం పోలింగ్ జరిగింది. ఈ రెండు మండలాల్లో సిపిఐ పార్టీ బలపరిచిన 17 మంది సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందారు. దీంతో ఎమ్మెల్యే ఇలాఖాలో సిపిఐ పార్టీకి పట్టు మరోసారి పునరావృతమైంది. ఎమ్మెల్యే సొంత మండలం చుంచుపల్లి లో 8 గ్రామ పంచాయతీల్లో ఒకరు ఏకగ్రీవం కాగా ఏడు గురు సర్పంచులు విజయం సాధించారు. ఈ మండలంలోని విద్యానగర్ సర్పంచ్ గా శాంతి శ్రీ ఏకగ్రీవంగా కాగా 4 ఇంక్లైన్ సర్పంచ్ అజ్మీరా సింధు, బాబుక్యాంపు లో నూనావత్ కుమారి, గౌతంపూర్ లో నపావత్ కళ్యాణి, పెనుబల్లి లో రెడ్డి సుజాత, పెనగడప లో కారం సీతారాములు, రామాంజనేయ కాలనీ లో తాగోరి సరిత, ప్రశాంతినగర్ లో వాడే రాములు సర్పంచ్లులుగా సమీప అభ్యర్థులుపై భారీ విజయం సాధించారు. అదే విధంగా పాల్వంచ మండలంలో 4 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా రేగులుగూడెం లో కుర్సం రాములు, మందెరకలపాడు లో బాణోత్ లక్ష్మీ, కారెగట్టు లో వట్టం బాబూరావు, పునుకుల లో వజ్జా కృష?వేణీ, ప్రబాత్ నగర్ లో బోజన్ నిషారాణి, లక్ష్మీ దేవివల్లి లో భూక్యా మంజుల, నాగారం కాలనీ లో తేజావత్ వినోద్ కుమార్, దంతెలబోర ఎస్సి కాలనీ లో సోదె వెంకట రమణలు సర్పంచులుగా 9 స్థానాల్లో గెలుపొందారు. ఈ సందరరేగా ఆయా కేంద్రాల్లో పెద్దఎత్తున సంబురాలు జరిగాయి. సిపిఐ శ్రేణులు పెద్దఎత్తున ఎర్రజెండాలతో ర్యాలీలు నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. ఈ గ్రామ పంచాయితీ ఎన్నికల సందరరేగా చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలతో ఒంటరి పోరుకు సిద్దపడ్డ సిపిఐ తన సత్తా చాటింది. సిపిఐ అభ్యర్థులను ఓడించాలని పెద్ద స్థాయిలో కుట్రలు జరిగాయి.

ఎమ్మెల్యే కూనంనేని ని ఈ ఇలాఖాలో బలహీనం చేసే ప్రయత్నాలను గ్రామాల ప్రజలు తిప్పికొట్టారు. అవాకులు చెవాకులు పేలిన వారికి చుక్కలు చూపిం చారు. నిత్యం ప్రజల కోసం పోరాడే సిపిఐ పార్టీకి పట్టం కట్టారు. పోటీ చేసిన ప్రతీ స్థానంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు అగ్ర భాగన నిలిచారు. ప్రత్యార్థులు పెద్దనాయకుల అండతో డబ్బు, మద్యం, పదవులు ఎరవేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేసారు. వారు వ్యూహాలు,

కుతంత్రాలు పన్నినా తిప్పికొట్టి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సారధ్యం పై భరోసా, జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా నాయకత్వం పై అపార విశ్వాసంతో గ్రామాల ప్రజలు ఆదిరించారు. ఈ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రాంతాల్లో సిపిఐ పార్టీని తిరుగులేని శక్తిగా ప్రజలు నిలబెట్టారు




ప్రజా వ్యతిరేక పాలకవర్గ పార్టీలను ఓడించండి

ప్రజలపక్షం ఉండే న్యూ డెమోక్రసీ అభ్యర్థులను గెలిపించండి : రాష్ట్ర నేత ఆవునూరి మధు

విశాలాంధ్ర - గుండాల : కేంద్ర రాష్ట్ర పాలక వర్గాలు ప్రజల పట్ల శాపంగా మారారని కేవలం పెట్టుబడి వర్గాలకు దేశ ప్రజల నిధులు దోచిపెడు తున్నారని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు విమర్శించారు. ప్రజాస్వామ్య విధానాలను అపహాస్యం చేస్తూ ఎన్నికల ప్రక్రియలను తమ అనుకూలంగా ఏకపక్షం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బున్న వారికే అధికారం హెూదా ఏర్పడే పరిస్థితులు నేటి రాజకీయాల్లో సర్వత్ర నెలకొన్నాయన్నారు. అందుకే విద్యావంతులైన ప్రజలు ముఖ్యంగా యువకులు రాజ్యాంగ రక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మూడవ విడత జరగనున్న స్థానిక ఎన్నికల్లో గుండాల గ్రామ పంచాయతీ న్యూ డెమోక్రసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరం సీతారాములు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం గుండాల మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆవునూరి మధు తో పాటు తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కోడెం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పునెం శ్రీనివాస్, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు చంద్రయ్య దొర, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్, సిపిఎం మండల కార్యదర్శి తోలెం చిన్న మల్లయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు గుండాల గ్రామపంచాయతీ సర్పంచ్ గా పనిచేసిన కొమరం సీతారాములు పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొని పోయాడన్నారు. అవినీతి నచ్చలేకుండా నిధులను సద్వినియోగం చేసినట్లు వెల్లడించారు. గుండాల అభివృద్ధి కొసం ప్రభుత్వంతో కొట్లాడి వివిధ పథకాల నిధుల ద్వారా గ్రామపంచాయతీ అభివృద్ధికి తోడ్పడ్డాడని గుర్తు చేసారు. అందుకే అతనికి ప్రధాన పార్టీలు మళ్ళీ మద్దత్తు ఇస్తున్నట్లు చెప్పారు. తమ అభ్యర్థి కష్టజీవులు, పేద ప్రజల సమస్యలు తీసిన వాడని నిరంతరం ప్రజల కోసం తప్పించే మనిషిని వెల్లడించారు. కొన్ని పాలకవర్గ పార్టీలు అధికారాన్ని ఉపయోగించి గ్రామ ప్రజల్లో లక్షల్లో డబ్బు పంపిణీ చేస్తూ గెలవాలని కుయుక్తులు పన్నుతున్నట్లు విమర్శించారు. ఇట్లాంటి కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు అరెం నరేష్, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, పెండకట్ల పెంటన్న, పర్శక రవి, ఈసం మంగన్న, పాయం ఎల్లన్న, బానోత్ లాలు, మానాల ఉపేందర్, వెంకన్న, కల్తీ నరసింహారావు, తాటి రమేష్, అరెం రామారావు, టిఆర్ఎస్ నాయకులు గడ్డం వీరన్న, పొంబోయిన సుధాకర్, ఈసం పాపారావు, పొంబోయిన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో యువనేత ఇమ్రాన్ సంచలన విజయం

14 పంచాయతీ స్థానాల్లో 10 గెలుచుకున్న కాంగ్రెస్ :చెరో స్థానంలో సిపిఐ, బిఆర్ ఎస్

విశాలాంధ్ర - చంద్రుగొండ : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం చంద్రుగొండలో ఒక యువకుడి గెలుపు రాజకీయ సంచలనానికి కేంద్ర బిందువైంది. జిల్లాలో రెండవ దఫా ఆదివారం జరిగిన పంచాయితీ ఎన్నికల్లో చంద్రుగొండ మండల వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. మండలలంలోని 14 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పదిమంది అభ్యర్థులు సర్పంచ్ స్థానాల్లో విజయం సాధించగా ఒక స్థానంలో బిఆర్ఎస్, సీతయిగూడెం పంచాయతీలో సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థి పిట్టల రామ లక్ష్మయ్య 12 ఓట్లతో ప్రధాన అభ్యర్థుల పై విజయం సాధించడం విశేషం. మండలంలో కాంగ్రెస్ విజయం ఒక ఎత్తయితే చంద్రుగొండ లోని 3 వ వార్డు ఎన్నిక అందరి దృష్టిని ఆకర్శించింది. ఈ వార్డు నుంచి తాజా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, జిల్లా సీనియర్ నాయకులు కొడకండ్ల వెంకటరెడ్డి బిఆర్ ఎస్, సిపిఎం, జనసేన బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ వార్డులో కాంగ్రెస్ బలపరిచిన యూత్ కాంగ్రెస్ నాయకుడు పాతికెళ్ళ యండీ. ఇమ్రాన్ పోటీ చేసి వెంకటరెడ్డి పై 113 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధిండం సర్వత్ర చర్చానియాంశంగా మారింది. సుధీర కాలంగా ప్రతి గడపతో పరిచయాలున్న రెడ్డి పై ఊహించలేని ఇమ్రాన్ విజయంతో కాంగ్రెస్ నాయకులు, ముఖ్యంగా యువనాయకుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి. ఈ యువనేత సాధించిన విషయం సామాన్యమైనది కాదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. యువకుల్లో మంచి పట్టు ఉన్న ఇమ్రాన్ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి సన్నిహిత యువ నాయకులలో ఒకడిగా ఉన్నాడు. ఇతను చిన్న వయసు నుంచి సేవా దృక్పధం కలిగి అన్ని వర్గాలకు చేరువగా వుంటూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటు మంచి పేరు తెచ్చుకున్నాడు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారం, ప్రోత్సహంతో క్రియాశీల రాజకీయాలు చేస్తున్నాడు. కాగా 3వ వార్డులో మొత్తం 396 ఓట్లు ఉండగా 325 ఓట్లు పోలైయ్యాయి. ఇమ్రాన్ కు 210 ఓట్లు రాగా వెంకటరెడ్డికి 97 ఓట్లు పడ్డాయి. చెల్లని ఓట్లు 10 కాగా బీజేపీ బలపరిచిన అభ్యర్థికి కేవలం 5 ఓట్లు మాత్రమే వచ్చాయి. 113 ఓట్ల మెజారిటీతో సీనియర్ నాయకుడిని ఓడించిన ఇమ్రాన్ పై అభినందనలు వ్యక్తమౌతున్నాయి. మండలంలో స్వీప్ గా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడంలో ఇక్కడి నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, సమిష్టి కృషి మంచి ఫలితాలను అందించింది.

ప్రజలు రాజకీయ విలువలను కాపాడాలి

ప్రజా ఉద్యమాలే లక్ష్యంగా పనిచేస్తున్నాము

దొంగ హామీలను నమ్మొద్దు : గుండాల మాస్ లైన్ సర్పంచ్ అభ్యర్థి శంకరన్న

విశాలాంధ్ర - గుండాల : ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునే బాధ్యత ప్రజల చేతుల్లోనే ఉందని వర్తమానం ఆర్థిక అక్రమల రాజకీయాలను నివారించాల్సిన అవసరం ఉందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ బలపరిచిన గుండాల సర్పంచ్ అభ్యర్థి ఈసం శంకరన్న అన్నారు. అనేక ప్రజా ఉద్యమా లను నిర్మించి నడిపించిన చరిత్ర తమ పార్టీకి ఉందన్నారు. ఈ విషయం ఏజెన్సీ మండలాల ప్రజలకు తెలియంది కాదన్నారు. తాము పేద ప్రజల కోసం ఎన్నో త్యాగాలతో చేసిన ప్రజా ఉద్యమాలే గుండాల గ్రామ సర్పంచ్‌గా గెలిపిస్తాయని శంకరన్న ఆశాభవం వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నాయకులు అభ్యర్థులు ఇచ్చే దొంగ హామీలను ప్రజలు నమ్మోద్దన్నారు. స్థానిక ఎన్నికల సందరరేలో ఆయన విశాలాంధ్రతో మాట్లాడారు. గత 30 ఏళ్ళ పైగా ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక భూ పోరాటాలు, శ్రామిక వర్గాల కోసం అనేక ఉద్యమాలు చేశామన్నారు. ఉద్యమాల ద్వారా ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథం లో నడిపించుకున్న చరిత్ర సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీకి ఉంద న్నారు. దోపిడి వ్యవస్థపై అక్రమ రాజకీయాలపై ప్రజల్లో చైతన్యం చైతన్యం తెచ్చినట్లు వివరించారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పోడు పోరాటాలు నిర్వహించి వందలాది ఎకరాల భూములను పేద రైతు లకు పంచిన చరిత్ర కేవలం మాస్ లైన్ పార్టీకే ఉందన్నారు. ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న గుండాల మండల గ్రామాలను ప్రజల సహకారంతో రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా విశేషమైన కృషి జరిగిందన్నారు. ఆ ప్రజా చైతన్యం తోనే ఈ పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారనీ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే నెరవేర్చలేక ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వచ్చిందన్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో అనేక దొంగ హామీలు ఇచ్చి ప్రజల మనసు గెలుచు కోవాలి అనుకోవడం వారి అవివే కానికి నిదర్శనమన్నారు. అమా యకులైన ఓటర్లను డబ్బు మద్యం ఆశ చూపి కొనుగోలు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపిం చారు. ప్రజల కష్టాల్లో తోడు రాని వారు సమస్యలను సాధించి పెట్ట లేని వారు ఎన్నికల్లో గెలిచి ఏం చేస్తారని ప్రశ్నించారు. నేటి రాజకీయాలు కేవలం అధి కారాన్ని అడ్డుపెట్టుకొని డబ్బు సంపాదిం చడానికె పరిమితం అవుతున్నాయని విమర్శించారు. అధికారం కోసం ప్రజలను ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తూ నీచమైన రాజకీయ వ్యవస్థను కాదు గెలుపు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి పంటకు గ్రామ ప్రజల ఉమ్మడి కృషితో గిట్టుబాటు ధర సాధించుకున్న చరిత్ర ఉందన్నారు. ఇలా ఉద్యమాల ద్వారా అనేక విజయాలు సాధించామ న్నారు. సర్పంచ్ అభ్యర్థి తనతో పాటు తమ పార్టీ నుంచి నిలబడ్డ వార్డు సభ్యులను కూడా గెలిపించాలని శంకరన్న కోరారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలకృష్ణ

కరకగూడెం, విశాలాంధ్ర : ట్రైబల్ వెలోఫేర్ పిసా క్రీడలో నేషనల్ లెవల్లో కరకగూడెం మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన తోలేం బాలకృష్ణ ఎంపిక అయ్యాడు. ఆదివారం కిన్నరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ల్లో ఏర్పాటు చేసిన క్యాంపులొ అత్తుత్యమా ప్రతిభ కనబరిచి నేషనల్ స్థాయి లో ప్రధమ స్థానంలో నిలిచాడు. గతంలో జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు 3 సార్లు లీగ్ దశలో ఆడాడు. ప్రభుత్వ హాస్టల్ లొ ఉంటు కబడ్డీ మీద మక్కువ తో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేషనల్, ఇంటర్ నేషనల్ స్థాయి లొ ఆడి మన రాష్ట్రం తోపాటు మండలనికి మంచి పేరు తీసుకు రావాలని పలువురు ఆకాంక్షించారు. బాలకృష్ణ ప్రతిభ చూసి కరకగూడెం మండల ప్రజలు అభినందిస్తున్నారు.

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తనకు సహాయ సహకారాలు అందిస్తే భవిష్యత్తు లో దేశానికి రాష్ట్రానికి క్రీడల్లో సేవలందిస్తానని చెప్పారు. సహకారం అందిచిన ట్రైబల్ వెలోఫేర్ స్పోర్ట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ క్రీడాకారులకు ధన్యవాదాలు తెలిపారు

ప్రశాంతంగా ముగిసిన రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

విశాలాంధ్ర బ్యూరో -ఖమ్మం : జిల్లాలో జరుగుతున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం కామంచికల్లు, తీర్థాల, గోళ్ళపాడు, ముదిగొండ, నేలకొండపల్లి, ముజ్జిగుడెం,రాజేశ్వరపురం, కూసుమంచి, జల్లేపల్లి, దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెం గ్రామాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటర్లు స్వేఛగా తమ ఓటు హక్కునువినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఒంటి గంట వరకు వచ్చి క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్త్ తో పోలీస్ అధికారులు పర్యవేక్షించారని అన్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు గ్రామాలలో ముందస్తు జాగ్రత్తలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎక్కువ మందిని గుంపులుగా లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రశాంతంగా వున్న గ్రామాల్లో సమస్య సృష్టించే వ్యక్తులను ముందుస్తుగానే బైండోవర్ చేసినట్లు తెలిపారు.

భరతనాట్యంలో చిన్నారుల ప్రతిభ

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం నగరానికి చెందిన అభినయ రుద్ర నాట్యలయం విద్యార్థులు భరతనాట్యం పోటీల్లో ప్రతిభ చాటారు. కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో ఆదివారం సౌత్ ఇండియా డాన్స్ కాంపిటీషన్-2025 పోటీలను నిర్వహించారు. ఈసందరరేగా అభినయ రుద్ర నాట్యలయణ విద్యార్థులు. పలు విభాగాల్లో భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చి బహుమతులను గెలుచుకున్నారు. సీనియర్స్, సబ్ జూనియర్ గ్రూప్ విభాగాల్లో ప్రధమ బహుమతులు సాధించగా.. సోలో సీనియర్స్ విభాగంలో రుగ్విజ తృతీయ, సోలో జూనియర్స్ విభాగంలో రితిక ప్రథమ, సోలో సబ్ జూనియర్స్ విభాగంలో వరి?క, రోనిక త ృతీయ బహుమతులను గెలుచుకున్నారు. భరతనాట్య గురువు కణతాల ఫణీల్ తో పాటు విజేతలకు అతిథులు, నిర్వాహకులు ట్రోఫీలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు భాగ్యశాన్ని సహస్ర, హేమశ్రీ నిత్యశ్రీ ప్రహర్షిత, మాన్విత, శాన్వి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం : పద్మ శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందరరేగా ఆదివారం భక్తరామ దాసు కళాక్షేత్రంలో 'అర్ధశత గాన స్వరసుధార్చన పసందైన రోజు' అనే సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు . తేలుతూ ఆనాటి ఘంటసాల సూపర్ హిట్ పాటలను ఆలపించారు . ఈ కార్యక్రమంలో స్వర సుధ అధ్యక్షుడు కె.మాధవరావు , స్వరసుధ అధ్యక్షుడు కె.మాధవరావు , శ్రీ వి.వి.రెడ్డి , శ్రీ పి జ వినయ్ కుమార్ , పిన్నెల్లి యాదగిరి , కె.వి.రమణారావు , కె.జనార్ధన్ రావు , యం.డి.జాఫర్ , ఇసనపల్లి నగేష్ , ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డా "నాగబత్తిని రవి , భలేమంచి రోజు" ఖమ్మం జిల్లా అధ్యక్షులు డా॥ టీ.వాసుదేవ్ , నెల నెలా వెన్నెల ప్రధాన కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్ , యం.పి.డి.ఓ. కళావాచస్పతి, ప్రముఖ వ్యాఖ్యాత జి. రవీందర్, ప్రముఖ గాయనీ , గాయకులు , సంగీత సహకారం సూర్యతేజ హైద్రాబాద్, స్వరసుధ బృందం ఖమ్మం వారు పాల్గొన్నారు.

డ్రైవర్ సెన్సిటైజేషన్ ట్యాబ్ ల్యాబ్‌ను ప్రారంభించిన డియాజియో ఇండియా

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా శాఖ, భారత్‌కేర్స్ భాగస్వామ్యంతో డియాజియో ఇండియా (యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్), విజయవాడలోని ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్‌టీఓ)లో 'రాంగ్ సైడ్ ఆఫ్ ది రోడ్స (డబ్ల్యుఎస్‌ఓటీఆర్) కార్యక్రమం కింద తమ నూతన డ్రైవర్ సెన్సిటైజేషన్ ట్యాబ్ ల్యాబ్‌ను ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవానికి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (రోడ్డు భద్రత) మీరా ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా కూడా మద్దతు అందించారు. రోడ్డు భద్రత, బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించాలనే డియాజియో ఇండియా లక్ష్యంలో ఈ ప్రారంభం ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ప్రారంభంతో, రాష్ట్రంలోని 4 ఆర్‌టీఓలలో డబ్ల్యుఎస్‌ఓటీఆర్ కేంద్రాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. డియాజియో ఇండియా 'స్పిరిట్ ఆఫ్ ప్రోగ్రెస్' ఈఎస్జి కార్యాచరణ ప్రణాళికతో అనుసంధానించబడిన ' రాంగ్ సైడ్ ఆఫ్ ది రోడ్' అనేది విద్య-ఆధారిత, ప్రవర్తనా పరమైన మార్పు కార్యక్రమం, ఇది మద్యం సేవించి వాహనం నడిపే సమస్య పరిష్కరించడానికి డిజిటల్ సాధనాలను ఉపయోగిస్తుంది. లీనమయ్యే, సాంకేతికత ఆధారిత మాడ్యూళ్ల ద్వారా నిర్వహించబడే డబ్ల్యుఎస్‌ఓటీఆర్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ పరిణామాలను వెల్లడించడా నికి నిజ జీవిత దృశ్య అనుకరణలతో డ్రైవర్లను నిమగ్నం చేస్తుంది.

ఖమ్మం రూరల్‌లో ఎర్రజెండా రెపరెపలు

సిపిఐ సిపిఎం కాంగ్రెస్తో సమానంగా పంచాయతీల్లో గెలుపు

విశాలాంధ్ర -ఏదులాపురం మున్సిపాలిటీ : ఖమ్మం రూరల్ మండలం పరిధిలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సిపిఎం చరో నాలుగు పంచాయతీల చొప్పున రెండిటికి కలిపి ఎనిమిది గ్రామపంచాయతీలో విజయకేతనం ఎగరేసాయి. ఈ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీకి కూడా ఎనిమిది గ్రామపంచాయతీలో దక్కాయి కాగా ఐదు గ్రామపంచాయతీలో గులాబీ జెండా ఎగిరింది.

సిపిఐ..

1) పల్లెగూడెం(ఏకగ్రీవం)
2) దారేడు(ఏకగ్రీవం)
3) గూడూరు పాడు %జ
%4) పడమటి తండా
లికాంగ్రెస్...లి
5) తల్లంపాడు
6) పోలిశెట్టి గూడెం
7) ఆరెంపుల
8) కస్నా తండా
9) పోలేపల్లి
10) మంగళ గూడెం
11) తనగంపాడు
12) ఆరె కోడు తండా
లిసిపిఎం...లి
13)పొన్నెకల్లు
14)ఏం,వి పాలెం
15)ఆరకోడు
16)కాచిరాజు గూడెం
లిటిఆర్ఎస్...లి
17)కొండాపురం
18)చింతపల్లి
19) తీర్దాల
20)కామంచికల్
21) గోళ్ళపాడు

సిపిఐ-4, కాంగ్రెస్-8, సిపిఎం-4, టిఆర్ఎస్-5.

కామేపల్లి మండలంలో సత్తా చాటిన కాంగ్రెస్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం/ కామేపల్లి

కామేపల్లి మండలం పరిధిలో మొత్తం 24 గ్రామపంచాయతీలు కాగా వాటిలో 16 గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించింది కాగా రెండవ స్థానంలో టిఆర్ఎస్ ఆరు గ్రామపంచాయతీలో విజయం సాధించగా టిడిపి ఒక గ్రామ పంచాయతీ సిపిఐ ఒక గ్రామ పంచాయతీలో విజయం సాధించాయి. పంచాయతీల గెలిసిన సర్పంచుల వివరాలు ఇలా ఉన్నాయి.

1.కామేపల్లి గ్రామం
అజ్మీరా బుల్లి తెలుగుదేశం పార్టీ
లి2.రామకృషా?పురం గ్రామం
అజ్మీరా ద్వాలి ,కాంగ్రెస్
లి3.ఊట్కూరు గ్రామం
ఈసం హనుమంతరావు సిపిఐ(యునానిమస్)
లి4.జోగ్గూడెం గ్రామం
భూక్యా సైదమ్మ ,కాంగ్రెస్
లి5.కెప్టెన్ బంజర్ గ్రామం
ఆరేం అచ్చమ్మ కాంగ్రెస్(యునానిమస్)
లి6.తాళ్లగూడెం గ్రామం
లకావత్ సునీత ,కాంగ్రెస్
లి7.పింజరమడుగు గ్రామం
గుగులోత్ బాషా కాంగ్రెస్
లి8.టేకులతండా గ్రామం
జరుపుల రెడ్యా , కాంగ్రెస్
లి9.పాతలింగాల గ్రామం
కిన్నెర సుజాత కాంగ్రెస్
లి10.గోవింద్రాల గ్రామం
బానోత్ కమల కాంగ్రెస్
లి11.నెమలిపురి గ్రామం
బానోత్ బలరామ్ కాంగ్రెస్
లి12.కొత్తలింగాల గ్రామం
ఇట్టా శ్రీనివాసరావు , కాంగ్రెస్
లి13.పొన్నెకల్ గ్రామం
గుగులోత్ భూమి క , కాంగ్రెస్
లి14.బర్లగూడెం గ్రామం
మాలోత్ కిషన్ బి ఆర్ ఎస్
లి15.గరిడేపల్లి గ్రామం
ధరావత్ కంసిలి బి ఆర్ ఎస్
లి16.కొమ్మినేపల్లి గ్రామం
ధరవత్ అనురా దా ,కాంగ్రెస్
లి17.రుక్కితండా గ్రామం
గుగులోత్ రమాదేవి కాంగ్రెస్
లి18.సాతానిగూడెం గ్రామం
భూక్యా రెడ్యా కాంగ్రెస్
లి19.ముచ్చర్ల గ్రామం
జాటోత్ జాయ్ లూసి, బి ఆర్ ఎస్
లి20.జాస్తిపల్లి గ్రామంలి
ధరావత్ నాగమణి బి ఆర్ ఎస్
లి21.బాసిత్ నగర్ గ్రామం
బాదావత్ షాజీ బి ఆర్ ఎస్
లి22.మద్దులపల్లి గ్రామం
పడిగ నాగమణి బి ఆర్ ఎస్
లి23.జగన్నాధ తండాలి
బానోత్ దీన కాంగ్రెస్ (యునానిమస్)
లి24.లాల్యాతండాలి
మాలోత్ సౌజన్య కాంగ్రెస్

తాను చేసిన అభివృద్ధే అభ్యర్థిని గెలిపిస్తుంది

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

విశాలాంధ్ర-సత్తుపల్లి: బి ఆర్ ఎస్ హయాంలో కొత్తూరు గ్రామంలో తాను చేసిన అభివృద్ధి బిఆర్ సర్పంచ్ అభ్యర్థిని గెలిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొత్తూరు గ్రామంలో ప్రజలను కలిసి సర్పంచ్ అభ్యర్థి అయినంపూడి సత్యనారాయణ ను గెలిపించాలని ప్రజలను కోరారు ఈ సందరరేగా తన హయాంలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు.

కొత్తూరు గ్రామ ప్రజలందరికీ సత్యనారాయణ సుపరిచితుడని అన్నారు. తను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో కొత్తూరు గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామంలో రైతువేదిక, గ్రామపంచాయతీ కార్యాలయం, ఆరోగ్య సబ్ సెంటర్, వైకుంఠధామం నిర్మాణం చేయడంతో పాటు, గ్రామంలో 90 శాతం సీసీ రోడ్లు నిర్మాణం చేసినట్లు తెలిపారు. అదనంగా పంచాయతీకి కొత్త ట్రాక్టర్‌ను అందజేశామ న్నారు. తమ పాలనలో గ్రామం "ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు"ను పొందినట్లు గుర్తుచేసారు.

గ్రామాభివృద్ధి కొనసాగాలంటే బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అయినంపూడి సత్యనారాయణ తో పాటు వార్డు అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిఆర్ఎస్ అభ్యర్థి శెట్టిపల్లి శ్రీనివాస్‌ని సన్మానించిన బానోత్

వైరా -విశాలాంధ్ర : వైరా మండలంలో కేజీ సిరిపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శెట్టిపల్లి శ్రీనివాసరావు 153 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో ఆదివారం బిఆర్ఎస్ జిల్లా నాయకురాలు బానోత్ మంజుల మదన్ లాల్ తో పాటు మండల బిఆర్ఎస్ నాయకులు శాలువాలతో సన్మానించారు.ఈ సందరరేగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, గెలుపు ఓటములు సహజమేనని రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అని అన్నారు. టిఆర్ఎస్ అభ్యర్థికి కృషిచేసిన మొరంపూడి బ్రదర్స్,జనసేన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల రాము, కామినేని శ్రీనివాసరావు,కొత్త వెంకటేశ్వరరావు,పారుపల్లి నాగం,గుజ్జర్లపూడి దేవరాజు, దొంతబోయిన చింతయ్య, అప్పం సురేషు, వల్లపు రాము, బత్తుల వెంకటేష్, వల్లపు రాము (సోమవరం) మడిపల్లి కృష?, నల్లగొండ నాని, కారుకొండ బోసు, తోటకూర రాము, అయినాల కనకరత్నం, తన్నీరు జ్యోతి, తదితరులు ఉన్నారు.

15 నుండి మహీంద్రా ఎక్స్‌యూవీ 7ఎక్స్ఓ ప్రీ-బుకింగ్స్

ముంబై: భారతదేశపు దిగ్గజ ఎస్‌యూవీ తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా తమ హైటెక్, ట్రెండ్ సెటర్, ప్రీమియం ఎస్‌యూవీ ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓకి సంబంధించి ప్రీ-బుకింగ్స్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. 2025 డిసెంబర్ 15వ తేదీ మధ్యాహ్నం 12:00 గం.ల నుంచి ఈ వాహనాన్ని ప్రీ-బుక్ చేసుకోవచ్చని తెలిపింది. అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎస్‌యూవీని కస్టమర్లు రూ. 21,000తో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. కస్టమర్లు తమకు నచ్చిన డీలర్‌షిప్, ఇంధనం రకం, ట్రాన్స్‌మిషన్‌ను ఎంచుకునేందుకు ప్రీ-బుకింగ్ సమయంలో వెసులుబాటు ఉంటుంది. ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ రెండు రకాల ఇంధన ఆప్షన్లు - పెట్రోల్, డీజిల్ అలాగే మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో లభిస్తుంది. మహీంద్రా డీలర్‌షిప్‌లు, కంపెనీ యొక్క ఆన్‌లైన్ మాధ్యమాలవ్యాప్తంగా ప్రీ-బుకింగ్ ఆప్షన్ అందుబాటులో ఉంటుంది.

వద్దిరాజు సమక్షంలో వి ఆర్ ఎస్ లో చేరిన లక్కినేని సురేందర్ , దళ్ సింగ్

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం : ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భూక్య దళ్ సింగ్ నాయక్, లక్కినేని సురేందర్ తదితరులు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్ లో చేరారు .పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో గులాబీ దళంలో చేరారు.టేకులపల్లిలో ఆదివారం ఎంపీ రవిచంద్ర వారిద్దరికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో ఫోన్లో మాట్లాడించారు.

నలభై ఏళ్ల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన తన కుటుంబానికి సర్పంచ్ సీటు ఇవ్వమని ప్రాధేయపడ్డా.. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య అవకాశం ఇవ్వకుండా మోసం చేశారనే బాధతో ఆ పార్టీని వీడి, బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు దళ్ సింగ్ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ తో మాట్లాడుతూ చెప్పారు.ఆయనతో పాటు మరో ముఖ్యమైన నాయకుడు, టేకులపల్లి సొసైటీ ఛైర్మన్ లక్కినేని సురేందర్ కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి బీఆర్ఎస్ లో తిరిగి చేరుతున్నట్లు తెలిపారు.కేటీఆర్ వారిద్దరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ మేరకు వీరితోపాటు చుక్కాలబోడు తండా, ఎక్సైజ్ దాసు తండా లో ఏకగ్రీవంగా ఎన్నికైన 11 మంది గ్రామ వార్డు మెంబర్లు, సిపిఐ ఎంఎల్ పార్టీకి చెందిన మాజీ దళ కమాండర్ పూనెం నర్సయ్యలు తదితరులు కూడా ఎంపీ రవిచంద్ర సమక్షంలో బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ టేకులపల్లి మండల శాఖ అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్, నాయకులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనిజర్ల నూతన సర్పంచ్‌కు ఘన సన్మానం..

విశాలాంధ్ర- కొనిజర్ల : తొలి విడతలో జరిగిన స్థానిక సమరంలో విజయం సాధించిన కొనిజర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచు దూదే పుష్పవతి ను ఉప సర్పంచ్ గోపయ్య ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. మండల కాంగ్రెస్ నాయకులు రచ్చ రామకోటయ్య ఈ సందరరేగా మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్కే పట్టం కట్టారని అన్నారు . ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతులకు మేలు చేసే విధంగా ధాన్యానికి బోనస్ ఇవ్వటంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో ప్రజాభిమానాన్ని సురగొన్నదని ఆయన పేర్కొన్నారు గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన పుష్పవతి బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కాంగ్రెస్ పార్టీకి మరింత గౌరవం పెంచాలని ఆయన ఆకాంక్షించారు, అదేవిధంగా ఉపసర్పంచ్ గా గెలుపొందిన గోపయ్య (మోషే ఇద్దరూ కలిసి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కొనిజర్ల మేజర్ గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు ఈ సన్మాన కార్యక్రమం నూతన సర్పంచి స్వగృహంలోనే జరిగింది . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీ సూరంపల్లి రామారావు సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కొనతం ఉమాశంకర్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ గుదే ఉపేందర్ పాల్గొన్నారు.

బానోతు కొండాను సన్మానించిన శాంతి నిలయం సిబ్బంది

విశాలాంధ్ర -బోనకల్: మండల కేంద్రం గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థి బానోతు జ్యోతి, మరియు 10 వార్డు నెంబర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించిన బోనకల్ గ్రామ ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఉప సర్పంచ్ గా ఎన్నికైన బానోతు కొండాను శాంతి నిలయం సిబ్బంది ఆదివారం సన్మానించారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ... ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎంతో అనుభవం ఉన్న బానోత్ కొండ రాబోయే రోజుల్లో బోనకల్ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కొండ మాట్లాడుతూ... ప్రజలు ఎంతో ప్రేమ విమానాలతో మమ్ములను గెలిపించాలని వారి అభిమానం మరువలేనిదని గ్రామ అభివృద్ధి కొరకు సాయి శక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

స్కూల్ ఎక్సెలెన్స్ పురస్కారం అందుకున్న షైన్ హై స్కూల్..

విశాలాంధ్ర -బోనకల్:స్థానిక షైన్ హై స్కూల్ హైదరాబాద్ హైటెక్స్ లో బ్రెయిన్ ఫీడ్ సంస్థ నిర్వహించిన ఆరవ జాతీయ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రిసోర్సెస్ టెక్ ఎక్స్పో 2025 పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ అన్సర్ పాషా, ప్రిన్సిపాల్ శ్వేత స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు.విద్యార్థుల విద్య పట్ల అంకిత భావం తో పనిచేస్తున్నందుకు గాను,పాఠశాల లో విద్యార్థులకు పలు విద్య వనరులతో విద్య అందిస్తున్నందుకు గాను,పిల్లలకు సృజనత్మక విద్య అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారం లభించింది. పాఠశాల కరెస్పాండంట్ అన్సర్ పాషా మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకున్నందుకు చాలా సంతోషం గా ఉంద`ని, ఈ అవార్డ్స్ అందచేసిన బ్రెయిన్ ఫీడ్ సంస్థకు ధన్యవాదములు తెలిపారు. ఈ పురస్కారం అందుకున్నందుకు పాఠశాల డైరెక్టర్ లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాలల కరెస్పాండంట్‌లు అభినందనలు తెలిపారు.

కాకర్లపల్లి లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

పొదిలి మారేశ్వరరావుకు గ్రామ ప్రజలు నీరాజనాలు

విశాలాంధ్ర- సత్తుపల్లి : మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొదిలి మారే శ్వరరావు ఆదివారం సాయంత్రం గ్రామంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి తన బ్యాటు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో కాకరపల్లి గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థి మారేశ్వర్ రావు మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం నుండి రావలసిన సంక్షేమ పథకాలు అందిస్తానని గ్రామ అభివృద్ధికి తోడ్పడి ప్రజల మన్ననలు పొందుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, న్యూ డెమోక్రసీ జనసేన పార్టీ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు .

5 మండలాల్లో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

విశాలాంధ్ర -వనపర్తి : వనపర్తి జిల్లాలో రెండవ విడత పోలింగ్ జరిగిన వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత, మదనపూర్ మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి ప్రారంభమయి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ తీరును కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, సాధారణ ఎన్నికల పరిశీలకులు మల్లయ్య భట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ తో కలిసి పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ కంట్రోల్ రూమ్ నుండి మాత్రమే కాకుండా వనపర్తి మండలం, నాచహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, పెద్దగూడెం గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుచున్న ప్రక్రియను పరిశీలించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ భద్రతలు కట్టుదిట్టం చేశారు. నాచహళ్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన కలెక్టర్ ఓటర్లు తమ ఓటు హక్కును నిరరేయంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. మధ్యాహ్నం 1.00 గంట వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు పోలింగ్ కేంద్రాల గేట్లు మూసి క్యూ లైన్లలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా కట్టుదిట్టమైన శాంతిభద్రతలు అమలు చేసినట్టు తెలిపారు. రెండో విడతలో పోలింగ్ జరిగిన వనపర్తి, కొత్తకోట, మదనాపూర్, ఆత్మకూరు, అమరచింత మండలాల్లో మొత్తం కలిపి 1,03,406 ఓట్లు పోల్ కాగా, 87. 0% వోటింగ్ పర్సంటేజీ నమోదయింది. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.